శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము

మొదటి భాగము.

సంస్కృత మూలము

భగవాన్ వాల్మీకి మహర్షి

తేటతెలుగులో

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం

2-31, చైతన్యపురి,

హైదరాబాదు 500060

ఫో: 24048104

సెల్: 9391134792

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము.
తరువాత చేర్చబడినవి అను ఐదు సర్గలు.

రాముడు అగస్త్యునితో ఇలా అన్నాడు. "అగస్త్య మహర్షీ! తమరు చెప్పిన ప్రకారము ఋక్షరజస్సు వాలి సుగ్రీవుల తండ్రి కదా! మరి వారి తల్లి ఎవరు? ఆ అన్నదమ్ములకు వాలి, సుగ్రీవుడు అనే పేర్లు ఎలా వచ్చాయి?" అని అడిగాడు.

అప్పుడు అగస్త్యుడు ఇలా చెప్ప సాగాడు. "రామా! వాలి సుగ్రీవుల పూర్వవృత్తాంతమును సవిస్తరముగా చెబుతాను విను. ఒక సారి నారదుడు లోక సంచారముచేస్తూ నా ఆశ్రమమునకు వచ్చాడు. నేను నారదుడికి అర్ఘ్య పాద్యములు ఇచ్చి సత్కరించాను. నీ మాదిరి నేను కూడా వాలి సుగ్రీవుల గురించి అడిగాను. నారదుడు నాతో ఈ విధంగా చెప్పాడు.

"ఓ అగస్త్య మహర్షీ! ఉత్తర దిక్కున మేరు పర్వతము ఉన్నది. అది బంగారు కాంతితో మెరుస్తూ ఉంటుంది. ఆ మేరు పర్వతము మీద బ్రహ్మ దేవుని దివ్య భవనము ఉంది. ఆ భవనములోనే బ్రహ్మ గారు దేవతలతో సభ చేస్తూ ఉంటాడు. ఒకసారి బ్రహ్మదేవుడు యోగాభ్యాసము చేస్తున్నాడు. అప్పుడు బ్రహ్మదేవునికి కళ్లనుండి నీరు కారింది. బ్రహ్మదేవుడు ఆ కన్నీటి బొట్టును కొనగోటితో తీసి నేలమీద విదిల్చాడు. ఆ కన్నీటి బొట్టు నుండి ఒక వానరుడు పుట్టాడు.

ఆ వానరము బ్రహ్మదేవునికి నమస్కరించి నిలబడింది. అప్పుడు బ్రహ్మ ఆ వానరముతో ఇలా అన్నాడు. “ఈ పర్వత శిఖరము మీద అనేక ఫల వృక్షములు ఉన్నాయి. ఆ వృక్షముల నుండి ఫలములు కోసుకొని తింటూ నువ్వు ఇక్కడే ఉండు. నీకు అంతా మంచి జరుగుతుంది.” అని అన్నాడు. “అలాగే చేస్తాను” అని అన్నాడు వానరుడు.

ఆ వానరము ఆ ఫల వృక్షముల మీద తిరుగుతూ దుముకుతూ ఫలములు తింటూ హాయిగా కాలం గడుపుతున్నాడు. ప్రతిరోజూ ఉదయము సాయంత్రము బ్రహ్మ సభకు వెళ్లి బ్రహ్మదేవుని దర్శనము చేసుకుంటూ ఉండేవాడు. వెళ్లేటప్పుడు కొన్ని ఫలములను తీసుకొని వెళ్లి బ్రహ్మదేవునికి సమర్పించేవాడు. అలా కొంత కాలం గడిచింది.

ఒక రోజు అ వానరమునకు దాహం వేసింది. నీరు కోసరం వెదుక్కుంటూ వెళ్లిన ఆ వానరమునకు నిర్మల మైన జలము కల ఒక సరస్సు కనిపించింది. ఆ సరస్సులో జలము నిశ్చలంగా కదలకుండా ఉంది. ఆ వానరము నీళ్లుతాగడానికి ఆ సరస్సులోకి దిగబోతుంటే ఆ వానరానికి సరస్సులో తన ప్రతిబింబము కనిపించింది. “వామ్మో! వీడెవడో నాకు శత్రువు లాగా ఉన్నాడు. నా మాదిరి నేల మీద కాకుండా నీటిలో ఉంటున్నాడు.” అని అనుకొన్నాడు. నీటితో తన ప్రతిబింబాన్ని చూచి అరిచాడు. ఆ ప్రతి బింబం కూడా అరిచింది. “వామ్మో వీడెవడో నన్ను అవమానిస్తున్నాడు. వీడు పరమ దుర్మార్గుడులా ఉన్నాడు. ఈ సరస్సులో వీడు నివసిస్తూ ఉంటాడు కామాల్ను. వీడిని ఎలాగైనా పట్టుకోవాలి” అని అనుకొన్నాడు.

సహజంగా ఉన్న వానరచాపల్యము చేత తన ప్రతి బింబాన్ని పట్టుకోడానికి ఆ సరస్సులోకి దూకాడు ఆ వానరుడు. సరస్సులో ఎవరూ కనపడలేదు. వెంటనే నీటిలోనుండి పైకిలేచాడు. ఆ వానరము ఒక అందమైన స్త్రీగామారి పోయింది. అంతటి అందగత్తె మూడులోకములలో లేదు. ఆ స్త్రీ సాక్షాత్తు సరస్వతీ, లక్ష్మీ, పార్వతి లాగా ప్రకాశిస్తూ ఉంది.

ఆ సమయంలో ఇంద్రుడు బ్రహ్మసభనుండి స్వర్గానికి ఆమార్గంలో వెళుతున్నాడు. మార్గమధ్యములో ఆ స్త్రీని చూచాడు. అదే సమయంలో సూర్యుడు కూడా ఆ మార్గంలో వెళుతున్నాడు. సూర్యుడు కూడా ఆమెను చూచాడు. ఆమె కూడా దేవేంద్రుని, సూర్యుని చూచింది. ఆమెను చూచి దేవేంద్రునికి, సూర్యునికి మోహావేశము పుట్టింది. ఇద్దరి మనస్సులు కోరికలతో దహించుకుపోతున్నాయి. ఆ మోహావేశంలో ఇంద్రునికి వీర్య స్ఖలనము అయింది. ఇంద్రుని వీర్యము ఆమెవాలము మీద పడింది. . అప్పుడు ఆ స్త్రీ ఒక బలవంతుడైన వానరమును ప్రసవించింది. ఇంద్రుని రేతస్సు వాలము మీదపడింది కాబట్టి అతనికి వాలి అనిపేరు వచ్చింది.

దేవేంద్రుడికి మాదిరి సూర్యునికి కూడా రేతస్సు పతనం అయింది. ఆ రేతస్సు ఆమె కంఠము మీద పడింది. సూర్యుని రేతస్సు ప్రభావంతో ఆమె ఒక బలవంతుడైన కుమారుని ప్రసవించింది. రేతస్సు కంఠము మీద పడింది కాబట్టి అతని పేరు సుగ్రీవుడు (మంచి కంఠము కలవాడు)అనిపేరు వచ్చింది.. రేతస్సు పతనం కాగానే మహేంద్రుడికి, సూర్యుడికి కామవాంఛలు తగ్గిపోయాయి. ఎవరి దారిన వారు వెళ్లారు.

పోతూ పోతూ ఇంద్రుడు వాలికి ఒక బంగారుమాలను బహూకరించి వెళ్లాడు. సూర్యుడు సుగ్రీవునికి హనుమంతుడు మిత్రుడు అవుతాడు అని వరం ఇచ్చి వెళ్లిపోయాడు.

మరునాడు తెల్లవారగానే వాలి, సుగ్రీవులకు జన్మనిచ్చిన ఆ అందమైన స్త్రీ మరలా వానరంగా మారిపోయింది. తనకు పుట్టిన బలవంతుడైన వానరములను చూచింది. వాటికి తేనె ఆహారంగా ఇచ్చింది. ఆ వానరము పేరు ఋక్షరజస్సు. ఋక్షరజస్సు స్త్రీగా ఉన్నప్పుడు పుట్టిన వారే వాలి, సుగ్రీవులు. ఋక్షరజస్సు తన పుత్రులను తీసుకొని బ్రహ్మదేవుని వద్దకు వెళ్లాడు. బ్రహ్మదేవుడు వారిని కిష్కింధా పురమునకు పోయి వానరులకు రాజుగా కిష్కింధను ఏలుకోమన్నాడు.

తన పక్కనే ఉన్న దేవదూతను పిలిచి అతనితో ఇలా అన్నాడు. "ఓ దేవదూతా! నీవు వీరిని కిష్కింధా నగరమునకు తీసుకొని వెళ్లు. ఆ నగరము విశ్వకర్మ నిర్మించాడు. అది శత్రు దుర్భేధ్యమైన నగరము. ఆ నగరంలో బంగారము, వజ్రములు, కోకొల్లలుగా ఉన్నాయి. ఆ నగరంలో కామరూపులైన రకరకాల వానరులు నివసిస్తున్నారు. నీవు వీరిని కిష్కింధకు తీసుకొని వెళ్లి ఆ వానరులకు పరిచయం చెయ్యి. ఆ వానరులకు రాజు ఇతనే అని చెప్పు. ఈ ఋక్షరజస్సును సింహాసనము మీద కూర్చోబెట్టి కిష్కింధకు రాజుగా పట్టాభిషిక్తుని చెయ్యి. వానరులందరూ ఇతనికి వశులై ఉండాలని నా ఆజ్ఞగా చెప్పు." అని అన్నాడు.

బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు ఆ దేవదూత ఋక్షరజస్సును, అతని కుమారులు అయిన వాలి సుగ్రీవులను తీసుకొని కిష్కింధకు వెళ్లాడు. బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము ఋక్షరజస్సును కిష్కింధకు రాజుగా పట్టాభిషిక్తుని చేసాడు. లోకంలో ఉన్న వానరులకు, భల్లూకములకు అతనిని రాజుగా ప్రకటించాడు. ఆ విధంగా ఋక్షరజస్సు వాలి, సుగ్రీవులకు తల్లి, తండ్రి తానే అయ్యాడు. కిష్కింధకు రాజు అయ్యాడు. వానరులకు, భల్లూకములకు అధిపతి అయ్యాడు. రామా! ఆ విధంగా వాలి సుగ్రీవులు ఋక్షరజస్సుకు జన్మించారు" అని అగస్త్యుడు రామునికి వాలి సుగ్రీవుల జన్మవృత్తాంతమును వినిపించాడు.

రాముడు వాలి సుగ్రీవుల జన్మవృత్తాంతము విని ఆశ్చర్యచకితుడయ్యాడు. అప్పుడు అగస్త్యుడు రాముని తో ఇలా అన్నాడు. "రామా! ఇదే కాదు. ఇంకా ఆశ్చకరమైన విషయములు ఎన్నో ఉన్నాయి. అసలు రావణుడు సీతను ఎందుకు అపహరించాడో తెలుసా! దాని వెనుక ఒక పూర్వగాథ ఒకటి ఉంది. అది కూడా చెబుతాను విను. ఈ రావణుడు కృతయుగము నుండి ఉన్నాడు. ఆ కృతయుగంలో ఒక నాడు రావణుడు బ్రహ్మమానసపుత్రుడైన సనత్కుమారుని ఒకచోట కూర్చుని ఉండగా చూచాడు. రావణుడు సనత్కుమారుని చూడగానే రెండు చేతులు జోడించి నమస్కరించాడు. ఆయనతో ఇలా అన్నాడు. "ఓ మహర్షీ! అన్ని యుద్ధములలో దేవతలు విజయం పొందుతుంటారు కదా. ఎవరిని ఆశ్రయించి వారు ఆ విధంగా విజయం పొందుతున్నారు. దేవతలలో కెల్లా అత్యధికమైన బలము కలవాడు ఎవరు? బ్రాహ్మణులు ప్రతి నిత్యము ఎవరిని పూజిస్తూ ఉంటారు? యోగులు ఎవరిని ధ్యానిస్తూ ఉంటారు.

నాకు ఈ సందేహాలు మనసులో మెదులుతున్నాయి. మీరు నా సందేహములను తీర్చమని కోరుకుంటున్నాను." అని అడిగాడు రావణుడు. దానికి సనత్కుమారుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"ఎవరినైతే నువ్వు నిరంతరమూ ద్వేషిస్తున్నావో ఆ శ్రీమహావిష్ణువే లోక వ్యాపకుడు. ఈ విశ్వానికంతా ప్రభువు. ఆయన ఎప్పుడు పుట్టాడో ఎవరికీ తెలియదు. దేవతలే కాదు అసురులు కూడా ప్రతినిత్యము ఆయనను పూజిస్తూ ఉంటారు. ఆయన ఎల్లప్పుడూ నీళ్లలో పడుకొని ఉంటాడు. ఆయనను ధ్యానిస్తే సకల పాపములు హరించి పోతాయి. విష్ణువు నాభి నుండి పుట్టిన కమలములో నుండి బ్రహ్మదేవుడు స్వయంభువుగా జన్మించాడు. ఈ సకల చరాచర జగత్తును విష్ణువే సృష్టించాడు. ఆ విష్ణువు కొరకు యజ్ఞములు యాగములు చేస్తూ ఉంటారు. దైవత్వమును పొందుతూ ఉంటారు. అందరూ విష్ణువునే పూజిస్తూ ఉంటారు. ఈ విషయమునే వేదములు, పురాణములు, శాస్త్రములు ఘోషిస్తున్నాయి. విష్ణువు ధర్మపక్షపాతి. దేవతలు ధర్మపరులు అందుకని విష్ణువు దేవతల పక్షం వహించాడు. రాక్షసులను, దైత్యులను, అసురులను జయించాడు. అందుకే దేవతలు విష్ణువును ఆశ్రయించుకొని ఉంటారు. నిత్యమూపూజిస్తూ ఉంటారు." అని అన్నాడు సనత్కుమారుడు.

అప్పుడు రావణుడు ఇలా అడిగాడు. "ఓ మహర్షీ! విష్ణువు రాక్షసులను, అసురులను, దైత్యులను యుద్ధములో చంపుతుంటాడు కదా! వారి మరణానంతరము వారికి ఏ గతి కలుగుతుంది? వారు ఎక్కడకు వెళతారు. స్వర్గానికా లేక నరకానికా?" అని అడిగాడు

రావణుడు.

"యుద్ధములో దేవతల చేత చంపబడిన వాళ్లు అందరూ స్వర్గానికే వెళతారు. అందులో సందేహము లేదు. వారు సంపాదించుకున్న పుణ్యము అయి పోయిన తరువాత వారు చేసిన పాపకర్మములకు తగిన ఫలములను అనుభవిస్తారు. తరువాత మరలా మనుష్యలోకంలో పుడతారు. మరలా పాపపుణ్యాలు చేస్తారు. చనిపోయిన తరువాత వాటికి తగిన ఫలములను అనుభవిస్తారు. ఈప్రకారంగా జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటారు. కాని శ్రీమహావిష్ణువు చేతిలో మరణించిన వారు నేరుగా వైకుంఠమునకు వెళతారు. వారికి ఇంక పుట్టుక చావు లేదు. అందుకనే శ్రీమహావిష్ణువుకు కోపం వచ్చినా అది ఎదుటి వారికి వరంగా పరిణమిస్తుంది." అని అన్నాడు సనత్కుమారుడు.

అప్పుడు రావణునికి ఒక ఆలోచన వచ్చింది. ఈ విధంగా పుట్టడం చావడం మరలా పుట్టడం కన్నా ఒకే సారి శ్రీమహావిష్ణువు చేతిలో మరణిస్తే ఇంక చావుపుట్టుకలు ఉండవు కదా. శ్రీమహావిష్ణువు చేతిలో చావడంఎలాగా! అని ఆలోచించాడు. రావణుడు ఇలా ఆలోచిస్తూ ఉండగా, సనత్కుమారుడు రావణునితో ఇలా అన్నాడు. "రావణా! నీ మనసులో మెదిలో భావాలు నాకు అర్థం అయ్యాయి. నీ కోరిక సిద్ధిస్తుంది. కాని కొంతకాలం ఆగాలి." అని అన్నాడు. రావణుని మనసు తృప్తి పడింది. అసలు ఆవిష్ణువు గురించి తెలుసుకోవాలి అని అనుకున్నాడు రావణుడు.

"ఓ మహర్షీ! మీరు శ్రీమహావిష్ణువు గురించి చెప్పారు కదా! ఆయన ఎలా ఉంటాడు? ఆయనను ఎలా గుర్తు పట్టాలి?" అని అడిగాడు. అప్పుడు సనత్కుమారుడు రావణునితో ఇలా అన్నాడు. "శ్రీమహావిష్ణువు సర్వవ్యాపకుడు. అంతటా ఉన్నాడు. ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అన్న మాట లేదు. కాని మన ఇంద్రియములకు గోచరము కాడు. కంటితో చూడలేము. కాని ఈ చరాచర జగత్తు అంతటా తానే అయి ఉన్నాడు. అందుకని ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అని చెప్పలేము.

ఆయనకు ఒక రూపము లేదు. అన్ని రూపములు ఆయనవే! భూమి, స్వర్గము, పాతాళము, పర్వతములు, కొండలు, నదీనదములు, అరణ్యములు, జనపదములు, నగరములు అన్ని చోట్లా నిండి నిబిడీకృతమై ఉన్నాడు శ్రీమహావిష్ణువు. ఆయన స్వరూపము ఓంకారము. ఆయన స్థావరము సత్యము, ధర్మము. ఆయనే సకల దేవతలస్వరూపము. ఈ భూమిని తన తలమీద ధరించిన ఆదిశేషువుకూడా ఆయన స్వరూపమే. మనకు సంభవించే పగలు, రాత్రి, మాసములు, సంవత్సరములు, కాలము అన్నీ ఆయనే. ఆయన కాలస్వరూపుడు. మనము నిత్యము చూచే సూర్యుడు, చంద్రుడు ఆయనే. యముడు, వరుణుడు, వాయువు, అగ్ని, రుద్రుడు, ఇంద్రుడు, పంచభూతములు అన్నీ ఆయన స్వరూపాలే. ఆయన అవినాశి. నాశనము లేని వాడు. నిత్యుడు. ఆయనను ప్రార్థిస్తే ఈ సంసార దు:ఖముల నుండి బయటపడేస్తాడు.

ఆయన ఈ సమస్త జగత్తును ప్రకాశింపచేస్తున్నాడు. ఈ లోకములను సృష్టించి, పోషించి, లయం చేసే కర్త ఆయనే. సృష్టి స్థితి

లయాలు ఆయనకు ఒక ఆటవంటిది. సర్వవ్యాపి అయిన విష్ణువు గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆఖరుకు మేఘాలలో దాగి ఉన్నమెరుపు, ఉరుము కూడా ఆయనే.

ఆయనను మానవ రూపంలో దర్శించాలంటే ఆయన మేఘము వలె శ్యామల వర్ణంలో ఉంటాడు. ఆయన కళ్లు తామర రేకుల వలె ఉంటాయి. ఆయన వక్షస్థలము మీద శ్రీవత్సము అనే పుట్టు మచ్చ ఒకటి ఉంటుంది. యుద్ధములో విజయమును, అందరికీ ఐశ్వర్యమును ప్రసాదించే లక్ష్మీదేవి ఆయన వక్షస్థలములో కొలువుదీరి ఉంటుంది. ఆ విష్ణుస్వరూపమును దేవ,దానవ,గంధర్వ,యక్ష,మానవులు ఎవరూ చూడలేరు. కేవలం ఆయన అనుగ్రహం ఉంటేనే చూడగలరు. ఆ విష్ణువు అనుగ్రహం లేకుండా, ఎన్ని యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా, ఎంత తపస్సు చేసినా, ఎన్ని దానాలు ధర్మాలు చేసినా విష్ణువును చూడ్డం సాధ్యం కాదు.

కాబట్టి ముందు ఆ విష్ణువు అనుగ్రహానికి పాత్రులవడం అత్యంత ముఖ్యం. దానికి ఒకటే మార్గం. పూర్తిగా ఆ విష్ణువుకు తనను తాను అర్పించుకోవడం. ఆయనమీదనే మనసు నిలపడం. ఆయననే తన రక్షకుడుగా భావించడం. చేసిన పాపములను పుణ్యకార్యములతో ప్రక్షాళన చేసుకోవడం. కొత్త పాపాలు చేయకుండా ఉండటం. ఆ విష్ణువు మీద అచంచలమైన భక్తి విశ్వాసం కలిగి ఉండటం. ఈ మార్గం ద్వారానే విష్ణువును చూడగలరు.

ఓ రావణా! నీవు విష్ణువును చూడాలి అని అంటున్నావు కాబట్టి నీకు ఒక మార్గం చెబుతాను విను. ఇప్పుడు కృతయుగము నడుస్తూ ఉంది. కృత యుగము అయిపోగానే త్రేతాయుగము వస్తుంది. అప్పుడు విష్ణువు ఇక్ష్వాకు వంశములో దశరథ మహారాజు అనే క్షత్రియుడు అయోధ్యను రాజధానిగా చేసుకొని పరిపాలన చేస్తుంటాడు. ఆయనకు కుమారుడుగా రాముడు అనే పేరుతో విష్ణువు లోక కల్యాణము కొరకు జన్మిస్తాడు. ఆ రాముడు గొప్ప బలశాలి బుద్ధిశాలి. పరాక్రమ వంతుడు. ధైర్య సాహసములు కలవాడు. విష్ణువు నరుడిగా రాముడు అనే పేరుతో అవతరిస్తాడు. రామునికి జనకుడు అనే మిథిలా నగర చక్రవర్తి కూతురు సీత అనే కన్య భార్య అవుతుంది. సాక్షాత్తు లక్ష్మీ దేవి సీతగా అవతరించి రాముని వివాహం చేసుకుంటుంది. సీత రాముని విడిచి పెట్టి క్షణకాలం కూడా ఉండలేదు.   కాలవశమున, రాముని తండ్రి దశరథుడు రాముని అడవులకు పంపుతాడు. అప్పుడు రాముడు దండకారణ్యములో పర్ణశాల నిర్మించు కొని, తన భార్య సీత, తమ్ముడు లక్ష్మణునితో సహా అందులో నివసిస్తూ ఉంటాడు. రావణా! ఇదీ విష్ణుమూర్తి ప్రభావము." అని చెప్పాడు సనత్కుమారుడు.

అప్పటి నుండి రావణుని మనసులో ఒక ఆలోచన మెదిలింది. మామూలుగా మరణిస్తే మరలా పుట్టక తప్పదు. అదే విష్ణువు చేతిలో మరణిస్తే ఈ జనన మరణ చక్రం నుండి విముక్తి కలుగుతుంది. శాశ్వత వైకుంఠలోక ప్రాప్తికలుగుతుంది. కాబట్టి రామావతారంలో విష్ణువుతో వైరం ఎలా పెట్టుకోవాలి. విష్ణువు చేతిలో ఎలా మరణించాలి అని ఆలోచించసాగాడు. " అని అగస్త్యుడు రాముడికి రావణుని వృత్తాంతము

చెప్పాడు. ఇది విని రాముడు ఆశ్చర్యపోయాడు. "ఓ మహర్షీ! తరువాత ఏం జరిగింది వివరంగా చెప్పండి." అని అడిగాడు.

అప్పుడు అగస్త్యుడు ఇలా చెప్పసాగాడు. "తరువాత ఏముంది. నీతో ఎలా వైరం పెట్టుకోవాలా అని ఆలోచించిన రావణుడు, నువ్వు, సీత, లక్ష్మణుడు ఒంటరిగా దండకారణ్యంలో ఉన్నట్టు తెలుసుకున్నాడు. నిన్ను, లక్ష్మణుని మారీచుని సాయంతో బయటకు పంపి, నీ భార్య సీతను అపహరించి, నీకు ఆగ్రహం తెప్పించాడు. నీతో వైరం పెంచుకున్నాడు.

రామా! రావణునినైజం నీకు తెలిసినదే కదా! అతనికి బలం, పరాక్రమం ఉంది. అందుకు తగ్గట్టు బ్రహ్మఇచ్చిన వరాల ప్రభావం కూడా ఉంది. అందుకని లోకంలో ఉన్న రాజులందరినీ యుద్ధానికి పిలిచేవాడు. వారితో యుద్ధం చేసి ఓడించి తనకు దాసులుగా చేసుకొనే వాడు. వారి వద్ద ఉన్న కన్యలను అపహరించేవాడు. ఆ ప్రకారంగా జైత్రయాత్ర సాగిస్తున్న రావణునికి ఒక రోజు నారదుడు తారసిల్లాడు. రావణుడు నారదునికి నమస్కరించాడు. నారదుని ఇలా అడిగాడు. "ఓ నారద మహర్షీ! తమరు ముల్లోకములు సంచరిస్తూ ఉంటారు కదా! నాతో యుద్ధం చేసి గెలవ గల యోధుడు ఎవరైనా ఉన్నాడా! ఉంటే వాడు ఎక్కడ ఉంటాడో చెప్పండి" అని అడిగాడు. ఆ మాటలు విన్న రావణుడు నారదునితో ఇలా అన్నాడు.

"ఓ దానవేంద్రా! క్షీరసముద్రము దగ్గర ఒక ద్వీపము ఒకటి ఉంది. ఆ ద్వీపములో నివసించే మానవులు తెల్లగా ఉంటారు. వారి

శరీరాలు భారీగాఉంటాయి. వారు మాట్లాడుతుంటే ఉరిమినట్టు ఉంటుంది. వారు చాలా ధైర్యవంతులు. పరాక్రమవంతులు. వారు నీతో యుద్ధము చేయడానికి సమర్థులు అని నా అభిప్రాయము." అని అన్నాడు నారదుడు.

అప్పుడు రావణునికి ఒక అనుమానం వచ్చింది. "ఓ మహర్షీ! ఆ ద్వీపంలో అంతటి మహావీరులు తెల్లటి దేహాలతో ఎలా పుట్టారు. వారు అక్కడే ఎందుకు నివాసం ఉంటున్నారు." అని అడిగాడు. "ఏమీ లేదు రావణా! వారందరూ నారాయణుని భక్తులు. వారు ఎల్లప్పుడూ నారాయణ నామం జపిస్తూ, నారాయణుని గురించి తలుచుకుంటూ, ఏ చీకూ చింతా లేకుండా బతుకుతున్నారు. వారికి అదే ఉత్తమ గతి. నీకో విషయం తెలుసా! సతతం నారాయణ నామస్మరణ చేస్తూ నారాయణుని మనసులో ధ్యానించే వారికే ఆ శ్వేతద్వీపంలోకి ప్రవేశం కలుగుతుంది. అలాంటి వారే అక్కడ ఉండడానికి అర్హులు. మానవుల పూర్వపుణ్యఫలము చేతనే వారికి శ్వేతద్వీప నివాసము సిద్ధిస్తుంది. అంతే కాకుండా విష్ణువు చేతిలో, విష్ణువు సంధించిన బాణములతో మరణించిన వారికి కూడా ఈ శ్వేతద్వీములో నివాసము లభిస్తుంది. శ్వేత ద్వీప నివాసము యజ్ఞములు చేస్తే, యాగములు చేస్తే తపస్సు చేస్తే పొందలేరు. కేవలము వారి వారి పుణ్యఫలములచేత, విష్ణువు చేతిలో మరణించడం చేతనే పొందగలరు." అని చెప్పాడు నారదుడు.

వెంటనే రావణుడు "అలాగైతే నేను వెంటనే ఆ శ్వేతద్వీపమునకు పోయి విష్ణువుతో యుద్ధమే చేసి ఆయన చేతిలో

మరణించి శాశ్వతముగా శ్వేత ద్వీప నివాసము పొందుతాను." అని మనసులో అనుకొన్న రావణుడు. శ్వేత ద్వీపానికి బయలుదేరాడు. రావణుని దూకుడు చూచి నారదుడు ఆశ్చర్యపోయాడు. అక్కడ ఏంజరుగుతుందో చూద్దామని నారదుడు కూడా శ్వేతద్వీపానికి వెళ్లాడు. రావణుడు తన రాక్షస సేనలతో మంత్రులతో సేనాపతులతో శ్వేతద్వీపానికి చేరుకున్నాడు.

ఆ శ్వేత ద్వీపము మహా తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంది. రావణుని పుష్పక విమానము ఆ ద్వీపం దరిదాపులకు కూడా వెళ్లలేకపోయింది. ఆ శ్వేతద్వీప మహత్తును చూచి రావణుని మంత్రులు సేనాపతులు వణికిపోయారు. "రాజా! మా వల్ల కావడం లేదు. శరీరాలు పట్టు తప్పుతున్నాయి. స్పృహ తప్పిపోతూ ఉంది. ఈ పరిస్థితులలో మేము యుద్ధం చేయలేము." అని విన్నవించుకున్నారు. రావణునికి ఏమీ తోచలేదు. పుష్పకము కదలడం లేదు. మంత్రులు సేనాపతులు,సైన్యము యుద్ధం చేయమని మొరాయిస్తున్నారు. అందుకని రావణుడు మొండి ధైర్యంతో పుష్పకము దిగి, ఒంటరిగా ఖడ్గం చేత ధరించి శ్వేతద్వీపము వైపు వెళ్లాడు.

ఇంతా చేస్తే ఆ శ్వేతద్వీపంలో అంతా ఆడవాళ్లు ఉన్నారు. అత్యంత సౌందర్యంతో మెరిసిపోతున్నారు. అందులో ఒక స్త్రీ రావణుని చేయి పట్టుకొని "నీవు ఎవరు? ఇక్కడకు ఎందుకు వచ్చావు? నీ తల్లి తండ్రులు ఎవరు? నిన్ను ఇక్కడకు ఎవరు పంపారు?" అని ప్రశ్నల వర్షం కురిపించింది. ఒక ఆడది తనను అన్ని ప్రశ్నలు వేయడం సహించలేక

పోయాడు రావణుడు. కోపంతో ఊగిపోయాడు. “నేను విశ్రవసుని పుత్రుడను. పులస్త్య బ్రహ్మ పౌత్రుడను. రావణుడను. నాకు యుద్ధము అంటే ప్రాణం. నేను యుద్ధం చేయడానికి ఇక్కడకు వచ్చాను. కాని ఇక్కడ నాతో యుద్ధం చేయగల మగాడు కనిపించడం లేదు.” అని అన్నాడు. ఆ మాటలకు ఆ స్త్రీలు కిలా కిలా నవ్వారు. నీతో యుద్ధం చేయడానికి మగాళ్లు కావాలా! మేము లేమా!” అంటూ ఆ స్త్రీ రావణుని చిన్న పిల్ల వాడిని పట్టుకున్నట్టు రెండు చేతులతో నడుము దగ్గర పట్టుకొని పైకి ఎగరేసింది. రావణుడు బాలుని మాదిరి పైకి ఎగిరాడు. ఆ ఎగిరిన రావణుని మరొక స్త్రీ పట్టుకుంది. ఆ స్త్రీ రావణుని మరలా పైకి ఎగరేసింది. మరొక స్త్రీ పట్టుకొంది. అలా ఆ స్త్రీలందరూ రావణుని బంతిలా ఎగరేస్తూ పట్టుకుంటూ ఆడుకున్నారు.

అందులో ఒకామె “ఒసేయ్! వీడికి పదితలలు, ఇరవై చేతులు ఉన్నాయే. వీడు పురుగులా ఉన్నాడే. వీడిని పట్టుకుంటాను చూడు” అంటూ రావణుని చిన్న పురుగును పట్టుకున్నట్టు పట్టుకొని గిరాటేసింది. రావణుని మరొక స్త్రీ పట్టుకొని పైకి విసిరేసింది. అలా రావణునితో వారందరూ ఆడుకుంటున్నారు. ఈ హింసను తట్టుకోలేక రావణుడు ఒక స్త్రీ చేతిని పట్టుకొని పళ్లతో కొరికాడు. “ఛీ ఛీ” అంటూ ఆ స్త్రీ రావణుని విసిరేసింది. అది చూచి మరొక స్త్రీ రావణుని పురుగును పట్టుకున్నట్టు పట్టుకొని ఆకాశంలోకి ఎగిరింది. రావణుని కోపం మిన్నుముట్టింది. ఆ స్త్రీని కూడా రావణుడు గోళ్లతో పీకాడు. “ఛీ పాడు” అంటూ ఆ స్త్రీ రావణుని విదిలించి కొట్టింది. ఆ విదిలించిన వేగానికి రావణుడు సముద్రంలో పడిపోయాడు.

ఆ విధంగా రావణుని ఈ స్త్రీలు బంతాట ఆడుకున్నారు. రావణుని అవస్త చూచిన నారదుడు రావణుని ఎదుట నిలిచి పెద్దగా నవ్వుతూ నృత్యం చేసాడు.” అని చెప్పాడు అగస్త్యుడు. ఈ కధంతా విని రాముడు ఆశ్చర్యపోయాడు. అగస్త్యుడు రాముని చూచి ఇలా అన్నాడు. “ రామా! ఇన్ని అవస్థలు పడ్డ రావణుడు నీ చేతిలో మరణించడానికే నీ భార్య సీతను అపహరించాడు. రావణుడికి నీవే నారాయుడివి అని తెలుసు. నీవు రాక్షససంహారము కొరకు రాముడిగా అవతరించావు అని కూడా తెలుసు. కానీ నీవే నీ అవతార రహస్యమును తెలుసుకోలేక పోతున్నావు.

కాబట్టి రామా! ఇప్పటి కన్నా నీవు విష్ణువు అవతారము అని తెలుసుకో! నీవు త్రికాలములు తెలిసిన వాడవు. నీవు మూడు వేదములతో కీర్తింపబడుతున్నావు. మూడు అడుగులు బలిని దానం అడిగి మూడులోకములు ఆక్రమించావు. నీవు సనాతనుడవు అయిన విష్ణువు. లోక కల్యాణార్థము రామునిగా అవతరించావు. దేవతల కార్యములు నిర్వర్తించావు. లోక కంటకుడైన రావణుని, పుత్ర,మంత్రి, సామంత,పరివార సమేతంగా వధించావు. లోక కల్యాణము చేకూర్చావు. నీవు చేసిన పని వలన దేవతలు, ఋషులు, మునులు ఎంతో సంతోషించారు. ఇప్పుడు ముల్లోకములు రాక్షసుల వలన ఎలాంటి భయం లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నాయి. నీ భార్య సీత సాక్షాత్తు లక్ష్మీదేవి అవతారము. నీ కొరకే ఆమె జనకుని ఇంట జన్మించింది. రావణుడు సీతను లంకలో ఉంచి జాగ్రత్తగా రక్షించాడు. ఒక తల్లిని కొడుకు ఎలా చూచుకుంటాడో అలా చూచుకున్నాడు రావణుడు. పూర్వము ఈ కధను సనత్కుమారుడు

రావణునికి చెబితే, నారదుడు నాకు చెప్పాడు." అని అగస్త్యుడు రామునికి రావణ వృత్తాంతమును సవిస్తరంగా చెప్పాడు. రామ,లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు ఈ కథవిని ఆశ్చర్యపోయారు. సీతాపహరణం వెనుక ఇంత కథ ఉందా అని అనుకున్నారు. ఈ కథవిన్న సుగ్రీవుడు మొదలగు వానర ప్రముఖులు, విభీషణుడు, అతని మంత్రులు, రాముని సామంత రాజులు, పుర ప్రముఖులు అందరూ ఆనంద పరవశులయ్యారు. అప్పుడు అగస్త్యుడు రాముని వద్ద సెలవు తీసుకొని తన ఆశ్రమమునకు వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము ప్రక్షిప్త సర్గలు సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
ముప్పది ఎనిమిదవ సర్గ.

ఇక్ష్వాకు కులతిలకుడైన శ్రీరామచంద్రుడు అయోధ్యానగరానికి పట్టాభిషిక్తుడయ్యాడు. ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలిస్తున్నాడు. ఎవరికి తగిన పనులను వారికి అప్పగిస్తూ అందరి చేతా పనులు చేయించు కుంటున్నాడు. ఇలా కొన్ని రోజులు గడిచాయి. పట్టాభిషేక మహోత్సవము నకు వచ్చిన ఆహుతులందరూ ఎవరి నగరములకు వారు వెళ్లిపోయారు. ఒక రోజు రాముడు తన మామగారు జనకమహారాజును చూచి ఇలా అన్నాడు. "ఓ జనకమహారాజా! మీ ఆశీస్సులవలననే నేను రాక్షస సంహారం

చేయగలిగాను. మీ ఆశీస్సుల వలననే నేను అయోధ్యారాజ్యమును జనరంజకంగా పరిపాలిస్తున్నాను. మా ఇక్ష్వాకు వంశస్థులకు, మిథిలా నగర వాసులకు కల సంబంధము అద్వితీయము. మీరు నాచే ఇవ్వబడే కానుకలను స్వీకరించండి. భరతుడు మిథిలా నగరం వరకూ మీకు సాయంగా మీతో వస్తాడు." అని అన్నాడు. జనకుడు సరే అన్నాడు. మిథిలకు ప్రయాణము అయ్యాడు. రాముడు తనకు ఇచ్చిన బహుమతులను రత్నములను, బంగారమును, విలువగల వస్తువులు అన్నింటినీ తన కుమార్తెలకు ఇచ్చాడు. జనకుడు మిథిలకు వెళ్లిపోయాడు.

తరువాత భరతుని మేనమామ అయిన కేకయ రాజును చూచి రాముడు ఇలా అన్నాడు. "నీ ఆశీర్వాదము వలననే భరతుడు ఇన్నాళ్లు రాజ్యపాలన చేసాడు. తరువాత నాకు రాజ్యము అప్పగించాడు. ఇప్పుడు యువరాజుగా నాతో పాటు పాలనా బాధ్యతలు స్వీకరించాడు. ఇదంతా మీ శుభాశీస్సులవలననే జరిగింది. కేకయ దేశములో మీ తండ్రిగారు మీ కొరకు అనుదినము ఎదురుచూస్తూ ఉంటారు. నా శక్తికొలది మీకు ధనము, బంగారము, మణిమాణిక్యాదులు బహుమతిగా ఇస్తున్నాను. వాటిని తీసుకొని లక్ష్మణుడు తమ వెంట వస్తున్నాడు." అని అన్నాడు రాముడు. దానికి భరతుని మేనమామ యుధాజిత్తు ఇలా అన్నాడు. "రామా! నాకెందుకయ్యా ఈ బహుమానములు. అవన్నీ ఇక్కడే ఉండనీ." అని అన్నాడు. తరువాత రాముని వద్ద సెలవు తీసుకొని యుధాజిత్తు కేకయ రాజ్యమునకు వెళ్లిపోయాడు. ఆయనకు తోడుగా లక్ష్మణుడు ఆయన వెంట వెళ్లాడు.

తరువాత కాశీరాజు ప్రతర్ధనుడిని చూచి రాముడు ఇలా అన్నాడు. “రాజా! మీ సహాయ సహకారముల వలన భరతుడు ఈ 14 ఏళ్లు రాజ్యపాలన చేయగలిగాడు. ఇన్నాళ్లు అయోధ్యలో ఉండటం వలన అక్కడ కాశీరాజ్యములో పరిపాలన సక్రమంగా జరుగుతున్నట్టు లేదు. అందుకని తమరు కాశీరాజ్యమునకు వెళ్లడం ఉత్తమం.” అని కాశీరాజుకు అనేక బహుమానములు ఇచ్చాడు. ఆ బహుమానములను తీసుకొని కాశీరాజు వారణాసికి ప్రయాణమై వెళ్లాడు.

తరువాత తనకు సామంతులు, పట్టాభిషేక మహోత్సవమును చూడటానికి వచ్చిన 300 మంది రాజులను చూచి రాముడు ఇలా అన్నాడు. “ఓ రాజోత్తములారా! మీ అందరి శుభాశీస్సులతో నేను రాక్షస సంహారము చేయగలిగాను. మీ అందరి సహాయ సహకారాలు లేకుండా నేను ఏమీ చేయగలిగే వాడిని కాదు. నేను దండకారణ్యములో ఉండగా రావణుడు సీతను అపహరించాడు అని తెలిసిన భరతుడు నాకు సాయంగా మిమ్ములను అందరినీ పిలిపించాడు. కాని నాకు మీ సాయము తీసుకోవలసిన అవసరమురాలేదు. అందుకని ఈసంవత్సర కాలము మీరు ఇక్కడే ఉండిపోయారు. ఇంక మీరు మీ మీ రాజ్యములకు వెళ్లండి.” అని అన్నాడు రాముడు. రాముని మాట మేరకు అందరూ వారి వారి రాజ్యములకు వెళ్లిపోయారు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము ముప్పది ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

ముప్పది తొమ్మిదవ సర్గ.

అయోధ్యనుండి వెళ్లిన ఆ రాజులు రామునికి యధాతథముగా కానుకలు కప్పములు పంపారు. ఆ రాజులను అనుసరించి వెళ్లిన భరత శత్రుఘ్నులు ఆ కానుకలు అన్నీ అయోధ్యకు తీసుకొని వచ్చారు. రామునికి ఇచ్చారు. రాముడు ఆకానుకలను అన్నీ సుగ్రీవునికి, విభీషణునికి, వానర వీరులకు పంచి ఇచ్చాడు.

తరువాత రాముడు అంగదుని, హనుమంతుని చూచి సుగ్రీవునితో ఇలా అన్నాడు. "సుగ్రీవా! వాలి పుత్రుడు అయిన అంగదుడు నీకు కూడా కుమారుడే. ఈ హనుమంతుడు నీకు సచివుడు. వీరికి కూడా నీకు చేసిన సత్కారములే చెయ్యాలి." అని పలికిన రాముడు అంగదునికి, హనుమకు తన ఒంటి మీద ధరించిన అమూల్యములైన రత్నహారములను తీసి అంగదునికి హనుమకు ధరింపచేసాడు. తరువాత రాముడు వానర వీరులైన నీలుడు, నలుడు,కేసరి, కుముదుడు, గంధమాధనుడు, సుషేణుడు, పనసుడు, మైందుడు, ద్వివిదుడు, జాంబవంతుడు, గవాక్షుడు, వినతుడు,ధూమ్రుడు, వలీముఖుడు ,ప్రజంఘుడు, సంనాదుడు,మహాబలుడు, దధీముఖుడు, ఇంద్రజానుడు తదితర వానర వీరులను పేరుపేరునా పిలిచి సత్కరించాడు రాముడు. వారితో ఇలా అన్నాడు.

"ఓ వానరవీరులారా! మీ వలననే నేను ఈ మహత్కార్యమును చేయగలిగాను. మీరే లేకపోతే నాకు సీత జాడ తెలిసేది కాదు. ఈయుద్ధము జరిగేది కాదు. మీరందరూ నాకు సోదర సమానులు. మీ నాయకుడు సుగ్రీవుడు ధన్యుడు." అని వారిని పిలిచి ప్రేమతో వారినందరినీ విడివిడిగా కౌగలించుకున్నాడు. తరువాత ఆ వానర వీరులు, వానరులు కొంత కాలము అయోధ్యలో ఉన్నారు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము ముప్పది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నలుబదియవ సర్గ.

ఆ ప్రకారంగా వానరులు వానర వీరులు అయోధ్యలో సకలసౌకర్యముడు అనుభవిస్తూ ఉన్నప్పుడు ఒక రోజు రాముడు సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు. "సుగ్రీవా! మీరు వచ్చి చాలాకాలము అయింది. అక్కడ కిష్కింధ ఎలా ఉందో ఏమో. మీరు వెంటనే కిష్కింధకు వెళ్లండి. మీ రాజ్యమును వానర రంజకంగా పాలించండి. అంగదుడిని, హనుమను, నలుడిని ప్రేమానురాగాలతో చూచుకో. నీ మామగారు సుషేణుడిని, తారుడిని, కుముదుడిని, నీలుడిని, శతబలిని, మైందుడిని, ద్వివిదుడిని, గజుడిని, గవాక్షుడిని, గవయుడు, శరభులను,

జాంబవంతుడిని, గంధమాధనుడిని, ఋషభుడిని, సుపాటలుడిని, కేసరిని, శరభుడిని, శంఖచూడుని, వీరే కాదు నా కోసం ప్రాణాలకు కూడా తెగించి యుద్ధం చేసిన అందరినీ ప్రేమతో చూచుకో." అని అన్నాడు రాముడు. రాముని మాటలను శ్రద్ధగా విన్నాడు సుగ్రీవుడు.

తరువాత రాముడు విభీషణుని చూచి ఇలా అన్నాడు. "విభీషణా! నీవు లంకను ధర్మమును అనుసరించి పాలించు. నీకు ధర్మము అధర్మము గురించి నేను చెప్ప పనిలేదు. నీ సోదరుడు కుబేరుని ఆదరంతో చూచుకో. లంకా నగరంలోని నీ ప్రజలను ఆదరంతో పాలించు. ఏ సమయంలో కూడా నీ బుద్ధిని పెడతోవ పట్టనీయకు. అధర్మం జోలికి వెళ్లకు. రాజసుఖములలో పడి నన్ను, సుగ్రీవుని మరిచిపోవద్దు." అని విభీషణుడికి హితోపదేశము చేసాడు రాముడు.

రాముని మాటలు విన్న రాక్షసులు వానరులు రాముని ఎంతగానో ప్రశంసించారు. ఆ సమయంలో హనుమంతుడు రామునికి నమస్కరించి ఇలా అన్నాడు. "రామా! నా మనసు, బుద్ధి ఎల్లప్పుడూ నీ మీదనే ఉండేటట్టు నన్ను అనుగ్రహించు. రామ చరిత్ర ఈ లోకంలో ప్రచారంలో ఉన్నంత కాలము నేను జీవించి ఉండేటట్టు నాకు వరం ప్రసాదించు. నేను నిరంతరమూ నీ నామము, నీ చరిత్రను జపిస్తూనే ఉంటాను. వింటూఉంటాను. పాడుతూ ఉంటాను. రామ నామాన్ని జపిస్తూ, రామ చరితను వింటూ నా బాధలను, కష్టాలను మరిచిపోతాను. నిత్యం సంతోషంగా ఉంటాను." అని ఆర్తితో అంటున్న హనుమను చూచి రాముడు తన సింహాసనము నుండి లేచి వచ్చి

హనుమను గట్టిగా కౌగలించుకున్నాడు. "హనుమా! నీవు కోరిన విధముగా అన్నీ జరుగుతాయి. సందేహము లేదు. రామ కథ ఈ లోకంలో ఎంతకాలము నిలిచి ఉంటుందో అంతకాలము నీ కీర్తి నిలిచి ఉంటుంది. అంత కాలము నీవు చిరంజీవిగా ఉండగలవు. రామ కథ సూర్య చంద్రులు ఉన్నంత కాలము ఈ లోకంలో నిలిచి ఉండగలదు. హనుమా! నీవు నాకు చేసిన ఉపకారములకు ఒక్కొక్కదానికీ నా ప్రాణములు ఇచ్చినా సరిపోదు. అప్పుడు మిగిలిన ఉపకారములకు నేను ఏమి ఇవ్వగలను. నీవు నాకు చేసిన ఉపకారములకు ప్రత్యుపకారము చేయడం అంటే నిన్ను, నీవు చేసిన ఉపకారములను అవమాన పరచడమే అవుతుంది. అందుకని నీవు నాకు చేసిన ఉపకారములను నాలోనే జీర్ణం చేసుకుంటాను. నీకు జీవితాంతము ఋణపడి ఉంటాను." అని అన్నాడు రాముడు. వెంటనే తన మెడలోని రత్నహారమును తీసి హనుమ మెడలో వేసాడు.

తరువాత వానర వీరులు అందరూ రామునికి నమస్కరించి కిష్కింధకు బయలుదేరారు. సుగ్రీవుడు, విభీషణుడు, హనుమంతుడు రాముని విడువ లేక విడువ లేక విడిచి వెళ్లారు. వారి ఆత్మలన్నీ రాముని వద్దనే విడిచి పెట్టి కేవలం వారి దేహములు మాత్రమే అయోధ్యను విడిచిపెట్టి వెళ్ళాయి. వారందరూ రామునికి నమస్కారములు చేసి తమ తమ గృహములకు వెళ్లిపోయారు

. శ్రీమద్రామాయణము

ఉత్తరకాండమునలుబదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నలుబది ఒకటవ సర్గ.

పట్టాభిషేక మహోత్సవానికి వచ్చిన వారందరూ వెళ్లిపోయారు. రాముడు పరిపాలనా కార్యములలో నిమగ్నం అయ్యాడు. ఒక రోజు రాముడు తన మందిరము పైభాగం మీద కూర్చొని తన తమ్ములతో మాట్లాడుతూ ఉంటే ఆకాశంలో పుష్పక విమానము కనిపించింది. పుష్పకములో నుండి మాటలు వినిపించాయి.

"నేను పుష్పకమును. కుబేరుడి వద్దనుండి వచ్చాను. తమరి ఆజ్ఞమేరకు నేను కుబేరుని వద్దకు వెళ్లాను. ఆయన నాతో ఇలా అన్నాడు. "ఓ పుష్పక విమానమా! నిన్ను రావణుడు నాతో యుద్ధం చేసి అపహరించాడు. ఇన్నాళ్లు నీవు రావణుని అధీనంలో ఉన్నావు. ఇప్పుడు రాముడు రావణుని చంపాడు. రావణుని రాజ్యము, ఆస్తి రాముని వశం అయింది. నీవు రావణుని సొత్తు కాబట్టి రావణుని మరణం తరువాత నీవు రాముని సొత్తు అయ్యావు. కాబట్టి నీవు రాముని వద్దకు వెళ్లు. రాముని సేవించు. అదే నా కోరిక." అని అన్నాడు. నేనుకుబేరుని ఆదేశానుసారము తమరి వద్దకువచ్చాను. నన్ను స్వీకరించండి." అని పుష్పకము పలికింది.

ఆమాటలు విన్న రాముడు ఆశ్చర్యపోయాడు. పుష్పకమును అయోధ్యలో దిగమన్నాడు. "ఓ పుష్పక విమానమా! నీకు స్వాగతము. రావణుడు నిన్ను కుబేరుని వద్దనుండి అపహరించాడు కాబట్టి నిన్ను నీ

అసలు యజమాని అయిన కుబేరుని వద్దకు పంపాను. కుబేరుడే తిరిగి నిన్ను నా వద్దకు పంపాడు కాబట్టి నీవు నా దగ్గర ఉండవచ్చును. నేను నిన్ను అవసరము వచ్చినప్పుడు ఉపయోగించుకుంటాను. నేను పిలిచినప్పుడు నా వద్దకు రా"అని అన్నాడు. తరువాత రాముడు తన తమ్ములతో సహా పుష్పక విమానమును పుష్పములతో పూజించాడు. పుష్పకము రాముని పూజలు అందుకొని తన దారిన తాను వెళ్లింది.

అప్పుడు భరతుడు రాముని చూచి ఇలా అన్నాడు. "రామా! నీ పరిపాలనలో ప్రజలు సుఖంగా ఉన్నారు. జంతువులు పక్షులు కూడా మనుష్య భాషలో మాట్లాడటం గమనించాను. రాజ్యములో రోగముల బాధలేదు. అంతా ఆరోగ్యంగా ఉన్నారు. మరణాలు కూడా బాగా తగ్గిపోయాయి. మానవుల ఆయు:ప్రమాణము పెరిగింది. స్త్రీలు కూడా ఆరోగ్యవంతులయిన బిడ్డలను ప్రసవిస్తున్నారు. శిశు మరణాలు తగ్గిపోయాయి. మేఘములు కూడా సకాలంలో వర్షాలుకురుస్తున్నాయి. పంటలుబాగా పండుతున్నాయి. రాముని వంటిరాజు మాకు కావాలని ప్రజలు అనుకుంటున్నారు." అని పలికాడు భరతుడు.

(భరతుని మాటలు గమనించండి. రాముని రాజ్యంలో ఆరోగ్య శాఖ, మాతా శిశు సంరక్షణ శాఖ, వ్యవసాయ శాఖ ఎంత సమర్ధవంతంగా పనిచేస్తున్నాయో అర్థం అవుతోంది కదా! సరిగ్గా ఈ శాఖలే ఈ నాడు నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి. రోగాలు రాకుండా ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు తీసుకోదు. కాలువలు నాలాలు బాగు చెయ్యరు. అక్కడ రోగక్రిములు, దోమలు తామర తంపరగా పుట్టి

యధాశక్తి రోగాలు వ్యాప్తిచేస్తున్నాయి. రోగాలు వస్తే హాస్పిటల్సులో డాక్టర్లు ఉండరు. మందులుండవు. రోగనిర్ధారణకే వేలకు వేలు ఖర్చువుతోంది. ఇంకమందులు సరేసరి. ఉన్న ధనం అంతా కాట్రాక్టర్లకు దోచిపెట్టడానికి, వారి వద్ద నుండి వాటాలు పుచ్చుకోడానికే సరిపోదు. ఇంక వైద్యానికి డబ్బు ఎక్కడినుండి వస్తుంది. రాజకీయనాయకులకు ఇవేమీ పట్టవు తమ స్వార్ధం తప్ప. ఇంక రామరాజ్యం రమ్మంటే ఎలా వస్తుంది.)

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నలభై ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నలభై రెండవ సర్గ.

ఒక రోజు రాముడు ఉద్యాన వనములో ప్రవేశించాడు. దాని పేరు అశోక వనము. ఆ వనములో అనేక రకములైన లతలు, వృక్షములు పెరుగుతున్నాయి. చంపక, పున్నాగ, అశోక, మధూక, పనస, చూత, జామ, పారిజత వృక్షములు పెరుగుతున్నాయి. పుష్పములతో ఫలములతో శోభాయమానంగా ఉన్నాయి. ఇవే కాకుండా ఆ వనము అరటి, అర్జున, నాగ, లోధ్ర, నీవ (వేప) గురివెంద, మందార, వృక్షములతోనూ తీగలతోనూ శోభిల్లుతూ ఉంది. అశోక వనములో వృక్షములు అన్ని కాలములలోనూ ఫలములతో, పూలతో, నిండుగా ఉంది. ఆ వనమును రక్షించే వారు ఆ వనములోని చెట్లను రకరకాలుగా కత్తిరించి

మృగములు, తోరణములు ఆకారములలో మలిచారు. ఆ వనములో అన్ని రకాల పక్షులు, కోయిలలు, చిలుకలు నివాస మేర్పరచుకొని నివసిస్తున్నాయి. మామిడి చిగుళ్లు తింటూ కోయిలలు మనోహరంగా కూస్తుంటే వినసొంపుగా ఉండేది.

ఆ వనమునకు నీరు కావాలి కదా. అందుకని అనేకములైన బావులు, దిగుడు బావులు తవ్వించారు. ఆ వనములో అందమైన పచ్చికబీళ్లు దర్శనం ఇస్తాయి. అశోక వృక్షములు ఒకదానితో ఒకటి పోటీ పడుతూ ఆకాశాన్నంటేటట్టు పెరుగుతున్నాయి. రాముని ఆధ్వర్యంలో పెంచబడుతున్న ఆ ఉద్యానవనము స్వర్గలోకంలో ఉన్న నందనవనమును తలపిస్తూ ఉంది.

(లంకలో అశోక వనము, అయోధ్యలో అశోక వనము... నాటి రాజులు వృక్షములు, మొక్కలు పెంపకం మీద ఎంత శ్రద్ధ పెట్టారో, ప్రకృతి పరిరక్షణ కొరకు ఎంతగా పాటుపడుతున్నారో, మనకు తెలుస్తోంది కదా! ఈ రోజుల్లో ఇంత టెక్నాలజీ ఉండికూడా, ఎక్కడో ఒకటి రెండు పార్కులు తప్ప, మిగిలిన పార్కులలో పచ్చదనం కరువయింది. ఎండి పోయిన చెట్లు, మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. పార్కులకు ఉపయోగించే స్థలంలో కూడా అపార్టుమెంట్లు కట్టేసి, పచ్చదనాన్ని పాడుచేస్తున్నారు నేటి వ్యాపారవేత్తలు. చెరువులను పూడ్చి బావులను పూడ్చి ఆస్థలంలో బహుళ అంతస్థుల భవనాలు లేపుతున్నారు. పునాదులు సరిలేక అవి అలాగే కుంగి పోవడం మనం చూస్తూనే ఉన్నాం. ఇదీ నేటి తీరు.)

ఒకరోజు రాముడు సీత ఆ వనములో విహరిస్తున్నారు. రాముడు, సీత ముందు నర్తకీమణులు నృత్యం చేస్తున్నారు. రాముడు, సీత ఆరగించడానికి ఫలములు, వండిన పదార్థములు సిద్ధం చేసారు. ఆ ప్రకారంగా సీతా రాములు ఆనందంగా కాలం గడుపుతున్నారు. రాముడు పదివేల సంవత్సరములు రాజ్యపాలన చేసాడు. రాముడు ప్రతి రోజూ తెల్లవారు జామున లేచి కాలకృత్యములు తీర్చుకొని స్నానాదులు కావించి సంధ్యావందనము చేసి, రాచ కార్యములు అన్నీ పగలు పూర్తి చేసుకొని, సాయం సమయానికి సీతాదేవి వద్దకు వచ్చేవాడు. రాముని భార్య సీత కూడా పొద్దుటే లేచి స్నానాదులు ఆచరించి దేవతార్చన చేసి, తరువాత తన ముగ్గురు అత్తగార్ల వద్దకు పోయి వారికి తగు సేవలు చేసి, సాయం కాలానికి సకలాలంకార భూషితురాలై రాముని రాక కొరకు ఎదురు చూస్తూ ఉండేది.

సర్వమంగళ అయిన సీతను చూచి రాముడు పరమానందము చెందేవాడు. ఆమె అందచందములను మెచ్చుకొనేవాడు. ఇంతలో సీత గర్భవతి అయింది. ఈ సంగతి రామునికి తెలిసింది. రాముడు పరమానంద భరితుడయ్యాడు. "ఓసీతా! నీ వలన నాకు ఉత్తమ సంతానము కలుగబోతున్నారు. ఈ సమయంలో ఆడవాళ్ల ఏవేవో కోరికలు ఉంటాయి అంటారు కదా! నీకు కూడా ఏవైనా కోరికలు ఉంటే చెప్పు తీరుస్తాను." అని అన్నాడు రాముడు. అప్పుడు సీత రామునితో ఇలా అంది. "నాకు ఈ సమయములో గంగా తీరమున ఉండే పరమ పవిత్రములైన తపోవనములలో విహరించాలని, అక్కడి మునులు, ఋషుల ఆశీర్వాదము తీసుకోవాలనీ, వారి పాదధూళి శిరస్సున

ధరించాలని చాలాకోరికగా ఉంది. సాధారణంగా ఈ సమయములో ఆడవాళ్లు పుట్టింట్లో నిదుర చేయాలని అంటారు. కానీ నాకు గంగాతీరములో ఉండే ముని ఆశ్రమములలో ఒక్క రాత్రి అన్నా నిద్ర చేయాలని కోరికగా ఉంది. ఇదే నా కోరిక." అంది సీత.

" ఇంతేనా! నీ కోరిక తప్పక తీరుస్తాను. రేపే మనము గంగానదీ తీరాన ఉన్న ఋషుల ఆశ్రమములకు వెళుదాము." అని అన్నాడు రాముడు. తరువాత రాముడు తన స్నేహితులతో గడపడానికి వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నలభైరెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నలభై మూడవ సర్గ.

రాముడు ఉన్నతమైన ఆసనము మీద కూర్చుని ఉన్నాడు రాముని చుట్టు అతని స్నేహితులు కూర్చుని ఉన్నారు. అంతా సరదాగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ ఉన్నారు. రాముని చుట్టు విజయుడు, మధుమత్తుడు, కాశ్యపుడు, మంగళుడు, కులుడు, సురాజి, కాలియుడు, భద్రుడు, దంతవక్త్రుడు, సుమాగధుడు అనే పేరుగల వాళ్లు కూర్చుని ఉన్నారు. అంతా సరదాగా మాట్లాడుకుంటున్నారు. మాటల సందర్భంలో రాముడు భద్రుని

వంక చూచి "ఏం భద్రా! అయోధ్యానగరం ఎలా ఉంది. ఏమని అనుకుంటున్నారు? దేశంలో ప్రజలు నా గురించి ఏమనుకుంటున్నారు? అయోధ్యలో, ఇంకా ఇతర పురములలో, గ్రామములలో, జనపదములలో ప్రజలు నా గురించి సీతను గురించి, లక్ష్మణ, భరతుల గురించి ఏమనుకుంటున్నారు? రాముని రాజ్య పాలన గురించి ఏమన్నా విమర్శలు వినపడుతున్నాయా! మా తల్లి కైకేయి గురించి నాకు వనవాసము ప్రాప్తించింది కదా? ఆమెను గూర్చి ఏమనుకుంటున్నారు? 14 సంవత్సరాల తరువాత రాజ్యానికి వచ్చాను కదా! ఈ కొత్త రాజును గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు?"అని అడిగాడు రాముడు.

దానికి భద్రుడు ఇలా అన్నాడు. "రామా! ప్రజలందరు నీ విజయగాధలను గానం చేస్తున్నారు. నీవు రావణుని చంపడం సీతను తీసుకు రావడం అంతా కధలు కధలు గా చెప్పుకుంటున్నారు." అని అన్నాడు భద్రుడు. "అది కాదుభద్రా! వారు ఏమనుకుంటున్నారు వారి మాటలలోనే చెప్పు. ఎందుకంటే అంతా మంచి అనుకోరు కదా. కొస్త చెడ్డగా కూడా అనుకుంటారు. అదిసహజమే కదా! ప్రజల మనోభావాలు నాకు తెలిస్తే, నేను వారికి ఇష్టం లేని పనులు చేయకుండా జాగ్రత్త పడతాను. ఎల్లప్పుడూ వారికి ఇష్టమైన పనులే చేయడానికి ప్రయత్నిస్తాను. ఏ విషయాలలో ప్రజలకు నా పాలన సంతృప్తి కలిగించడం లేదు. పట్టణాలలో, పల్లెలలో ప్రజలు నా గురించి నా పాలన గురించి ఏమనుకుంటున్నారో నిర్భయంగా, ఏ మాత్రం సంకోచం లేకుండా చెప్పు." అని అడిగాడు రాముడు.

రాముని మాటలు విన్న భద్రుడు రామునితో ఇలా అన్నాడు. "రామా! అయోధ్యలోనూ ఇతర గ్రామాలు, పట్టణాలలోనూ ప్రజలు నాలుగు వీధులు కలిసే చోట, రచ్చబండల వద్ద, ఉద్యానవనములలోనూ నీ గురించి ఏమేమి మాట్లాడుకుంటున్నారో చెబుతాను విను. నీవు సముద్రము మీద సేతువును కట్టావు కదా. అలాంటి పని దేవతలు గానీ దానవులు గానీ పూర్వము ఎవరూ చేయలేదని నిన్ను వేనోళ్ల శ్లాఘిస్తున్నారు. పైగా నీవు వానరములను, భల్లూకములను మచ్చిక చేసుకోవడం, రావణుని చంపడం, వాటి సాయంతో రావణుని చంపడం అంతా విడ్డూరంగా ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు. ఇంకా కొంతమంది "రాముడు రావణుని చంపి, రావణుని వద్ద ఉన్న సీతను తీసుకొని వచ్చాడు. రావణుడు ఇన్నాళ్లు సీతను తాకినా లెక్కచేయకుండా సీతను మరలా స్వీకరించాడు. రాముడికి సీత మీద అంత వల్లమాలిన ప్రేమ ఉందేమో! రామునికి సీత వల్ల అంత సుఖం కలుగుతుందేమో! అయినా రావణుడు సీతను తన ఒడిలో కూర్చుండబెట్టుకొని లంకకు తీసుకొని వెళ్లాడు కదా! అక్కడ అశోక వనములో ఉంచాడు కదా! మరి అన్నాళ్లు రాక్షసుల మధ్య ఉన్న సీతను రాముడు అసహ్యించుకోకుండా ఎలా ఉండగలుగుతున్నాడో అర్థం కావడం లేదు! రాముడే అలా చేసాడు కాబట్టి మనం కూడా మన భార్యలు ఎక్కడ తిరిగి వచ్చినా ఏమీ అనకుండా ఏలుకోవాలేమో! ఎందుకంటే రాజుగారు ఏమి చేస్తే ప్రజలు అలా చెయ్యాలి కదా!" ఈ ప్రకారంగా ప్రజలు నానా విధాలుగా అనుకుంటున్నారు రామా!" అని చెప్పాడు భద్రుడు.

రామునికి దు:ఖం పొర్లుకొచ్చింది. కాని బయట పడలేదు. తక్కిన మిత్రుల వంక చూచి “ఇదంతా నిజమేనా! ఇలాంటి మాటలు అనడం మీరు కూడా విన్నా రా!” అని అడిగాడు. “అవును రామా! భద్రుడు చెప్పినది అంతా అక్షరాలా నిజం మేము కూడా ప్రజలు ఇలా అనుకోవడం స్వయంగా విన్నాము.” అని చెప్పారు. రాముని మనసంతా అల్లకల్లోలం అయింది. ఇంక స్నేహితుల మధ్య ఉండలేకపోయాడు. రాముడు తన స్నేహితుల నందరినీ పంపివేసి తన అంత:పురమునకు వెళ్లాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నలుబది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నలుబది నాలుగవ సర్గ.

రాముడు తన మిత్రులను అందరినీ పంపి వేసి తాను అంత:పురమునకు వెళ్లాడు. ప్రతీహారిని పిలిచాడు.“నీవు వెంటనే పోయి లక్ష్మణుని, భరతుని,శత్రుఘ్నుని నేను పిలిచానని చెప్పి వెంటనే తీసుకొనిరా. నేను వారితో కొన్ని అత్యవసరమైన రాచకార్యములు మాట్లాడవలసిన అవసరం ఉంది.” అని అన్నాడు. ఆ ప్రతీహారి వెనువెంటనే లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు మందిరములకు వెళ్లి “మహారాజా! మిమ్ములను రాముల వారు అత్యవసరంగా తోడ్కొని రమ్మన్నారు.” అని చెప్పాడు. వారందరూ వెంటనే రాముని అంత:పురమునకు వెళ్లారు. రాముని

మందిరము బయట ఉండి తాము అందరమూ వచ్చామని రామునికి వర్తమానము పంపారు. రాముడు తనతమ్ములను లోపలికి రమ్మన్నాడు. లక్ష్మణ,భరత,శత్రుఘ్నులు లోపలకు పోయి రామునికి నమస్కరించి తమ తమ ఆసనముల మీద కూర్చున్నారు. రాముని ముఖంలోకి చూచారు.

రాముని ముఖంలో విషాదచ్ఛాయలు కమ్ముకొని ఉన్నాయి. కళ్ల వెంట నీరు కారుతూ ఉంది. వీరికి విషయం అర్థం కావడం లేదు. రాముడు ఎందుకు బాధపడుతున్నాడా అని ముగ్గురూ ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. తమవల్ల ఏదైనా తప్పుజరిగిందేమోఅని ముగ్గురు తమ్ముళ్లు రాముని పాదాల మీద పడ్డారు. రాముడు వారిని లేవనెత్తి అక్కున చేర్చుకున్నాడు. వారిని తమ తమ ఆసనముల మీద కూర్చోబెట్టాడు. “తమ్ములారా! ఈ అయోధ్యకు నేనే కాదు మీరందరూ మహారాజులే. ఈ అయోధ్య మీది. మీరే పాలకులు. మీరు నాకు ఇచ్చిన రాజ్యమును నిమిత్తమాత్రంగా పరిపాలిస్తున్నాను. ఓ అయోధ్యాధి పతులారా! మీరంతా బాగా చదువుకున్న వారు. వేదములను, శాస్త్రములను అధ్యయనం చేసారు. నాకు ఒక ధర్మ సంకటము వచ్చింది. దానిని మీరు పరిష్కరించాలి. ఏమి చెయ్యాలో నాకు ఏమీ తోచడం లేదు.” అని అన్నాడు రాముడు. చక్కగా సాగి పోతున్న రాముని జీవితంలో ఏమి ఉత్పాతం జరిగిందా అని వారిలో వారు తర్కించుకుంటున్నారు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నలభైనాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

ఉత్తరకాండము

నలభైఐదవ సర్గ

ఒక్కసారి తమ్ముళ్ల ముఖాల వంక చూచి రాముడు మరలా చెప్పడం మొదలెట్టాడు. "నేను నా రాజ్యములో నా గురించి ఏమను కుంటున్నారో తెలుసుకోవాలని నా స్నేహితులను అడిగాను. వారు నిర్మొహ మాటంగా కొన్ని నిజాలు వెల్లడించారు. వాటిని నేను నమ్ముతున్నాను. మీరుకూడా నమ్ముతారు అని అనుకుంటున్నాను. నా మీద, సీత మీద అయోధ్యారాజ్యములో ఉన్న పౌరులలో జానపదులలో ఒక అపవాదు బయలుదేరింది. ఆ అపవాదు బాగా ప్రచారంలోకి వచ్చింది. అది నా హృదయాన్ని కలిచివేస్తూ ఉంది. తట్టకోలేక పోతున్నాను.

తమ్ములారా! నేను ఇక్ష్వాకు వంశంలో ప్రసిద్ధుడైన దశరథమహారాజుకు కుమారుడిగా జన్మించాను. సీత కూడా మిథిలా నగరానికి ప్రభువు అయిన రాజర్షి జనకునికి కుమార్తెగా జన్మించింది. ఇద్దరమూ ఉన్నతమైన, సంస్కారవంతమైన వంశములలో జన్మించిన వారమే! భరత శత్రుఘ్నులారా! మీకు తెలియక పోవచ్చును. కాని లక్ష్మణుడు నా వనవాసకాలము 14 ఏళ్లు నా వెంటనే ఉన్నాడు. లక్ష్మణుడికి అన్ని విషయములు తెలుసు. లక్ష్మణా! మనము దండకారణ్యములో ఉన్నప్పుడు సీతను రావణుడు అనే రాక్షసుడు ఎలా అపహరించాడో నీకు తెలుసు కదా! ఆ రావణుని నేను ఎన్ని కష్టాలు పడి చంపానో నీకు తెలుసు కదా! రావణ సంహారము అయిన తరువాత సీత నా దగ్గరకు వచ్చినప్పుడు ఒక సంవత్సరము రాక్షసుల మధ్య ఉన్న సీతను నేను ఎలా అయోధ్యకు

తీసుకొని పోగలను అని ఆలోచించాను. ఆ మాట నేను అన్నప్పుడు సీత అగ్ని ప్రవేశము చేసి తాను పునీతురాలను అని నిరూపించుకున్నది అన్న విషయం నీవు కళ్లారా చూచావు కదా! అప్పుడు నన్ను అభినందించడానికి వచ్చి దేవతా గణములు కూడా సీత పవిత్రురాలు అని చెప్పారు కదా. అగ్నిదేవుడు, వాయు దేవుడుకూడా సీత పతివ్రతకు సాక్ష్యం ఇచ్చారు కదా! అగ్నిలో ప్రవేశించి పరిశుద్ధురాలైన సీతను నేను అయోధ్యకు తీసుకొని వచ్చాను.

ఈ విషయములన్నీ నీకూ నాకూ తెలుసు. కాని అయోధ్యా వాసులకు, జానపదులకు తెలియవు. నేను మాత్రము సీత విషయంలో వివాదం తలెత్తుతుందని మనసులో ఒక మూల శంకిస్తూనే ఉన్నాను. నేను అనుకున్నట్టే జరిగింది. సీత విషయంలో ఒక అపవాదు ప్రచారంలోకి వచ్చింది. ధర్మశాస్త్రము ప్రకారము ఎవడి మీదనైనా ఒక అపవాదు వస్తే వాడు లోకంలో ఆ అపవాదు ప్రచారంలో ఉన్నంత వరకూ నరకంలో పడి ఉంటాడు. కీర్తి వంతుడిని లోకంలో అందరూ పూజిస్తారు. ఆకాశానికి ఎత్తేస్తారు. కాని అపవాదు వస్తే మాత్రం అంతా ఈసడించుకుంటారు. పాతాళానికి అణగదొక్కుతారు. ఇదీ ప్రజల నైజం. అందుకే పెద్ద వాళ్లు అందరూ తమ మీద ఏమాత్రం అపవాదు రాకుండా జాగ్రత్తపడుతుంటారు.

ఓ తమ్ములారా! నా మీద ఇప్పుడు ఒక అపవాదు వచ్చింది. ఒక రాక్షసుడు తన తొడమీద కూర్చో పెట్టుకొని తీసుకుపోయిన సీతను, ఒక సంవత్సరం పాటు రాక్షసుల చెరలో ఉన్న సీతను, సీత మీద కోరికతో, కామంతో, ఆమెను వదిలిపెట్టడం ఇష్టం లేక, నేను తిరిగి స్వీకరించాను

అని ఆ అపవాదు. దానిని పోగొట్టు కోడానికి నేను నా జీవితమును గానీ, మీ అందరిని కానీ త్యాగం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. ఇంక సీతను త్యాగం చెయ్యడం అనేది ఒక సమస్యకాదు. సీతాపహరణం జరిగినప్పుడు కూడా, సీతా వియోగం లో కూడా నేను ఇంతటి దు:ఖమును అనుభవించలేదు. ఈ అపవాదు అంతటి దు:ఖమునకు కారణం అయింది. ఈ అపవాదు పోవాలంటే సీతా పరిత్యాగమే పరిష్కారము.

లక్ష్మణా! సీత కూడా నిన్నని దినమున, తాను గంగా తీరమున ఉన్న ఋషి ఆశ్రమములను సందర్శించవలెననీ, వారి ఆశీర్వాదములు తీసుకొన వలెననీ కోరికగా ఉందని చెప్పింది. ఆ మిషమీద, రేపు ఉదయమే నీవు సుమంతుని రథం సిద్ధం చేయమను. సీతను తీసుకొని పోయి అయోధ్యా రాజ్యము అవతల అరణ్యములలో విడిచి పెట్టి రా! అయోధ్యా రాజ్య సరిహద్దుల వద్ద తమసానదీ తీరంలో మహాఋషి వాల్మీకి ఆశ్రమం ఉంది. సీతను వాల్మీకి ఆశ్రమ పరిసరాలలో విడిచి పెట్టిరా!

లక్ష్మణా! ఇది నా ఆజ్ఞ. కాదు, కూడదు, తప్పు, పాపము, అన్యాయము అనే మాటలు మాట్లాడవద్దు. నేను అన్నీ ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. మరో ఆలోచనకు తావు లేదు. నీవు కూడా వేరే ఆలోచనలు పెట్టుకోవద్దు. నా నిర్ణయానికి మీలో ఎవరైనా అడ్డు చెబితే నాకు చాలా కోపం వస్తుంది. నా మీద ఒట్టు పెట్టుకొని చెబుతున్నాను. మీరు నా నిర్ణయాన్ని కాదనవద్దు. నా మాటకు అడ్డు చెప్పడం కానీ, నన్ను బతిమాలడం కానీ, చేస్తే వారిని నేను నా శత్రువులుగా పరిగణిస్తాను. ఇది నా స్వవిషయం. నిర్ణయం నాది. రాజాజ్ఞను అమలు చేయడమే నీ

బాధ్యత. ఇటువంటి కఠిన నిర్ణయం తీసుకున్నందుకు మీరంతా నన్ను మన్నించండి. తప్పని సరి పరిస్థితులలోనే ఇటువంటినిర్ణయం తీసుకోవలసి వచ్చింది. కాదనకండి. నా మాట ప్రకారం చెయ్యండి. దీని వలన నా మీద వచ్చిన అపవాదు సమసి పోతుంది. ఋష్యాశ్రమములు చూడవలెనన్న సీత కోరికా తీరుతుంది."

రాముడు ఈ ప్రకారంగా ఎవరికీ మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా చెబుతుంటే, రాముని కళ్ల వెంట నీరు ధారాపాతంగా కారుతున్నాయి. ఇంక తట్టుకోలేక రాముడు అక్కడి నుండి లోపలకు వెళ్లిపోయాడు. బరువెక్కిన హృదయాలతో లక్ష్మణ,భరత,శత్రుఘ్నులు అక్కడి నుండి వెళ్లిపోయారు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము నలభై ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
నలభై ఆరవ సర్గ.

మరునాడు తెల్లవారింది. నలుగురు అన్నదమ్ములు ఆ రాత్రి నిద్రపోలేదు. ఏ పాపమూ ఎరుగని సీత హాయిగా నిద్రపోయింది. ఉదయమే లక్ష్మణుడు రాముని సారథి సుమంతుని పిలిచాడు. రథం సిద్ధం చేయమన్నాడు.

"సుమంతా! మా వదిన సీతా దేవి ఋష్యాశ్రమములు చూడవలెనని కోరికగా ఉందట. ఆమెను ఋష్యాశ్రమములకు తీసుకొని వెళ్లాలి. రథం సిద్ధం చేయి. ఆమె కూర్చోడానికి మెత్తని ఆసనములు ఏర్పాటు చెయ్యి. రథము త్వరగా సిద్ధము చేసి తీసుకొనిరా! ఇది రాజాజ్ఞ. ఆలస్యము పనికి రాదు." అని ఆదేశించాడు లక్ష్మణుడు. ఈ ప్రయాణములో ఆంతర్యము తెలియని సుమంతుడు "అలాగే సిద్ధం చేస్తాను." అని అన్నాడు. క్షణాల్లో రధాన్ని సిద్ధం చేసుకొని వచ్చి లక్ష్మణుని ముందు నిలబెట్టాడు. "లక్ష్మణా! రథం సిద్ధంగా ఉంది. ఇప్పుడు నేను ఏం చెయ్యాలి." అని అడిగాడు.

సుమంతుని అక్కడే ఉండమని లక్ష్మణుడు సీతా దేవి అంత:పురమునకు వెళ్లాడు. "అమ్మా! నీవు అయోధ్యాధిపతి రాముని ఒక వరం కోరావట. గంగానదీ తీరమున ఉన్న ఋషివాటికలకు వెళ్లవలెనని, అక్కడ ఋషుల, ఋషిపత్నుల ఆశీర్వాదములు తీసుకొనవలెనని అన్నావట. నిన్ను గంగానదీతీరమున ఉన్న ఆశ్రమములకు తీసుకొని వెళ్లమని నన్ను ప్రభువు అయిన రాముడు ఆజ్ఞాపించాడు. రథము సిద్ధంగా ఉంది. తమరు సిద్దంగా ఉంటే మనము బయలుదేరుదాము." అని అన్నాడు.

రాముడు తన కోరికను వెనువెంటనే నెరవేర్చుతున్నందుకు సీత మనసులో ఉప్పొంగిపోయింది. అక్కడ ఋషులకు ఋషిపత్నులకు బహూకరించుటకు విలువైన ఆభరణములు, వస్త్రములు తీసుకొంది. అన్నీ రథంలో పెట్టించింది. తనకు కూడా అవసరమైన వస్త్రములు ఆభరణములు ధరించింది. ఇవన్నీ చూస్తున్న లక్ష్మణుడికి దు:ఖం ఆగడం

లేదు. కాని మనసులోనే అణుచుకుంటున్నాడు. సీత లక్ష్మణుని వెంట వచ్చి రథము ఎక్కింది. సుమంతుడు రథం తోలుతున్నాడు. సీత, లక్ష్మణుడు అయోధ్య విడిచి అరణ్యమార్గంలో వెళుతున్నారు. కాని సీతకు కొన్ని అపశకునములు గోచరించాయి.ఆమె ఎడమ కన్ను అదరసాగింది. శరీరం అంతా ఏదో తెలియని బాధ ఆవరించింది. స్వల్పంగా వణుకుతూ ఉంది. కాని ప్రయాణం వలన కలిగే ఉద్వేగము అని సరిపెట్టుకుంది సీత. కాని ఉండబట్టలేకపోయింది. లక్ష్మణుని ఇలా అడిగింది.

"లక్ష్మణా! నాకు కొన్ని దుర్నిమిత్తములు గోచరిస్తున్నాయి. రామునికి క్షేమమే కదా! రాజమాతలందరికీ కుశలమే కదా! మన రాజ్యములో ప్రజలందరూ సుఖంగాఉన్నారు కదా! వారికేమీ ఆపదలు కలుగలేదు కదా! నాకెందుకో మనసంతా అల్లకల్లోలంగా ఉంది. కారణం అర్థం కావడం లేదు. సకల దేవతలు అయోధ్యను రక్షించుగాక!" అని దేవతలందరికీ పేరుపేరునా నమస్కారం చేసింది సీత.

లక్ష్మణుడు తన బాధను మనసులోనే దాచుకొని, సీతకు నమస్కారము చేసి "అమ్మా! అందరూ క్షేమంగానే ఉన్నారు. ఎవరికీ ఎటువంటి ఆపదా లేదు." అని అన్నాడు. వారు గోమతీనదీ తీరమునకు చేరుకున్నారు. అంతలో సూర్యుడు అస్తమించాడు. ఆ రాత్రికి వారు నదీ తీరమున ఉన్న ఒక ఋషి ఆశ్రమములో విడిది చేసారు. మరునాడు ఉదయమే లేచారు. అందరూ గంగా స్నానం చేయాలని అనుకున్నారు. సీతను రథం ఎక్కించి, లక్ష్మణుడు రథంఎక్కాడు. సుమంతుడు రథం తోలుతున్నాడు. రథం గంగానదీ తీరమును చేరుకుంది. పవిత్రమైన

గంగాజలమును చూడగానే సీత హృదయం పులకించి పోయింది. సీతను విడువ వలసిన సమయం వచ్చినందుకు లక్ష్మణునికి ఏడుపు ఆగలేదు. సీతనుచూచి పెద్దగా ఏడ్చాడు. సీత ఆశ్చర్యపోయింది.

"అదేమి లక్ష్మణా! పవిత్రమైన గంగానదీ జలాలను సమీపించినందుకు సంతోషించాల్సింది పోయి అలా దు:ఖిస్తున్నావు ఎందుకు? ఎన్నాళ్ల తరువాతనో గంగానదీని దర్శించు కున్న నాకు, సంతోషము కలుగవలసింది పోయి నిన్ను చూచి దు:ఖము కలుగుతూ ఉంది. నీవు ఏడ్చి నన్ను కూడా ఏడిపిస్తున్నావు. ఓహో! అదా సంగతి. ఎల్లప్పుడూ రాముని విడిచి ఉండని నీవు ఒక్కరోజు రాముని విడిచి ఉండేసరికి బెంగ పెట్టుకున్నావా! మీ అన్నాదమ్ముల అనుబంధం అటువంటిది. నేనుచూడు. నాకూ రాముడు అంటే ప్రాణం. నేను రాముని నా ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. కాని ఒక్కరోజు వియోగానికే నేను నీమాదిరి ఏడవడం లేదు కదా! ఊరుకో లక్ష్మణా! మరీ అంత ధైర్యం లేకపోతే ఎలా! ఇంత బేలతనం పనికిరాదు." అంది సీత నవ్వుతూ లక్ష్మణునితో.

లక్ష్మణుడు ఏమీ జవాబు చెప్పలేదు. ముఖం తుడుచుకున్నాడు.

"అది సరే. ముందు మనం గంగానదిని దాటి ఆవల ఒడ్డుకు చేరుకుందాము. అక్కడే ముని ఆశ్రమములు అన్నీ ఉన్నాయి. మనం తొందరగా అక్కడికి చేరుకొని ముని పత్నులకు నేను తెచ్చిన ఆభరణములు వస్త్రములు బహూకరిస్తాను. అక్కడ ఈ రాత్రికి ఉండి రేపు

పొద్దుటే బయలుదేరి అయోధ్యకు వెళ్లుదాము. నీ దు:ఖము చూస్తుంటే నాకు కూడా ఎప్పుడెప్పుడు రాముని చూద్దామా అని ఆతురతగా ఉంది. వచ్చిన పని ముగించుకొని త్వరత్వరగా అయోధ్యకు వెళుదాము. నన్ను విడిచి రాముడు ఒక్క క్షణం కూడా ఉండలేడు.” అంది సీత.

సీత మాటలు వింటుంటే లక్ష్మణునికి దు:ఖముపొర్లుకొస్తూ ఉంది. కాని ఆపుకుంటు న్నాడు. గంగానదిఒడ్డున ఉన్న పడవ వారిని పిలిచాడు. వారు వెంటనే ఒక పడవను సిద్ధం చేసారు. సీత, లక్ష్మణుడు ఆ పడవలోకి ఎక్కారు. సీత, లక్ష్మణుడు ఎక్కిన ఆ పడవ గంగానది ఆవల ఒడ్డుకు చేరుకుంది.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నలభై ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నలభై ఏడవ సర్గ.

పడవ వాడు తీసుకొచ్చిన పడవలో ముందు సీతమ్మను ఎక్కించి తరువాత తాను ఎక్కాడు లక్ష్మణుడు. సుమంత్రుని అక్కడే ఉన్నమన్నాడు. పడవను పోనిమ్మన్నాడు, పడవ గంగానది ఆవల ఒడ్డుకు చేరింది. లక్ష్మణుడు ముందు తాను దిగి తరువాత సీతమ్మను దింపాడు. తరువాత చేతులు జోడించి, కళ్లవెంట నీళ్లు ధారాపాతంగా కారుతూ

ఉంటే, వెక్కి వెక్కి ఏడుస్తూ, సీతమ్మతో ఇలా అన్నాడు.

"అమ్మా! సీతమ్మ తల్లీ! రాముడు ఈ రోజు నన్ను లోకనిందకు గురి చేసాడమ్మా! చేయకూడని పని నాతో చేయిస్తున్నాడు. ఈ పని నా జీవితాంతము నా హృదయంలో శూలంలా గుచ్చుకుంటూ నిరంతరము బాధకు గురిచేస్తూ ఉంటుంది. ఇంతకన్నా నాకు మరణము దానికి సమానమైనది కానీ అంతకన్నా పెద్దది కానీ శిక్ష విధించి ఉంటే సంతోషంగా అనుభవించి ఉండేవాడిని. అమ్మా! నేనేమీ తప్పు చేయడం లేదు. ఈ తప్పు, ఈ పాపం నాది కాదు.నన్ను క్షమించు." అని సీత కాళ్ల మీద పడ్డాడు లక్ష్మణుడు. సీతకు ఏమీ అర్థం కావడం లేదు. లక్ష్మణుడు ఎందుకు ఏడుస్తున్నాడు.

సీత ఆలోచనలో పడింది. "ఇప్పుడు ఏం జరిగింది. నిన్న తనే కదా రాముని ఋషి ఆశ్రమములకు తీసుకు వెళ్లమని అడిగింది. రాముడు సరే అన్నాడు. ఈ రోజు లక్ష్మణుని తోడు ఇచ్చి గంగానదీ తీరానికి పంపాడు. ఇందులో లక్ష్మణుడు దు:ఖించవలసిన అవసరం ఏమొచ్చింది. ఏమిటో ఏమీ అర్థం కావడం లేదు." అని తనలో తాను తర్కించుకుంటూ లక్ష్మణుని చూచి ఇలా అడిగింది.

"లక్ష్మణా! నాకు ఏమీ అర్థం కావడం లేదు. అసలు ఏం జరిగింది? నీ దు:ఖానికి కారణం ఏమి?నీకు ఆరోగ్యం సరిగా లేదు! అయోధ్యాధిపతి రాముడు ఆరోగ్యంగా ఉన్నాడా? రాజుకు క్షేమమే కదా! అన్ని సక్రమంగా ఉంటే నీవు ఎందుకు దు:ఖిస్తున్నావో అర్థం కావడం లేదు.

మహారాజు మీద ఒట్టుపెట్టి అడుగుతున్నాను. ఏంజరిగిందో నిజం చెప్పు అయోధ్యాధిపతి రాముని భార్యగా ఆజ్ఞాపిస్తున్నాను.!" అని అడిగింది సీత.

లక్ష్మణుడిని నోటి నుండి మాట పెగలడం లేదు. గొంతు పూడుకుపోతోంది. ఏదోవిధం మాట పెగుల్చుకొని ఇలా అన్నాడు. "అమ్మా! సీతమ్మ తల్లీ! ఈ మాటలు చెప్పడానికి నాకు నోరు రావడంలేదు. అయోధ్యానగరంలోనూ, పట్టణాలలోనూ, పల్లెలలోనూ ఒక అపవాదు వ్యాపించిందట! ఆ లోకోపవాదం గురించి మంత్రి పరిషత్తులో ప్రస్తావన వచ్చిందట. ఆ అపవాదును పోగొట్టుకోడానికి నిన్ను అడవిలో వదిలి రమ్మన్నాడు రాముడు. ఆ అపవాదు ఏమిటో నేను నా నోటితో చెప్పలేను. అంత పాపం చేయలేను. లోకోపవాదుకు భయపడి రాముడు నిన్ను విడిచిపెట్టినాడు. అయినా గంగానదీ తీరమున ఉన్న ఋషి ఆశ్రమములు చూడవలెనని నీవు స్వయంగా కోరుకున్నావట కదా! అందుకే నిన్ను గంగానదీ తీరంలో విడిచిరమ్మన్నాడు. నేను కేవలం రాజాజ్ఞను అమలు చేస్తున్నాను. ఇంతకన్నా మరణమే శరణ్యముఅని అనుకుంటున్నాను. " అని అన్నాడు లక్ష్మణుడు.

ఆ మాటలు విన్న సీత ఒక్కసారి కొయ్యబారి పోయింది. తన సౌభాగ్యము అంతా గంగలో కలిసిపోయిందేమో అని అనుకొంది. సీతకు నోటమాట రాలేదు. ఇంతలో లక్ష్మణుడు సీతతో ఇలా అన్నాడు. "అమ్మ! ఇదే గంగా నదీ తీరము. అవిగో ఆ కనపడేవే ఋషి ఆశ్రమములు. మా తండ్రి, నీకు మామగారు అయిన దశరథ మహారాజుకు పరమ మిత్రుడు, తపోధనుడు మహాఋషి అయిన వాల్మీకి మహర్షి ఆశ్రమము ఇక్కడకు

దగ్గరలోనే ఉంది. నీవు ఆయన ఆశ్రమములో తలదాచుకోవచ్చును. ఆ మహాత్ముని పాదముల దగ్గర ధర్మాచరణము చేస్తూ, నీ భర్త రాముని నిత్యం తలచుకుంటూ, పతివ్రతా ధర్మమును పాటిస్తూ నీవు సుఖంగా కాలం గడపవచ్చును. అదే ప్రస్తుతము శ్రేయస్కరమైన మార్గము." అని అన్నాడు లక్ష్మణుడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నలభై ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నలభై ఎనిమిదవ సర్గ.

లక్ష్మణుడు తన దారిన తాను చెప్పుకు పోతున్నాడు. ఇంతలో ఆ మాటలు భరించలేక వివశురాలైన సీత స్పృహ తప్పి నేలమీద పడిపోయింది. లక్ష్మణుడు ఆమె ముఖమున గంగాజలమును చిలకరించి ఆమె సేద తీర్చాడు. నీళ్లు నిండిన కళ్లతో సీత లక్ష్మణుని చూచి గద్గద స్వరంతో దీనంగా ఇలా అంది.

"లక్ష్మణా! నేను కేవలం కష్టాలు దు:ఖాలు అనుభవించడానికే పుట్టినట్టున్నాను. బ్రహ్మదేవుడు నా ముఖాన కష్టాలు అనుభవించమని రాసినట్టున్నాడు. పద్నాలుగేళ్ల వనవాసం తరువాత మరలా ఈ శాశ్వత వనవాసం ఏమిటి? నేను ఏం తప్పుచేసానని నాకు ఈ శిక్ష? రాముని

తప్ప మరొకరిని తలవని నేను ఏం నేరం చేసానని నాకీ శిక్ష? నేను పూర్వజన్మలో ఎవరికి భార్యను దూరం చేసానో ఈ జన్మలో భర్తకు దూరం అవుతున్నాను. లక్ష్మణా! నీకు తెలుసుకదా! వనవాస కాలంలో నేను రాముని ఆశ్రయించుకొని ఆశ్రమములలో ఉంటూ ఎలా కాలం గడిపింది. 14 ఏళ్లపాటు బంధువులకు దూరంగా ఉన్నాను. మరలా ఇప్పుడు కూడా అందరికీ తుదకు భర్తకు కూడా దూరం అయ్యాను. నా భర్తే నన్ను విడిచిపెడితే, ప్రజలను రక్షించవలసిన రాజే అడవులకు పొమ్మంటే, నా కష్టాల గురించి ఎవరికి చెప్పకోవాలి.

లక్ష్మణా! నీవు చెప్పినట్టు నేను వాల్మీకి ఆశ్రమానికి వెళుతాను. అమ్మా! ఏం తప్పుచేసావని నిన్ను నీ భర్త అయిన రాముడు అడవులకు పంపాడు అని అడిగితే ఏమని సమాధానం చెప్పాలి? నేను ఏమి తప్పుచేసానని వారితో చెప్పాలి? పోనీ ఈ కష్టాలు భరించడం కన్నా గంగలో దూకి ప్రాణత్యాగం చేద్దామంటే, నా కడుపులో పెరుగుతున్న రాముని వంశాంకురం నన్ను ఆ పని చెయ్యనివ్వదు. నాకు ఈ బాధలు, కష్టాలు భరిస్తూ మరణించేదాకా జీవించడం తప్ప మరోమార్గం లేదు.

లక్ష్మణా! నా గురించి నీవు దు:ఖించకు. ఇందులో నీ తప్పుఏమీ లేదు. నీవు రాజాజ్ఞను అమలుపరిచావు. నేను చెప్పే మాటలు యధాతథంగా, మా అత్తగార్లకు, మహారాజుకుచెప్పు. నేను రెండు చేతులు జోడించి నాముగ్గురు అత్తలకు ఏ మాత్రం బేధభావం లేకుండా నమస్కరించానని చెప్పు. రాజుగారి క్షేమమును అడిగినట్టు చెప్పు. రాముడితో నా మాటగా ఈ విధంగా చెప్పు.

"రామా! నా గురించి, నాపాతివ్రత్యము గురించి, నా మనస్సు పరిశుద్ధమైనది అని నీకు తెలుసు. నేను సర్వకాలసర్వావస్థలలోనూ నీ క్షేమము కోరుకుంటాను అని కూడా నీకు తెలుసు. కేవలం ప్రజలు నా గురించి ఏదో అనుకున్నారని విని, నా మీద, నీ మీద పడ్డ అపవాదుకు భయపడి నన్ను అడవులలో విడిచిపెట్టావు. నీ మీద పడ్డ అపవాదు తొలగి పోవాలంటే నీవు నన్ను విడిచిపెట్టడమే మేలైన మార్గము. అదే నీవు చేసావు. భర్త మీద పడ్డ అపవాదు తొలగించడం భార్యగా అది నా బాధ్యత.

రాజా! ఇంక నా గురించి ఏ మాత్రం దిగులు పడవద్దు. నీ ప్రజలను, నీ తమ్ములను కన్నబిడ్డలవలె చూచుకో. ప్రజలను స్వంత బిడ్డలవలె చూచుకొనడం రాజు యొక్క పరమధర్మము. అది నీవు నిర్వర్తించు. నేను నా గురించి విచారించడం లేదు. నీ మీద పడ్డ అపవాదును తొలగించ డానికి నీకు దూరంగా ఉండటానికి నిర్ణయించుకున్నాను. ఎందుకంటే భార్యకు భర్తయే తల్లి, తండ్రి, గురువు, దైవము. భర్తకు ఇష్టమైన, మేలు చేకూర్చే పనులు చేయడమే భార్యకు ఉత్తమమైన ధర్మము. ఆ ధర్మాచరణములో నా ప్రాణాలు పోయినా నేను లెక్కచెయ్యను. నాకు నా భర్త క్షేమమే ముఖ్యము.

లక్ష్మణా! మరొక్క మాట. నేను ఇప్పుడు గర్భవతిని. నీవు నన్ను అడవులలో విడిచివెళ్లునప్పుడు నేను గర్భవతిని అన్న విషయం గుర్తుపెట్టుకో. మరొక అపవాదుకు తావు ఇవ్వకుండా చూడు." అని పలికింది సీత.

సీత చెబుతున్న మాటలు వింటున్నంతసేపూ లక్ష్మణునికి దు:ఖం ఆగడం లేదు. దీనంగా సీత వంక చూస్తున్నాడు. లక్ష్మణునికి నోటమాట రావడం లేదు. కళ్లనీళ్లు కారుస్తూనే సీత చుట్టు తిరిగి ప్రదక్షిణపూర్వకంగా నమస్కరించాడు. తరువాత లక్ష్మణుడు సీతలో ఇలా అన్నాడు.

“అమ్మా!మీరు ఇప్పుడు ఏమన్నారు. మీరు గర్భవతిని అన్న విషయం చూడమన్నారు కదా! అమ్మా! నేను ఇంతవరకూ మీ వంక కన్నెత్తి కూడా చూడలేదు. కేవలం మీ పాదాలు మాత్రమే చూచాను. రాముడు పక్కన ఉండగానే మీ వంక చూడని వాడిని, రాముడు పక్కన లేనపుడు మీ వంక ఎలా చూడగలను.” అని అన్నాడు.

ఇంక ఏమీ మాట్లాడలేక లక్ష్మణుడు మౌనంగా వెళ్లి పడవ ఎక్కాడు. ఆ పడవ లక్ష్మణుని గంగానది ఆవలి ఒడ్డుకు తీసుకొని వెళ్లింది. పడవ గంగానదిని దాటుతున్నంతసేపూ లక్ష్మణుడు సీత వంక తిరిగి ఆమెను చూస్తూనే ఉన్నాడు. సీత కూడా పడవలో వెళుతున్న లక్ష్మణుని వంక కన్నీటితో చూస్తూనే ఉంది. లక్ష్మణుడు గంగానదిని దాటాడు. పడవ కనపడుతున్నంత సేపూ సీత లక్ష్మణుడి వెళుతున్న వంక చూస్తూనే ఉంది. లక్ష్మణుడు గంగ ఆవల ఒడ్డుకు చేరుకున్నాడు.

సీతకు దిక్కుతోచడం లేదు. మనసంతా దు:ఖంతో నిండిపోయింది. భర్తకు దూరం అయింది. నా అన్నవాళ్లు కనుచూపుమేరలో లేరు. ఒంటరి తనం. ఏమి చెయ్యాలో తోచని స్థితి. కడుపులో దు:ఖం, ఏడుపు రూపంలో పైకి తన్నుకొచ్చింది. పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది సీత. సీత ఏడుస్తున్న ఏడుపుకు ఆ అడవిలో

ఉన్న జంతువులు, నెమళ్లు, కూడా కన్నీరు కార్చాయి.

శ్రీమద్రామాయణం
ఉత్తరకాండము నలభై ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
నలభై తొమ్మిదవ సర్గ.

అదే సమయంలో వాల్మీకి మహర్షి శిష్యులు సమిధల కోసరం ఆ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నారు. వారికి సీత ఏడుపు వినిపించింది. వారికి భయం పుట్టింది. వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్లి ఆ విషయం వాల్మీకికి చెప్పారు. "గురుదేవా! ఎవరో స్త్రీ అడవిలో ఒక చెట్టు కింద కూర్చుని బిగ్గరగా ఏడుస్తూ ఉంది. ఆమెను మేము ఇదివరకు ఎప్పుడూ చూడలేదు ఆమె చూడటానికి మహాలక్ష్మిలాగా ఉంది. ఆమె ఏదో గొప్ప దు:ఖంలో ఉన్నట్టు ఉంది. ఆమెకు ఎవరూ లేనట్టు ఉంది. చుట్టుపక్కల ఎవరూ కనపడలేదు.. ఒంటరిగా ఉంది. మాకు చూడా ఆమె మానవ కాంత లాగా కనపడలేదు. ఎవరో దేవకాంత అయి ఉండవచ్చు. ఆమె మన ఆశ్రమ సమీపమున కూర్చుని దు:ఖిస్తూ ఉందంటే మన రక్షణ కోరుతోంది అని అర్థం అవుతోంది. కాబట్టి తమరు వెంటనే రావాలి." అని గబగబా చెప్పారు.

శిష్యుల మాటలు విన్న వాల్మీకి కళ్లుమూసుకున్నాడు. దివ్యదృష్టితో జరిగింది తెలుసుకున్నాడు. వెంటనే తన శిష్యులను వెంటబెట్టుకొని సీత ఉన్న చోటికి వెళ్లాడు. గంగానదీ తీరంలో ఒంటరిగా కూర్చుని దు:ఖిస్తున్న సీతను చూచాడు వాల్మీకి. ఆమెను చూచి ఇలా అన్నాడు. “అమ్మా! నీవు ఎవరో నాకు తెలుసు. నీవు అయోధ్యాధిపతి అయిన దశరథమహారాజు కోడలివి. జనకమహారాజు కూతురివి. రాముని భార్యవు. సీతవు. నీకు ఇదే స్వాగతము. నీవు ఇక్కడకు ఎందుకు వచ్చావో ఏ కారణం చేత వచ్చావో నేను నా తపోబలంతో తెలుసుకున్నాను. నాకు సమస్తమూ అవగతమయింది. నీవు ఏ పాపమూ చెయ్యలేదు. నీవు పునీతవు. నీవు నా ఆశ్రమంలో ఉండవచ్చును. నీకు ఎలాంటి భయం లేదు. నా ఆశ్రమంలో కొంత మంది స్త్రీలు తపోవృత్తిలో ఉన్నారు. వారు నిన్ను సంరక్షిస్తూ ఉంటారు. అమ్మా సీతా! నీవు మా స్వాగత సత్కారములు స్వీకరించి నీ పుట్టినింటికి వచ్చినట్టు మా ఆశ్రమమునకు రా! నన్ను నీ తండ్రి జనకమహారాజుగానే భావించు.”అని అన్నాడు వాల్మీకి.

వాల్మీకి చెప్పిన మాటలు విన్న సీత ఆయనకు రెండు చేతులు జోడించి భక్తితో ఆయన పాదాలకు నమస్కరించింది. “తండ్రీ! మీరు చెప్పినట్టే చేస్తాను” అని పలికింది. ముందు వాల్మీకి నడుస్తుంటే, ఆయన వెనక సీత, సీత వెనక శిష్యులు నడుచుకుంటూ వెళ్లారు. అందరూ వాల్మీకి ఆశ్రమం చేరుకున్నారు. ఆశ్రమంలో ఉన్న ముని కాంతలు సీతను చూచి ఆమెను ఆప్యాయంగా పలకరించారు. వాల్మీకి ఆ ముని కాంతలతో ఇలా అన్నాడు. “ఈమె దశరథుని కోడలు. జనకుని కుమార్తె. అయోధ్యాధి పతి రాముని భార్య సీత. ఉత్తమురాలు. మహా పతివ్రత. ఏ పాపమూ ఎరుగని

ఈమెను ఈమె భర్త లోకాపవాదమునకు భయపడి ఇక్కడ వదిలి పెట్టాడు. ఈమెను మన ఆశ్రమానికి తీసుకొని వచ్చాను. ఇంక ఈమె ఇక్కడే ఉంటుంది. మీరు ఆమెను కంటికి రెప్పలా కాపాడాలి. ఈమె రాజకుమార్తె. చక్రవర్తి భార్య. ఈమె గౌరవమునకు ఏ లోటూ రాకుండా చూచుకోండి." అని పలికాడు వాల్మీకి. సీతను ముని కాంతలకు అప్పగించి వాల్మీకి తన శిష్యులతో సహా ఆశ్రమమునకు వచ్చాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము నలభై తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
ఏబదియవ సర్గ.

పడవ ఎక్కి గంగానదిని దాటిన లక్ష్మణుడు అక్కడే నిలబడ్డాడు. సీత ఏమి చేస్తుంది. సీత దగ్గరకు ఎవరు వస్తారు అని చూస్తున్నాడు. సీత దగ్గరకు మునికుమారులు రావడం, వారు వెళ్లడం, తరువాత వాల్మీకి మహర్షి రావడం, వారి వెంట సీత వెళ్లడం చూచి లక్ష్మణుని మనసు కుదుట పడింది. లక్ష్మణుడురథం ఎక్కాడు. అయోధ్యకు పోనిమ్మన్నాడు. రథం అయోధ్య వైపు సాగి పోయింది. రథములో కూర్చున్న లక్ష్మణుడు సారథి సుమంత్రుని చూచి ఇలాఅన్నాడు.

"సుమంత్రా! సీత వాల్మీకి ఆశ్రమం చేరుకుంది. రాముడు అయోధ్యలో ఉన్నాడు. సీతా వియోగం రామునికి ఎంత బాధాకరమో కదా! ఏ పాపమూ ఎరుగని భార్యను విడిచిన రామునికి ఇంతకంటే దు:ఖము వేరే ఉంటుందా! రామునికి ఈ భార్యావియోగము కేవలం దైవఘటన కాక మరేముంటుంది. వనవాసకాలములో మాయామృగము, ఇప్పుడు ఈ అపవాదు, సీతావియోగమునకు కారణం అయింది. రావణుని సంహరించిన రాముడు దైవఘటనకు బద్ధుడు కాక తప్పలేదు. తండ్రి మాట విని అరణ్యమునకు వెళ్లినప్పుడు కూడా సీత భర్తను విడిచి ఉండలేక వనవాస క్లేశమును అనుభవించింది. కాని ఇప్పుడు ఒంటరిగా వనవాసము చేస్తూ ఉంది. కాని రాముడు చేసిన పనిమంచిది కాదు. ఎవరో ఏమో అన్నారని కట్టుకున్న భార్యను అడవులకుపంపడం దారుణం. పౌరులు వేసిన అపవాదుకు సీతను శిక్షించడం ధర్మం కాదు కదా! సీత గురించి అపవాదులు వేసిన పౌరులు బాగానే ఉన్నారు. రాముడు అంత:పురములో ఉన్నాడు. ఏ పాపమూ ఎరుగని సీత వనవాసము చేస్తూ ఉంది. ఇది ధర్మమా!" అని అడుగుతున్న లక్ష్మణుడికి సుమంత్రుడు ఇలా అన్నాడు.

"లక్ష్మణా! మనము సీత విషయమున బాధపడవలసిన పని లేదు. ఆమె వాల్మీకి ఆశ్రమములో సురక్షితముగా ఉండగలదు. ఈ విషయం గురించి పూర్వము బ్రాహ్మణులు నీ తండ్రితో చెపుతుంటే నేను విన్నాను. రాముడి జాతకంలో దు:ఖములు, కష్టములు రాసి పెట్టి ఉన్నాయట. రామునికి తనకు కావాల్సిన వాళ్లు దూరం అవుతారట. ఇప్పుడు సీతను విడిచి పెట్టాడు. కొంత కాలము తరువాత రాముడు నిన్ను, భరత

శత్రుఘ్నులను కూడా విడిచి పెడతాడట. అదంతా ఆ బ్రాహ్మణుడు మీ తండ్రి గారితో చెబుతుంటే నేను విన్నాను.

లక్ష్మణా! అంతేకాదు, ఒకసారి దుర్వాస మహాముని వద్దకు మీ తండ్రి గారి వద్దకు వెళ్లాడు. అప్పుడే నేను కూడా అక్కడే ఉన్నాను. దుర్వాసుడు మీ తండ్రి గారితోనూ, మీ కులగురువు వసిష్ఠుల వారితోనూ చెప్పిన మాటలు నేను విన్నాను. ఆ మాటలు నేను విన్నాను అని తెలిసి మీ తండ్రి దశరథుడు ఆ మాటలు నేను ఎక్కడా ఎవరితోనూ చెప్పకూడదని నాతో ఒట్టు వేయించుకున్నాడు. అందుకని, ఆమాటలు నేను ఎవరితోనూ ఎక్కడా చెప్పకూడదు. కానీ ఇప్పుడు దశరథుడు లేడు. ఆ ఒట్టుకు విలువలేదు. నీకు వినవలెనని కుతూహలము ఉంటే ఆ మాటలు నేను చెబుతాను. శ్రద్ధగా విను. కాని నేను నీతో ఈ విధంగా చెప్పినట్టు నీ తమ్ములు భరతునికి శత్రుఘ్నునికి చెప్పకూడదు. ఇది అంతా దైవఘటన అని సరిపెట్టుకోవాలి." అని అన్నాడు సుమంత్రుడు.

అప్పుడు లక్ష్మణుడు సుమంత్రుని చూచి "సుమంత్రా! నీవు దుర్వాసుల వలన విన్న విషయములు నాకు యధాతథంగా చెప్పు. నిజం చెప్పు." అని అన్నాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము యాభయ్యవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

యాభైఒకటవ సర్గ.

సుమంత్రుడు తాను దుర్వాప మహాముని వద్దనుండి విన్న మాటలను లక్ష్మణునికి చెప్పనారంభించాడు. “ఓ లక్ష్మణా! ఒక సారి, అత్రి మహార్షి కుమారుడైన దుర్వాస మహర్షి చాతుర్మాస్య వ్రతమును ఆచరించడానికి వసిష్ఠుని ఆశ్రమానికి వచ్చాడు. ఆ సమయంలో తన కుల గురువు వసిష్ఠుని చూడటానికి దశరథుడు వసిష్ఠుని ఆశ్రమానికి వెళ్లాడు. ఆయన వెంట నేనూ వెళ్లాను. అక్కడ ఉన్న దుర్వాసమహర్షిని చూచి మీ తండ్రి గారు భక్తితో నమస్కరించారు. వసిష్ఠుడు, దుర్వాసుడు మీతండ్రి గారిని ఆహ్వానించారు. అందరూ కూర్చుని ఇష్టాగోష్టిగా మాట్లాడుకుంటున్నారు.

ఆ సమయములో మీ తండ్రి గారు త్రికాలవేది అయిన దుర్వాసుని ఈ విధంగా అడిగాడు. “ఓ మహర్షీ! నా గురించి, నా పుత్రుల గురించి, పౌత్రుల గురించి, నా వంశము గురించి చెప్పండి. మాఇక్ష్వాకు వంశము ఎంత కాలము ఉంటుంది? నా కుమారుడు రాముడు ఎంతకాలము జీవిస్తాడు. లక్ష్మణ,భరత,శత్రుఘ్నుల ఆయు:పరిమాణము ఎంత? నాకు మనుమలు కలుగుతారా! నా మనుమల ఆయుర్దాయము ఎంత? రామునికి ఎంతమంది కుమారులు కలుగుతారు? మా వంశము యొక్క భవిష్యత్తు గురించి దయచేసి నాకు తెలుపండి.” అని వినయంగా అడిగాడు దశరథుడు.

దశరథుని మాటలు విన్న దుర్వాసుడు కొంచెంసేపు ఆలోచించి ఇలా అన్నాడు. "ఓ దశరథ మహారాజా! నీకు ఒక పూర్వ వృత్తాంతమును చెబుతాను విను. పూర్వము దేవతలకు అసురులకు యుద్ధం జరిగింది. అసురులు ఓడిపోయారు. వారందరూ భృగు మహర్షి భార్య వద్దకు పోయి ఆమె శరణు కోరారు. ఆమె వారికి ఆశ్రయం ఇచ్చింది. వాళ్లు దేవతల నుండి ఏ మాత్రము భయం లేకుండా భృగు మహర్షి ఆశ్రమంలో ఆయన భార్య ఆశ్రయంలో ఉన్నారు. ఈ సంగతి విష్ణువుకు తెలిసింది. ఆయన కోపం ప్రజ్వరిల్లింది. వెంటనే విష్ణువు, తన చక్రాయుధంతో, అసురులకు ఆశ్రయం ఇచ్చిన భృగు మహర్షి భార్య తలను, నరికివేసాడు. తన భార్య తలను విష్ణువు తన చక్రాయుధంతో నరకడం కళ్లారా చూచిన భృగువు విష్ణువును శపించాడు. "నీవు నా భార్యను చంపి నాకు భార్యావియోగము కలిగించావు. నీవు కూడా భూలోకంలో పుట్టి చాలాకాలము భార్యను పోగొట్టుకొని భార్యవియోగమును అనుభవిస్తావు." అని శపించాడు.

భార్యను చంపాడు అన్న కోపంలో విష్ణువుకు శాపం ఇచ్చాడే కానీ తరువాత పశ్చాత్తాప బడ్డాడు భృగు. తరువాత విష్ణువును పూజించాడు. భృగువు పూజకు మెచ్చిన విష్ణువు "ఓ భృగు మహర్షీ! నీవు నాకు శాపం ఇచ్చాను అని దిగులు చెందకు. రాబోయే అవతారంలో లోక కల్యాణము కొరకు అది నాకు వరంగా పరిణమిస్తుంది." అని అన్నాడు. ఓ దశరథ మహారాజా! ఆ ప్రకారంగా భృగు చేత శపించ బడ్డ విష్ణువు నీకు కుమారుడిగా జన్మించాడు. రామునికి భార్యావియోగం తరచు సంభవిస్తుంది. అది తప్పదు. రాముడు చాలా కాలము అయోధ్యను

పాలిస్తాడు. రాముడు అయోధ్యను 11,000 సంవత్సరములు పాలించి తరువాత బ్రహ్మలోకం చేరుకుంటాడు. తన జీవిత కాలంలో రాముడు ఎన్నో యజ్ఞములను, యాగములను చేస్తాడు. అశ్వమేథ యాగములను చేస్తాడు. రాముడికి సీత యందు ఇద్దరు కుమారులు జన్మిస్తారు." అని చెప్పాడు దుర్వాసుడు. తన భవిష్యత్తు, తన కుమారుల భవిష్యత్తు తెలుసుకున్న మీ తండ్రి దశరథుడు తరువాత అయోధ్యకు తిరిగి వచ్చాడు. దుర్వాసుడు నీ తండ్రి దశరథునితో చెప్పిన మాటలను నేను విన్నాను. ఆ మాటలే నీకు చెప్పాను. కాబట్టి రాముని విషయంలో కానీ సీత విషయంలో కానీ మనము దు:ఖించనవసరం లేదు." అని సుమంత్రుడు చెప్పాడు.

ఆ మాటలు విన్న లక్ష్మణుడు మనసుకుదుట పరచుకున్నాడు. అప్పటికి సాయంత్రం అయింది. లక్ష్మణుడు సుమంత్రుడు కేశినీ నదీ తీరంలో ఆ రాత్రికి విశ్రాంతి తీసుకున్నారు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము యాభైఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

యాభైరెండవ సర్గ.

ఆ రాత్రికి కేశినీ నదీ తీరంలో నిద్రించిన లక్ష్మణుడు, సుమంత్రుడు మరునాడు ఉదయమే ప్రయాణమై మధ్యాహ్నా సమయానికి అయోధ్యకు చేరుకున్నారు. లక్ష్మణుడు రాముని అంత:పురమునకు వెళ్లాడు. “ఇప్పుడు రామునికి నేను ఏమని చెప్పాలి?” అని మధన పడసాగాడు. రాముడు ఒక ఆసనము మీద కూర్చుని ఉన్నాడు. లక్ష్మణుడు తలవంచుకొని రాముని ఎదురుగా నిలబడ్డాడు. రాముని పాదాల మీద పడ్డాడు. రామునితో ఇలా అన్నాడు. “మహారాజా! నీ ఆజ్ఞ ప్రకారము నేను సీతను గంగానదీ తీరప్రాంతమున ఉన్న వాల్మీకి ఆశ్రమము దగ్గర విడిచి వచ్చాను. రామా! సీతను విడిచిపెట్టినందుకు దు:ఖపడవద్దు. అంతా దైవనిర్ణయం. విధివిధానము. మన చేతిలో ఏమీ లేదు. మనము నిమిత్తమాత్రులము. ఎంత ధనము కూడబెట్టినా అది ఒక నాటికి కరిగిపోతుంది. అలాగే ఎంత ఉన్నత స్థితికి చేరుకున్నా, ఆఖరుకు పతనం తప్పదు. భార్య భర్తలు ఎంత అన్యోన్యంగా ఉన్నా, మరణ కాలంలో ఒకరిని ఒకరు విడిచి పోక తప్పదు కదా! కాబట్టి భార్య, పుత్రులు, బంధువులు, స్నేహితుల విషయంలో అధిక మోహము, అధిక ప్రేమ చూపకూడదు. జీవితం అన్న తరువాత సంయోగ వియోగాలు తప్పవు కదా!

కాబట్టి! రామా! నీ మనసును కుదుట పరచుకో. సీతా వియోగమునకు చింతించకు. సీత దు:ఖంలో పడి రాజ్యపాలన విస్మరించకు. నీ వంటి మహాపురుషులు కేవలం భార్య దూరం

అయిందని వ్యధ చెందరు. ధైర్యాన్ని కోల్పోరు. రామా! నీవు ఈ ప్రకారంగా నీ భార్యను తలచుకుంటూ, దు:ఖిస్తూ, రాచ కార్యములను నిర్లక్ష్యం చేస్తే, నీకు మరొక అపవాదు చుట్టుకుంటుంది. భార్యామోహంలో పడి రాచకార్యములను విస్మరించాడు అన్న అపవాదు వస్తుంది. ఒక అపవాదుకు తోడు మరొక అపవాదును భరించాలి. కాబట్టి మనసులో దు:ఖము ఉన్నా దానిని మనసులోనే అణుచుకోవాలి. బయట పడకూడదు." అని రాముడికి హితబోధ చేసాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని మాటలు విన్న రాముడు ఎంతో సంతోషించాడు. "లక్ష్మణా! నీవు చెప్పినది అక్షర సత్యము. తాత్కాలికమైన మోహంలో పడ్డాను. నీవు నాకు కర్తవ్యబోధ చేసావు. రాజుగా నా కర్తవ్యమును నేను సమర్థవంతంగా నిర్వర్తిస్తాను. నాలోని శోకమును వదిలిపెట్టాను. నీ మాటలు నాకు మార్గదర్శకమైనాయి." అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము యాభైరెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

యాభైమూడవ సర్గ.

రాముడు లక్ష్మణునితో ఇంకా ఇలా అన్నాడు. "నీవు నాకు తమ్ముడివే కాదు.స్నేహితుడివి కూడా. నీవంటి స్నేహితుడు లభించడం

చాలా కష్టం. నా మనసులో ఉన్న మాట చెబుతున్నాను విను. సీతను అడవులకు పంపిన తరువాత ఈ నాలుగురోజులు నేను సీతా వియోగ బాధతో రాచ కార్యములు చూడలేదు. రాజ సభకు వెళ్లలేదు. నీ మాటలు విన్న తరువాత నేను ఎంత తప్పుచేసానో అని బాధపడుతున్నాను. వ్యక్తిగతంగా ఎన్ని బాధలు ఉన్నా, రాజకార్యములు మానడం క్షమించరాని నేరం అని నా మనసు ఘోషిస్తూ ఉంది. లక్ష్మణా! నేను ఈ రోజు నుండి రాజ సభకు వస్తున్నానని మంత్రులకు చెప్పు. రాజ పురోహితుని, మంత్రులను వెంటనే పిలిపించు. ప్రతి దినము పౌరుల కార్యములు వారి బాగోగులు చూడని రాజు నరకానికి పోతాడు.” అని అన్నాడు రాముడు.

(5 సంవత్సరాలు ప్రజాసేవ చేస్తానని ఓట్లు వేయించుకొని గెలిచిన ప్రజాప్రతినిధులు, ప్రజలకు సంబంధించిన కార్యక్రమములు చిత్తశుద్ధితో నిర్వహిస్తామని ప్రమాణం చేసిన మంత్రులు, తమ తమ విధులను మరిచి ప్రజల ముఖం చూడకుండా, అసెంబ్లీ, పార్లమెంటు ముఖం చూడకుండా, ఒక వేళ వచ్చినా నిద్రపోతూ, తమ తమ స్వంత వ్యాపారాలు చేసుకుంటూ, అక్రమార్జనలో మునిగితేలుతూ, ప్రజలను ప్రజాసేవను మరిచిపోయే ప్రజాప్రతినిధులకు, మంత్రులకు, రాముడి మాటలు ఒక గుణపాఠం. వ్యక్తిగతంగా ఎన్ని బాధలు కష్టాలుఉన్నా, రాజకార్యాలు మానకూడదు అన్న సూత్రానికి కట్టుబడినదే రామరాజ్యం. రామరాజ్యం తెస్తామని రంకెలు వేస్తున్న నేటి ప్రజాప్రతినిధులు, కార్యాలయాలలో పనిచేస్తున్న ఉన్నత అధికారులు, ఆఫీసర్లు, ఉద్యోగులు ఆచరించవలసిన విధి, కర్తవ్యము.).

రాముడు లక్ష్మణునితో ఇంకా ఇలా అన్నాడు. "లక్ష్మణా! పూర్వము నృగుడు అనే మహారాజు ఉండేవాడు. అతను ప్రజలను చక్కగా పాలించేవాడు. బ్రాహ్మణులను గౌరవించేవాడు. ధార్మికుడు. ఎట్టి విపత్కర పరిస్థితులలో కూడా అసత్యము పలికేవాడు కాదు. అతడు పర్వ దినములలో గోవులను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చేవాడు. ఒకసారి ఒక బ్రాహ్మణునికి చెందిన ఆవు, దూడతో సహా మేత మెయ్యడానికి ఊరిబయటకు వెళ్లింది. ఆ సమయంలో రాజు గారు దానం ఇవ్వడానికి, రాజభటులు గోవులను తీసుకొని వెళుతున్నారు. ఈ బ్రాహ్మణుడికి చెందిన ఆవు, దూడ ఆ గోవులలో కలిసిపోయాయి. రాజభటులు ఆ గోవులను రాజ ప్రాసాదమునకు తీసుకొని వెళ్లారు. తన గోవు, దూడ కనపడలేదని ఈ బ్రాహ్మణుడు ఊరూ వాడా వెదుకుతున్నాడు.

మరునాడు పర్వదినం కావడం వలన, నృగమహారాజు బ్రాహ్మణులకు యధావిధిగా గోవులను దానం చేసాడు. బ్రాహ్మణునికి చెందిన ఆవును, దూడను కూడా మరొక బ్రాహ్మణునికి దానం చేసాడు. దానం తీసుకున్న బ్రాహ్మణుడు తనకు ఇచ్చిన ఆవును దూడను తీసుకొని తన ఇంటికి వెళ్లాడు. తన వద్ద నుండి తప్పిపోయిన ఆవును వెతుక్కుంటూ, ఆ బ్రాహ్మణుడు దానం స్వీకరించిన బ్రాహ్మణుని ఇంటి వద్దకు వచ్చాడు. తన గోవు అక్కడ ఉన్నదని చూచాడు. ఆ గోవును "శబలా!" అని పిలిచాడు. తన అసలు యజమాని కంఠస్వరము విన్న ఆ గోవు పరుగెత్తుకుంటూ ఆ బ్రాహ్మణుని వద్దకు వచ్చింది. వెంటనే ఆ బ్రాహ్మణుడు, దానం తీసుకున్న బ్రాహ్మణునితో ఇలా అన్నాడు. "ఈ గోవు, దూడ నావి, ఇవి మీ వద్దకు ఎలా వచ్చాయి." అని అడిగాడు. "ఈ గోవును,

దూడను నాకు నృగమహారాజు దానంగా ఇచ్చాడు.” అని బదులు చెప్పాడు. “నా గోవును, దూడను దానంగా ఇవ్వడానికిరాజు ఎవరు. పదండి రాజు వద్దనేతేల్చుకుందాము” అని ఆ బ్రాహ్మణులు ఇద్దరూ గోవు, దూడతో సహా రాజమందిరానికి వెళ్లారు. నృగమహారాజును చూడాలని రాజభటులకు చెప్పారు. ఎన్ని రోజులు ఉన్నా వారికి రాజుగారిని చూడటానికి అనుమతి లభించలేదు. ఆ బ్రాహ్మణులకు కోపం వచ్చింది. “ప్రజల కష్టసుఖాలు విచారించని రాజు, పనిమీద వచ్చిన ప్రజలకు దర్శనం ఇవ్వని రాజు వృథా. అందుకని ఓ నృగు మహారాజా! నీవు తొండగా మారి, చాలా కాలము బావులలో పడి ఉండు.” అని శపించారు. ఈ విషయం తెలిసిన నృగు మహారాజు వచ్చి ఆ బ్రాహ్మణుల శరణు వేడాడు. శాంతించిన ఆ బ్రాహ్మణులు శాపవిమోచన అనుగ్రహించారు. “ఓ నృగు మహారాజా! ద్వాపర యుగంలో యాదవ వంశంలో శ్రీమహావిష్ణువు, దేవకీ వసుదేవులకు పుత్రుడుగా జన్మించగలడు. ఆయన నిన్ను ముట్టుకోగానే నీకు శాపవిమోచన కలుగుతుంది.” అని అనుగ్రహించారు.

తరువాత ఆ గోవు వివాదము ఎటూ తేలక పోవడంతో, ఆ బ్రాహ్మణులు ఇద్దరూ ఆ గోవును మరొక బ్రాహ్మణునికి దానంగా ఇచ్చి వెళ్లిపోయారు. ఈ నృగుమహారాజు బ్రాహ్మణ శాపమును అనుభవిస్తున్నాడు. అందువలన లక్ష్మణా! రాజుకు ఎన్ని స్వంత పనులు ఉన్ననూ, మనసులో సుఖదు:ఖములు ఉన్ననూ, వాటిని పక్కన బెట్టి, ముందు రాచకార్యములకు ప్రాధాన్యం ఇవ్వాలి.

కాబట్టి లక్ష్మణా! ముందు నీవు పోయి న్యాయం కోసం గానీ, రాజుతో పని ఉండి గానీ వచ్చిన వారిని వెంటనే రాజసభలో ప్రవేశపెట్టమను." అని పలికాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము యాభైమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

యాభై నాలుగవ సర్గ.

నృగు మహారాజు కథ విన్న లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు. "రాజా! అంత చిన్న అపరాధమునకు ఆ బ్రాహ్మణులు అంత పెద్ద శిక్ష విధించారు కదా! మరి ఆ నృగు మహారాజు ఆ బ్రాహ్మణశాపమును ఏ విధంగా అనుభవించాడు." అని అడిగాడు. రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. "నృగు మహారాజు వెంటనే తన కుమారుడిని రాజ్యాభిషిక్తుని చేసాడు. రాజ్యభారాన్ని కుమారుడికి అప్పగించాడు. తాను తొండగా ఏ బావిలోనో ఉడడం కన్నా అటువంటి బావులను తనే స్వయంగా తవ్వించాడు. తాను తొండ రూపంలో అన్ని కాలాలలోనూ సుఖకరంగా ఉండటానికి తగిన గోతులు తవ్వించుకున్నాడు. వర్షాకాలంలో తడవకుండా ఉండేట్టు సౌకర్యంగా ఒక గోతిని తవ్వించాడు. చలికాలంలో వెచ్చగా ఉండేటట్టు మరొక గోతిని నిర్మాణం చేయించాడు. వేసవి కాలంలో చల్లగా ఉండేటట్టు మరొక గోతిని నిర్మాణం చేయించాడు. ఆ

గోతుల చుట్టు ఒక యోజనము దూరం వరకూ పళ్లు పూలు సమృద్ధిగా కాచే చెట్లతో కూడిన ఒక ఉద్యానవనమును ఏర్పాటుచేయించాడు. తాను తవ్వించిన విశాలమైన గోతుల లోపల గోడలకు సుందరమైన చిత్రములను చెక్కించాడు. ఆ గోతులలోకి సుగంధము వచ్చేటట్టు చుట్టు ఉన్న ఉద్యాన వనములో పరిమళభరితమైన పూల మొక్కలు నాటించాడు. రాజ్యాభిషిక్తుడైన పుత్రునికి తగు జాగ్రత్తలు చెప్పాడు. రాజ్య పాలనలోనూ, ప్రజల కష్టములు విచారించడంలోనూ ఏమాత్రం అలసత్వము చూపగూడదనీ, అలా చేసినందువలననే తాను శాపగ్రస్తుడను అయ్యానని చెప్పాడు.

ఇంకా తన కుమారునికి ఇలా చెప్పాడు. "కుమారా! చేసిన కర్మకు ఫలమును అనుభవించకుండా తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. పూర్వజన్మలో గానీ ఈ జన్మలో గానీ చేసిన కర్మలకు ఫలితము అనుభవించియే తీరవలెను. కష్టములు వచ్చినపుడు దు:ఖించడం, సుఖాలు వచ్చినపుడు ఆనందపడటం రాజుకు మంచిది కాదు. కాబట్టి నాకోసము దు:ఖించకు." అని చెప్పాడు. తరువాత తన శాపఫలమును అనుభవించడానికి తొండ రూపంతో ఆ గోతులలోకి వెళ్లిపోయాడు.

(ఇది చదివిన తరువాత మీకు ఏమి గుర్తుకు వస్తూ ఉంది. పెద్ద పెద్ద వాళ్లు ఏదో కేసులో అరెస్టు అయినపుడు వెంటనే వారికి గుండె నొప్పి వస్తుంది. హాస్పిటల్‌లో చేరి జైలు కూడు తప్పించుకుంటారు. ఇంకా కొంత మంది తమ పలుకుబడి ఉపయోగించి జైల్లోనే అన్ని సౌకర్యాలు కల్పించుకుంటారు. ఇంటిభోజనం, సెల్ ఫోన్, లాప్‌టాప్, ఫాను, ఏ.సి.ఈ

సౌకర్యాలు పొందుతారు. నృగు మహారాజు కూడా తన శాపకాలమును సుఖవంతం చేసుకున్నాడు కదా! యుగాలు మారినా మనుషులు వారి బుద్ధులు మారవు అనడానికి ఇది చక్కని ఉదాహరణ).

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము యాభైనాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

యాభై ఐదవ సర్గ.

నృగ చక్రవర్తికి వచ్చిన శాపమును గురించి చెప్పిన రాముడు, లక్ష్మణుడికి మరొక కథ కూడా చెప్ప నారంభించాడు. లక్ష్మణుడు కూడా శ్రద్ధతో రాముడు చెప్పే కథలు వింటున్నాడు. "లక్ష్మణా! మన ఇక్ష్వాకు వంశంలో నిమి అనే మహారాజు ఉండేవాడు. ఆయన రాజధాని వైజయంతి అనే నగరము. ఆయనకు చాలాకాలము సాగే ఒక యజ్ఞము చెయ్యాలని సంకల్పము కలిగింది. దానికి తన తండ్రి ఇక్ష్వాకును ఆహ్వానించాడు. ఆ యాగమునకు ఋత్విక్కుగా బ్రహ్మర్షి వసిష్ఠుని నియమించాడు. వసిష్టునికి సహాయకులుగా అత్రిని, అంగిరసుని, భృగువును కూడా ఆహ్వానించాడు. నిమి వసిష్టుని దగ్గరకు పోయి తన యాగమునకు ఋత్విక్కుగా ఉండమని అడిగాడు. "నేను దేవేంద్రుడు చేసే యాగంలో ఉన్నాను. ఈ యాగం కాగానే నీ యాగం జరిపిస్తాను" అని అన్నాడు.

అంత ఆలస్యం భరించలేక, నిమి చక్రవర్తి, తనకు అందుబాటులో ఉన్న గౌతముని ఋత్విక్కుగా నియమించాడు. అక్కడ ఇంద్ర యజ్ఞము పూర్తి అయింది. వసిష్టుడు నిమి చేత యజ్ఞము చేయించడానికి వచ్చాడు. తన స్థానంలో గౌతముడు యజ్ఞం జరిపిస్తూ ఉండటం చూచాడు. వసిష్ఠునికి కోపం వచ్చింది. నిమి చక్రవర్తికి తాను వచ్చినట్టు వర్తమానము పంపాడు. అప్పటికే యజ్ఞకార్యములలో అలసి పోయిన నిమిచక్రవర్తి గాఢ నిద్రలో ఉన్నాడు. అందుకని వసిష్ఠుని వద్దకు వెంటనే రాలేకపోయాడు. దాంతో వసిష్ఠుని కోపం ఇంకా పెరిగిపోయింది. "ఓ రాజా! నువ్వు నన్ను అవమానించావు. నేను పిలిచినా రాకుండా జడుడి మాదిరి ఉన్నావు. కాబట్టి నీ దేహము చైతన్యము కోల్పోయి జడమై పోవుగాక!" అని శాపం పెట్టాడు.

నిమి మహారాజు మేల్కొన్న తరువాత మంత్రులు ఆయనకు వసిష్ఠుడు ఇచ్చిన శాపం గురించి తెలియజేసారు. నిమికి కూడా కోపం వచ్చింది. "నేను ప్రాణులకు సహజమైన నిద్రావస్థలో ఉన్నానని తెలిసి కూడా నన్ను దారుణంగా శపించావు. అందుకని నీ దేహం కూడా చైతన్యము కోల్పోయి జడపదార్థంగా తయారవుతుంది" అని తిరుగు శాపం ఇచ్చాడు. ఈ ప్రకారంగా వసిష్ఠుడు, నిమి ఒకరిని ఒకరు శపించుకున్నారు. ఆ శాపాల కారణంగా ఇద్దరూ తమ దేహాలు వదిలి గాలిలో సంచరిస్తున్నారు." అని రాముడు లక్ష్మణునితో చెప్పాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము యాభై ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

యాభై ఆరవ సర్గ.

రాముడు లక్ష్మణునితో ఇలా చెప్పసాగాడు. “లక్ష్మణా! దేహం లేకుండా బాధపడుతున్న వసిష్ట మహాముని మరొక దేహము కొరకు తన తండ్రి అయిన బ్రహ్మదేవుని వద్దకు వెళ్లాడు. “ తండ్రీ! బ్రహ్మదేవా! నిమి శాపం వలన నేను నా దేహాన్ని కోల్పోయాను. వాయురూపంలో తిరుగుతున్నాను. దేహం లేకుండా నిత్య కర్మలు చేయడం సాధ్యం కాదు కదా! ప్రస్తుతము నేను ఏ పనీ చేయలేకుండా ఉన్నాను. కాబట్టి నాకు మరొక దేహము అనుగ్రహించండి.” అని అడిగాడు. దానికి బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. “కుమారా! నీవు మిత్రావరుణుల వద్దకు పోయి వారి తేజస్సులో ప్రవేశించు. ” అని అన్నాడు. గాలి రూపంలో ఉన్న వసిష్ఠుడు మిత్రా వరుణుల వద్దకు వెళ్లాడు.

అక్కడ మిత్ర వరుణుల వద్ద మరొక కథ నడుస్తూ ఉంది. దేవ లోకంలో ఊర్వశి అనే అప్సరస ఉంది. ఆమెను మిత్రుడు వరించాడు. కాని ఊర్వశి మనసుమాత్రం వరుణినిక అర్పించింది. ఒక రోజు ఊర్వశి చక్కగా అలంకరించుకొని మిత్రుడు వద్దకు వెళుతూ ఉంది. మధ్యలో వరుణుడు అడ్డగించాడు. తనతో లైంగిక సంపర్కము జరపమని కోరాడు. అప్పుడు ఊర్వశి ఇలా అంది. “వరుణా! నన్ను ముందుగా మిత్రుడు పిలిచాడు. ఆయన దగ్గరకు వెళుతున్నాను. నేను అతనికి చెందిన దానను. కానీ నా మనసు మాత్రము నీ మీదనే లగ్నం అయి ఉంది. నా కోరిక కూడా నీ మీదనే. కాని ముందుగా మిత్రుడు నన్ను పిలిచాడు కాబట్టి ఈ

శరీరము మాత్రము మిత్రుడికి ఇవ్వాలి కదా. ఇప్పుడు నువ్వు కావాలి అంటే ఏం చెయ్యను." అని పలికింది ఊర్వసి.

"నేను మాత్రం ఏం చెయ్యను. నిన్ను నీ అందం చూడగానే నాకు కూడా వీర్యము పతనం అయ్యేటట్టు ఉంది. నా వీర్యమును ఒక కుండలో విడుస్తాను. నీవు నాతో కలవడానికి ఇష్టం లేకపోయినా, నా కోరిక తీర్చు." అని అన్నాడు. దానికి ఊర్వశి సంతోషంగా ఒప్పుకుంది. వరుణుడు తన వీర్యాన్ని ఒక కుండలో విడిచాడు. తరువాత ఊర్వశి మిత్రుడి వద్దకు వెళ్లింది. జరిగింది అంతా అప్పటికే మిత్రుడికి తెలిసిపోయింది. మిత్రుడు కోపంతో ఊర్వశితో ఇలా అన్నాడు. "నేను ముందుగా నిన్ను పిలిచాను కదా! దారిలో వరుణుడు కనపడగానే ఆయన వద్దకు వెళతావా! ఈ చెడ్డ పని చేయడానికి నీ మనసెలా ఒప్పింది. నిన్ను శపిస్తున్నాను. నువ్వు మానవలోకంలో పుట్టు. కాశీరాజ్యాన్ని పురూరవుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు. నీవు ఆయనకు భార్యగా ఉండు." అని శపించాడు.

మిత్రుడి శాప కారణంగా ఊర్వశి కాశీరాజు పురూరవునికి భార్య అయింది. పురూరవునికి ఊర్వశికి ఒక కుమారుడు కలిగాడు. వాడి పేరు ఆయువు. ఆ ఆయువు కుమారుడు నహుషుడు. ఇంద్రుడు వృత్రాసురుని చంపిన కారణంగా ఇంద్రునికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. అప్పటి ఇంద్రుడిని ఆ పదవి నుండి తొలగించారు. ఆ సందర్భంలో నహుషుడు ఇంద్ర పదవికి ఎంపిక అయ్యాడు. ఆ ప్రకారంగా నహుషుడు ఇంద్రపదవిని అధిష్టించాడు. లక్ష సంవత్సరములు ఇంద్రుడిగా

ఉన్నాడు. ఊర్వశి కూడా చాలా సంత్సరములు భూలోకములో గడిపి తన శాప కాలము పూర్తికాగానే ఇంద్రలోకము చేరుకుంది." అని రాముడు లక్ష్మణునితో చెప్పాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము యాభైఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

ఉత్తర కాండము
యాభై ఏడవ సర్గ.

వసిష్ఠుడు, నిమి ఒకరికి ఒకరు శపించు కున్న విషయం పక్కన పెట్టి రాముడు ఊర్వశి కథ చెప్పడంతో లక్ష్మణుడు తికమక పడ్డాడు. తనకు వశిష్టుడు, నిమిల శాపం గురించి చెప్పమని అడిగాడు. అప్పుడు రాముడు ఇలా చెప్పసాగాడు. "లక్ష్మణా! దానికే వస్తున్నా. ఇది వరకు నీకు, ఊర్వశిని చూచి వరుణుడు కామోద్రేకంతో తన వీర్యాన్ని ఒక కుండలో విడిచిపెట్టాడు అని చెప్పాను కదా! ఆ కుండలో నుండి ఇరువురు బ్రాహ్మణులు జన్మించారు. ఆ కుండలో నుండి ముందుగా అగస్త్యుడు అనే మహాఋషి జన్మించాడు. వెంటనే ఆయన తపస్సుకు వెళ్లిపోయాడు. తరువాత ఆ కుంభము నుండి వశిష్టుడు జన్మించాడు. ఆ వశిష్టుడే ఇక్ష్వాకులకు కుల గురువు అయ్యాడు. ఆ ప్రకారంగా వసిష్టుడు తన కొత్త దేహాన్ని పొందాడు.

ఇంక నిమి దేహం లేకుండా ఉన్నాడు కదా!. ఆయనకు ఋషులు యోగదీక్షను ఇచ్చారు. నిమి రాజ్యంలో ఉన్న పౌరులు, ఆయన మంత్రులు అందరూ నిర్జీవమైన నిమి శరీరమును సుగంధ ద్రవ్యములు, లేపనములు పూసి చెడిపోకుండా రక్షిస్తున్నారు. గాలిలో తిరుగుతున్న నిమి యోగదీక్షను పూర్తి చేసాడు. అప్పుడు దేవతలు నిమి వద్దకు పోయి "నీ యోగదీక్ష పూర్తి అయింది. నీకు శరీరం వస్తుంది. నీవు ఎక్కడ ఉండాలో నిర్ణయించుకో" అని అడిగారు.

నేను ఈ సృష్టిలో ఉన్న సకల ప్రాణుల కంటి రెప్పల మీద ఉంటాను" అని అన్నాడు నిమి. దేవతలు అలాగే అనుగ్రహించారు. "నీవు అదృశ్యరూపంలో అన్ని ప్రాణుల కంటి రెప్పల మీద నివసిస్తావు. ప్రాణులు విశ్రాంతి కావాలి అనుకున్నప్పుడు వారి కంటి రెప్పలు నీ మూలంగానే మూసుకుంటాయి." అని వరం ఇచ్చారు. తరువాత దేవతలు వెళ్లిపోయారు. (కనురెప్పపాటు సమయాన్ని నిమేషము అని అంటారు. (మన వాడుకలో ఉన్న నిమిషము కాదు.) నిమి నుంచి నిమేషము అనే పదం పుట్టింది.) ఇప్పుడు నిమి దేహము అలాగే ఉంది. రాజ్యానికి వారసుడు లేడు. ఆ దేహానికి ఒక కుమారుని పుట్టించాలి అని అనుకున్నారు. ఆ దేహమును బయట ఉంచి, యజ్ఞం చేస్తూ, హెూమాలు చేస్తూ, వేద మంత్రాలు చదువుతూ, నిమి దేహమును ఒక అరణితో బలంగా మర్దించారు. (అరణి అనగా, యజ్ఞము చేయుటకు ముందు అగ్నిని పుట్టించడానికి రెండు కర్రలను రాపాడిస్తారు. అందులో నుండి అగ్ని పుడుతుంది. దానికి ఉపయోగించే పొడుగాటి కర్రను అరణి అంటారు) ఆ రాపిడికి నిర్జీవమైన నిమి శరీరం నుండి ఒక పురుషుడు జన్మించాడు.

అతడే జనక మహారాజు. నిర్జీవ శరీరాన్ని మథించడం వల్ల పుట్టిన వాడు కాబట్టి ఆయన రాజ్యానికి మిథిల అనే పేరు వచ్చింది. స్త్రీదేహము లేకుండా జన్మించాడు కాబట్టి ఆయనకు వైదేహుడు అనే పేరు కూడా వచ్చింది. ఆయన రాజ్యమునకు విదేహ రాజ్యము అనే పేరు సార్థకం అయింది. ఆ ప్రకారంగా వసిష్ఠుడు, నిమి మహారాజు తిరిగి జన్మించారు." అని రాముడు లక్ష్మణునితో చెప్పాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము యాభైఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
యాభై ఎనిమిదవ సర్గ.

ఆశ్చర్యకరమైన వసిష్టుడు నిమి వృత్తాంతములను విన్న లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు. "రామా! దీని కంతటికీ కారణం వసిష్టుడు నిమికి ఇచ్చిన శాపము. వసిష్టుడు రాని కారణంగా గౌతముని ఋత్విక్కుగా పెట్టుకున్నాడు. ఇందులో అతని తప్పు ఏముంది. పైగా యాగ దీక్షలో ఉన్న నిమిని శపించడం వసిష్టుని తప్పు కాదా!" అని అన్నాడు. దానికి రాముడు ఇలా చెప్పాడు. "లక్ష్మణా! అందరికీ ఓర్పు సహనము ఉండవు. వీరే కాదు ఇంకా ఎంతో మంది ఓర్పును సహనాన్ని కోల్పోయి కష్టాలలో చిక్కుకున్నారు. కాని యయాతి మహారాజు సత్వగుణ సంపన్నుడు. ఆయన ఓర్పును ఎలా ప్రదర్శించాడో చెబుతాను విను.

పురూరవుడి మనుమడు, ఆయుషునకు కుమారుడు, నహుషుడు అనే రాజు గురించి చెప్పానుకదా. ఆ నహుషుని కుమారుడే యయాతి. ఆయనకు ఇద్దరు భార్యలు. (ఈ యయాతి గురించి మనము భారతంలో విపులంగా చదువుకున్నాము.) రాక్షస రాజైన వృషపర్వుని కుమార్తె శర్మిష్ట. రాక్షస గురువు శుక్రాచార్యుని కుమార్తె అయిన దేవయాని. కాని యయాతికి శర్మిష్ట యందు ఎక్కువ ప్రేమ. యయాతికి దేవయాని అంటే అంత ప్రేమలేదు. యయాతికి శర్మిష్ట యందు పూరువుడు, దేవయాని యందు యదువు జన్మించారు. యయాతికి శర్మిష్ట అంటే ఎంతో ఇష్టం. అలాగే శర్మిష్టకు పుట్టిన పూరువు అంటే కూడా చాలా ఇష్టం. దానికి తోడు పూరువు కూడా సకల సద్గుణ సంపన్నుడు. యయాతి కి దేవయాని అంటే ఇష్టం లేదుకాబట్టి ఆమె కుమారుడు యదువు అంటే కూడా ఇష్టం లేదు. యదువును దగ్గరకు రానిచ్చేవాడుకాదు. అది చూచి యదువుకు దు:ఖం ముంచుకొచ్చింది.

ఒక రోజు తల్లి దేవయాని వద్దకు పోయి ఇలా అన్నాడు. “అమ్మా! నాన్న గారికి నీవు అన్నా నేను అన్నా అస్సలు ఇష్టం లేదు. ఎందుకమ్మా మనం ఇక్కడ ఉండటం. మనం వెళ్లిపోదాము. అయినా మనకేం తక్కువ అమ్మా నువ్వు రాక్షసులకు గురువు అయిన శుక్రాచార్యుల వారి కుమార్తెవు. నేను ఆయనకు మనుమడిని. అమ్మా ఈ దు:ఖమును అవమానమును ఇంక సహించలేమమ్మా. ఇన్ని అవమానములు భరించి ఇక్కడ ఉండేదానికన్నా అగ్నిలో దూకడం మేలు. తండ్రిగారిని పూరువుతోనూ, వాడి తల్లితోనూ సుఖపడనీ. అమ్మా! ఈ అవమానమునుసహించి నువ్వు ఉండగలిగితే ఉండు. నేను మాత్రం

ఉండను. ఈ అవమానమును భరించడం కన్నా నాకు మరణమే శరణ్యము" అని ఏడుస్తూ అన్నాడు యదువు.

కుమారుడి దు:ఖాన్ని చూచి తట్టుకోలేకపోయింది దేవయాని. వెంటనే తండ్రి శుక్రాచార్యుని మనసులో స్మరించుకుంది. వెంటనే శుక్రాచార్యుడు కుమార్తె ముందు ప్రత్యక్షం అయ్యాడు. దు:ఖంతో కుంగి పోతున్న కుమార్తెను, మనుమడిని చూచి "ఏమమ్మా! ఏమి జరిగింది!" అని అడిగాడు. "తండ్రీ! నాకు ఇక్కడ జరుగుతున్న అవమానమునకు నేను నీళ్లలోగానీ, అగ్నిలో గానీ దూకి మరణిస్తాను. లేదా విషము తిని చస్తాను. అంతే కానీ అనుదినమూ ఈ అవమానములను భరించలేను. తండ్రీ! నీవు రాక్షసులకు గురువు. అందరికీ పూజనీయుడవు. నాకుజరిగిన అవమానము నీకు జరిగినట్టు కాదా! నా భర్త యయాతి నన్ను తిరస్కరించి నన్ను అవమానించాడు. తద్వారా నిన్నూ అవమానించాడు. ఈ ఇంట్లో నాకు ఏ మాత్రం గౌరవము లేదు, అనాదరము తప్ప." అని ఏడుస్తూ చెప్పింది దేవయాని.

కుమార్తె శోకమును చూచి తట్టుకోలేకపోయాడు శుక్రుడు. యయాతిని పిలిపించాడు. "యయాతి మహారాజా! నీవు నీ వయస్సును, యవ్వనమును, అందమును చూచుకొని గర్వపడుతూ, రాజకుమార్తె అయిన శర్మిష్టను ఆమె కుమారుడిని ఆదరిస్తూ, నా కుమార్తెను నిరాదరణకు గురి చేసావు. అవమానించావు. నా కూతురిని అవమానిస్తే నన్ను కూడా అవమానించినట్టే. కాబట్టి నిన్ను ఈ క్షణం నుండి ముసలి తనము ఆవహిస్తుంది. రోజురోజుకూ నీ శరీరం శిథిలము అయిపోతుంది.

నీవు ఏ సుఖాలను అనుభవించలేవు.” అని శపించాడు. శుక్రాచార్యుడు ఆ ప్రకారము తన అల్లుడు యయాతిని శపించి, కుమార్తె దేవయానిని ఓదార్చి, తన ఇంటికి వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము యాభైఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

యాభైతొమ్మిదవ సర్గ.

శాపగ్రస్తుడైన యయాతిని ముసలి తనం ఆవహించింది. శరీరం శిథిలం అయింది. యయాతికి దు:ఖము ముంచుకొచ్చింది. దేవయాని దేవయాని కుమారుడు యదువును పిలిచి ఇలా అడిగాడు. “కుమారా! నీ తాతగారి శాపవశాత్తు నేను ముసలివాడిని అయ్యాను. నాకు ఇంకా ఇహలోక భోగములు అనుభవించవలెనని కోరికగా ఉంది. నాకు సాయం చెయ్యగలవా! నా ముసలి తనమును నీవు తీసుకొని నీ యవ్వనమును నాకు ఇమ్ము. నేను భోగములు అనుభవించిన తరువాత మరలా నీ యవ్వనమును నీకు ఇస్తాను.” అని అడిగాడు.

“అదేంటి తండ్రీ! ఈ మాత్రం దానికి నేను ఎందుకూ. తమరి ప్రియపుత్రుడు పూరువు ఉన్నాడు కదా! ఆయన మీకు తన యవ్వనాన్ని ఇస్తాడు లెండి. తండ్రీ! నన్ను మీతో పాటు భోజనం చేయనిచ్చారా!

రాచకార్యములలో పాల్గొననిచ్చారా! మీకు అన్నీ ఆ పూరువే కదా! ఈ సాయం కూడా ఆ పూరువే చేస్తాడు లెండి. నేనెందుకూ!" అని అన్నాడు వెటకారంగా.

వెంటనే యయాతి శర్మిష్ట కుమారుడు పూరువు వద్దకు వెళ్లాడు. "కుమారా! నీ ముసలి తనమును తీసుకొని నీ యవ్వనమును నాకు ఇమ్ము. నేను భోగములు అన్నీ తనివితీరా అనుభవించి, తరువాత నీ యవ్వనమును నీకు తిరిగి ఇస్తాను. ఇది నీకు సమ్మతమేనా!" అని అన్నాడు. వెంటనే పూరువు "తండ్రీ! ఇన్నిరోజులకు తమరి ఋణం తీర్చుకొనే సమయం వచ్చింది. మీకు సేవ చేసుకొనే భాగ్యాన్ని నాకు కల్పించి నన్ను ధన్యుడిని చేసారు. నా యవ్వనాన్ని మీకు సంతోషంగా ఇస్తున్నాను స్వీకరించండి." అని అన్నాడు. వెంటనే యయాతి తన ముసలి తనమును తన కుమారుడు పూరువుకు ఇచ్చి అతని యవ్వనాన్ని స్వీకరించాడు. చాలాకాలం పాటు యయాతి ఇహలోక సుఖాలు అనుభవించాడు.

తరువాత తన కుమారుడు పూరువును పిలిచి "కుమారా! నేను నీ వద్ద ఉంచిన నా ముసలి తనమును నాకు తిరిగి ఇమ్ము. నీ యవ్వనమును తీసుకొమ్ము." అని అన్నాడు. వెంటనే పూరువు తన తండ్రి ముసలి తనమును ఆయనకు ఇచ్చి తన యవ్వనాన్ని తిరిగి స్వీకరించాడు. తరువాత తన కుమారులు పూరువు, యదువును చూచి ఇలా అన్నాడు. "కుమారా పూరువూ! తండ్రి ఆజ్ఞను పాలించి, నా కోర్కెను తీర్చావు. తండ్రి ఋణం తీర్చుకున్నావు. నాకు చాలా సంతోషంగా ఉంది. నా సామ్రాజ్యానికి నిన్ను పట్టాభిషిక్తుని చేస్తున్నాను. నీ పుత్రపౌత్ర పర్యంతము

ఈ రాజ్యాని ఏలుకో!" అని అన్నాడు. (ఆ పూరుడే పూరు వంశమునకు మూలకర్త.). తరువాత యయాతి యదువును చూచి ఇలా అన్నాడు. "నీవు నా కుమారుడివి కావు. క్షత్రియుడివి అసలే కావు. నా కుమారుడి రూపంలో ఉన్న రాక్షసుడివి. అందుకే తండ్రి మాటను ధిక్కరించావు. కాబట్టి నీకు రాక్షసులే సంతానంగా పుడతారు. నీవంశము రాక్షస వంశము అవుతుంది. నీ వంశము కూడా మారి పోతుంది. ఇంక నుండి నీది చంద్రవంశము కాదు. యదువంశము." అని కుమారుడిని శపించాడు. తరువాత తన కుమారుడు పూరువును రాజ్యాభిషిక్తుని చేసి యయాతి వానప్రస్థమునకు వెళ్లిపోయాడు. తరువాత మరణించి స్వర్గానికి వెళ్లాడు.

పూరువు కాశీ రాజ్యములో ప్రతిష్ఠాన పురము అనే పురమును నిర్మించి, దానిని రాజధానిగా చేసుకొని కాశీరాజ్యమును పరిపాలించాడుపూరువు. రాజవంశమునుండి బహిష్కరింపబడిన యదువుకు రాక్షసులు పుత్రులుగా జన్మించారు. (మహాభారతములో యయాతి కథ వేరేవిధంగా ఉంది.) లక్ష్మణా! యయాతికి ఉన్న ఓర్పు,సహనం నిమికి లేదు. అందుకే తన శరీరాన్ని పోగొట్టుకున్నాడు." అని అన్నాడురాముడు.

తరువాత రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! ఇప్పటికే ఆలస్యం అయింది. నేను కూడా నృగ మహారాజు మాదిరి నా కోసం వచ్చిన వారిని నిర్లక్ష్యం చేయకుండా వెను వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తాను. వెంటనే రాజ సభ ఏర్పాటే చేయించు." అని అన్నాడు. తన

మాట రాముడు మన్నించి నందుకు లక్ష్మణుడు ఆనందంతో రాజాజ్ఞను పాటించడానికి వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము యాభైతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

(దీని తరువాత వచ్చే మూడు సర్గలు తరువాత చేర్చబడినవి,
మూలంలో లేవు అని పెద్దల అభిప్రాయము.
కానీ పాఠకుల సౌకర్యార్థము ఆ మూడు సర్గలను
ఒకేసర్గగా ఇస్తున్నాను. చదవండి.)

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము ప్రక్షిప్త సర్గలు.

మరునాడు ఉదయం తెల్లవారింది. రాముడు ఉదయం పూట చేయవలసిన పూజాకార్యక్రమములు నిర్వర్తించుకొని మంత్రి పురోహితులతో రాజ సభకు వెళ్లాడు. ధర్మాసనము మీద కూర్చుని పౌరుల మధ్య జరిగిన తగాదాలను విచారించడానికి సిద్ధంగా ఉన్నాడు. లక్ష్మణుడు రాజ సభ బయట ఉండి న్యాయం కోసం వచ్చిన వారి గురించి విచారిస్తున్నాడు. కాని అక్కడ ఎక్కువ మంది లేరు. రాముని రాజ్యంలో ఎవరికీ అన్యాయం జరగడం లేదు. అందరూ ధర్మంగా

నడుచుకుంటున్నారు. కాలం తీరకుండా ఎవరూ మరణించడం లేదు. అకాల మరణాలు లేవు. ఎవరూ తనకు అన్యాయం జరిగింది అని మరొకరి మీద ఆరోపణలు చెయ్యడం లేదు. లక్ష్మణుడు లోపలకు వచ్చి అదే విషయాన్ని రామునికి చెప్పాడు.

"లక్ష్మణా!న్యాయం కోసరం వచ్చే వాళ్లు నిర్ణీత సమయంలో రారు కదా. ఎప్పుడు అన్యాయం జరిగితే అప్పుడు వస్తారు. కాబట్టి, నీవు బయటనే ఉండి న్యాయార్ధులను, కార్యార్ధులను వెంటనే విచారించి లోపలకు పంపించు. నేను రాజసభలోనే ఉంటాను. లక్ష్మణా! మన రాజ్యంలో ప్రజలందరూ నీతిగా నిజాయితీగా తమకు విధించిన పనులను చేసుకుంటున్నారు. అందరూ సఖ్యంగా ఉంటున్నారు. ఇంక తగాదాలు ఎందుకు ఉంటాయి చెప్పు. పైగా తప్పుచేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని వాళ్లకు తెలుసు. అందుకని ఎవరూ తప్పు చేయడానికి సాహసించరు. నీవు కూడా నిరంతరమూ జాకరూకుడవై నగరాన్ని రక్షిస్తున్నావు. అయినా కూడా మన జాగ్రత్తలో మనం ఉండాలి. నీవు రాజ సభ బయటనే ఉండి న్యాయం కోసం వచ్చిన వాళ్లను విచారించి లోపలకు పంపు. నేను మంత్రులతో వేరే విషయాలను చర్చిస్తూ ఉంటాను." అని అన్నాడు రాముడు.

రాముని ఆదేశము మేరకు లక్ష్మణుడు రాజ సభ బయటకు వచ్చాడు. అక్కడ ఒక కుక్క నిలబడి ఉంది. లక్ష్మణుని చూచి గట్టిగా మొరిగింది. లక్ష్మణుడు ఆ కుక్కను చూచి "ఏమి పని మీద వచ్చావు. నీకు ఏం కావాలి." అని అడిగాడు. అప్పుడు ఆ కుక్క ఈవిధంగా

బదులుచెప్పింది. “నేను న్యాయం కోరి వచ్చాను. ఈ రాజ్యానికి రాజు రాముడు. నా అభియోగము రామునికే చెబుతాను.” అని చెప్పింది. రాముడు సభలోపలికి వెళ్లాడు. రామునికి కుక్క విషయం చెప్పి బయటకు వచ్చి కుక్కను రాజసభలోకి వెళ్లమన్నాడు. అప్పుడు ఆ కుక్క ఇలా అంది. “లక్ష్మణా! నేను నీచయోనిలో పుట్టాను. మాకు రాజసభలలోకి, దేవతా గృహములలోకి, బ్రాహ్మణుల ఇళ్లలోకీ వెళ్లే అర్హత లేదు. కాబట్టి నేను రాజసభలోకి రాలేను. రాముడు సకల ప్రాణులను సమంగా చూడగలిగినవాడు. రాముడు స్వయంగా ఆజ్ఞాపిస్తే గానీ నేను లోపలకు రాను. నీవు పోయి రాముని అనుజ్ఞ తీసుకొని రా” అని చెప్పింది.

లక్ష్మణునికి విసుగు పుట్టింది. కానీ ఓపికగా ఉన్నాడు. రాముని వద్దకు వెళ్లాడు. “రామా! ఒక కుక్క వచ్చి రాజ సభ బయట నిలబడి ఉంది. నీ అనుమతి లేనిది లోపలకు రాదట” అని అన్నాడు. “నేను అనుమతి ఇచ్చాను అని చెప్పి ఆ కుక్కను లోపలకు తీసుకొని రా” అని అన్నాడు. లక్ష్మణుడు బయటకు వెళ్లి ఆ కుక్కను రాజసభలోకి తీసుకొని వచ్చాడు. రాముడు ఆ కుక్కను చూచి “నీవు చెప్పదలచుకున్న విషయము ఏమీ భయము లేకుండా నిర్భయంగా చెప్పు.” అని అన్నాడు. రాముడు ఆ కుక్క తలమీద రక్తం కారుతున్న గాయం చూచాడు.

ఆ శునకము రామునితో ఇలా అంది. “ఓ రాజా! నీవు ప్రజారక్షకుడివి. నిరంతరమూ రాత్రింబగళ్లు ప్రజలను రక్షిస్తూ ఉంటావు. రాజు ప్రజలకందరికీ తండ్రి వంటి వాడు. ధారణాత్ ధర్మమ్ ఇతి అని అంటారు కదా! అంటే ధరించునది కావున ధర్మము అని అంటారు. ఆ

ధర్మమే మూడు లోకములలో నిలిచి ఉంది. జీవుడు మరణించిన తరువాత కూడా అతని ధర్మమే అతనిని కాపాడుతుంది. పుణ్యలోకాలకు చేరుస్తుంది. అటువంటి ధర్మమును నీవు చక్కగా పాటిస్తున్నావు. ధర్మం నీకు బాగా తెలుసు. నీ వంటి వాడి ముందు నేను ధర్మం గురించి మాట్లాడటం నా అజ్ఞానమే అవుతుంది. అందుకే నీకు నేను భక్తితో నమస్కరిస్తున్నాను." అని పలికింది ఆ శునకము.

"నీకు ఏమి అన్యాయం జరిగిందో ధైర్యంగా నిర్భయంగా చెప్పు" అని అన్నాడు రాముడు. "ఓ రాజా! బ్రాహ్మణులు నివసించే ప్రదేశములో ఉన్న సర్వార్ధసిద్ధుడు అనే సన్యాసి నన్ను అకారణంగా కొట్టాడు. నేను అతని పట్ల ఏమీ అపరాధము చేయలేదు." అని పలికింది. వెంటనే రాముడు భటులను పంపించి ఆ సర్వార్ధసిద్ధుడు అనే బ్రాహ్మణుని సభకు పిలిపించాడు. "రాజా! నన్ను ఎందుకు పిలిపించారు. నేను ఏమి చెయ్యాలి." అని అడిగాడు. "ఓ బ్రాహ్మణోత్తమా! నీవు ఈ శునకమును కొట్టినావని నీ మీద అభియోగము. ఈ శునకము ఏమి తప్పు చేసిందని కొట్టావు." అని అడిగాడు రాముడు. "రాజా! నేను కోపం పట్టలేకకొట్టాను." అని అన్నాడు.

అప్పుడు రాముడు ఇలా అన్నాడు. "ఓ బ్రాహ్మణోత్తమా! కోపము అనర్ధదాయకము అని తెలియదా! కోపము ప్రాణములను సైతం తీసే శత్రువు లాంటిది. కోపము మిత్రుడు వలె ఎప్పుడూ వెంట ఉన్నా అది మానవునికి ప్రబల శత్రువు. కోపము కత్తిలాంటిది. కోపము అనర్ధదాయకము. ఎన్ని యజ్ఞములు, యాగములు చేసినా, ఎంత తపస్సు

చేసినా, కోపాన్ని వదిలిపెట్టకపోతే అవన్నీ ఎందుకూ పనికిరావు. అందుకే ముందు కోపాన్ని విడిచిపెట్టాలి. తాను కోరుకున్నది దక్కకపోతే కోపం వస్తుంది. అందుకనే కోరికలను విడిచిపెట్టాలి. ఇంద్రియములను మనసును అదుపులో ఉంచుకోవాలి. మానవుడు తన మనోవాక్కాయ కర్మలతో ఎదుటి వారికి మేలు చేయాలి కానీ కీడు చేయకూడదు. అటువంటి వాడు ఎవరినీ ద్వేషించడు అందుకే వాడికి ఎవరి మీదా కోపం రాదు. మనసును అదుపులో పెట్టుకోకపోతే మనిషిలో కోపం దావానలంలా ప్రజ్వరిల్లుతుంది. ఆ కోపము వాడి అయిన కత్తితో, తోకతొక్కిన పాముతో, పక్కలో ఉన్న శత్రువుతో సమానము. కోపం అటువంటిది అని తెలిసికూడా ఎందుకుకోపం తెచ్చుకున్నావు." అని అడిగాడు రాముడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు ఇలా బదులు చెప్పాడు. "రాజా! నేను భిక్ష కొరకు అన్ని ఇళ్లకు వెళ్లాను. కానీ ఎక్కడా బిక్ష దొరకలేదు. కడుపులో ఆకలిగా ఉంది. అప్పుడు నాకు ఈ కుక్క అడ్డం వచ్చింది. నేను ఈ కుక్కను అవతలకు వెళ్లమని తోలాను. కాని ఈ కుక్క తన ఇష్టం వచ్చినట్టు అటు ఇటు తిరుగుతూ దారికి అడ్డంగా నిలబడింది. ఆ కోపంలో నేను ఈ కుక్కను కొట్టాను. నేను చేసిన అపరాధమును క్షమించండి." అని అన్నాడు. అప్పుడు రాముడు రాజ పురోహితుని, మంత్రులను చూచి ఇతనికి ఏమి శిక్ష వెయ్యాలి అనిఅడిగాడు. "రాజా! బ్రాహ్మణులు దండనకు తగిన వారు కాదు. బ్రాహ్మణులను శిక్షించ కూడదు. " అని అన్నారు.

అప్పుడు ఆ శునకము ఇలా అంది. "ఓ రాజా! మీరు అనుమతిస్తే ఇతనికి తగిన శిక్షను నేను చెబుతాను." అని అంది. "ఏమిటి?" అని అడిగాడు రాముడు. "ఇతనిని కులపతిగా నియమించండి. అదే ఇతనికి తగిన శిక్ష" అని పలికింది కుక్క. ఆ శునకము అంతరంగమును బాగుగా తెలిసిన రాముడు ఆ బ్రాహ్మణుని కులపతిగా నియమించాడు. ఆ బ్రాహ్మణుడు చాలా సంతోషించి కులపతిత్వమును స్వీకరించడానికి వెళ్లాడు.

రాముడి తీర్పు విని సభాసదులందరూ ఆశ్చర్యపోయారు. ఒక మంత్రి లేచి ఇలా అడిగాడు. "మహారాజా! మేమంతా అతడు బ్రాహ్మణుడు కాబట్టి శిక్షించకుండా వదిలిపెడతారు అనుకుంటే అతనిని కులపతిగా నియమించారు. ఇది అతనికి వరం ఇచ్చినట్లు కదా!" అని అడిగారు. ఆ మాటలకు రాముడు నవ్వి మీ ప్రశ్నకు ఈ శునకమే సమాధానము ఇవ్వగలదు" అని అన్నాడు. అప్పుడు ఆ శునకము ఇలా పలికింది. "సభాసదులారా! నేను పోయిన జన్మలో కులపతిని. దేవతలకు, బ్రాహ్మణులకు తృప్తిగా భోజనముపెట్టిన తరువాత మిగిలిన ఆహారమును నేను తినేవాడిని. ఇంకా మిగిలితే ఇతరులకు ఇచ్చేవాడిని. దేవతలకు చెందిన సొమ్మును దుర్వినియోగం కాకుండా రక్షించేవాడిని. నా స్వప్రయోజనమునకు కించిత్ కూడా వాడుకొనే వాడిని కాదు. అటువంటి నాకే కేవలం కులపతిగా ఉండినందుకు ఈ శునక జన్మ వచ్చింది. ఇంక ఈ కోపిష్టి అయిన బ్రాహ్మణుడు కులపతి అయితే ఇతని అవినీతికి అంతు ఉండదు. ఇతడు చనిపోయిన తరువాత నరకం ప్రాప్తిస్తుంది. ఇదే అతనికి సరిఅయిన శిక్ష. కాబట్టి మహారాజా! మీకు ఎవరినన్నా శిక్షించాలి అని

అనుకుంటే వానిని దేవాలయ ధర్మకర్త గానో, కులపతిగానో, బ్రాహ్మణుల ఆస్తులను రక్షించే ఉద్యోగిగానో నియమించండి. వాడి పతనానికి అదే దగ్గరి దారి. వాడికి చావు తరువాత నరకం తథ్యం." అని పలికింది ఆ శునకము. తరువాత ఆ శునకము తన దారిన తాను వెళ్లిపోయింది. తరువాత ఆ శునకము వారణాసి నగరంలో ప్రాయోపవేశం చేసి ప్రాణాలు వదిలింది.

ఒక అరణ్యములో ఒక గ్రద్ద ఒక గుడ్లగూబ నివసిస్తున్నాయి. ఒక సారి ఆ గ్రద్దకు గుడ్లగూబకు ఒక ఇంటిని గురించి తగువు వచ్చింది. ఆ ఇల్లు ఎవరిదో తేల్చుకోడానికి ఆ గ్రద్ద గుడ్లగూబ రాముని దగ్గరకు వెళ్లాయి. ముందు గ్రద్ద రాముని చూచి ఇలా అంది. "రాజా! నీవు బుద్ధిలో బృహస్పతి కంటే, గొప్పవాడివి. కాబట్టి మా తగవును మీరే తీర్చాలి. ఆ అరణ్యములో నేను ఒక ఇల్లు కట్టుకున్నాను. కాని ఈ గుడ్లగూబ తన బలంతో నా ఇంటిని ఆక్రమించుకుంది. ఈ గుడ్లగూబను శిక్షించి నా ఇల్లు నాకు ఇప్పించండి." అని అడిగింది.

తరువాత గుడ్లగూబ ఇలా చెప్పింది. "మహారాజా! నీవు సాక్షాత్తు నారాయణ స్వరూపుడవు. అందుకని నీవే మా తగవు తీర్చాలి. ఈ గ్రద్ద నా ఇంటి లో ప్రవేశించి నన్ను ఇబ్బంది పెడుతూ ఉంది. కాబట్టి ఈ గ్రద్ద బారి నుండి నన్ను రక్షించండి." అని మొరపెట్టుకుంది.

రాముడు మంత్రులతో ఆలోచించాడు. తరువాత రాముడు గ్రద్దను ఇలా అడిగాడు. "నీవు నీ ఇంటిని నిర్మించి ఎన్నాళ్లు అయింది" అని

అడిగాడు. “రామా! ఈ భూమి అంతా మానవులతో ఎప్పుడు నిండిపోయిందో అప్పటి నుండి నేను ఆ ఇంటిలో ఉంటున్నాను.” అని చెప్పింది. వెంటనే గుడ్లగూబ “రాజా! ఈ భూమి మీద ఎప్పటి నుండి వృక్షజాతులు పుట్టాయో అప్పటి నుండి నేను ఆ ఇంట్లో ఉంటున్నాను.” అని పలికింది. ఆ మాటలు విన్న రాముడు సభాసదులతో ఇలా అన్నాడు.

“సభాసదులారా! సభలో వృద్ధులు లేకపోతే అది సభకాదు. ఆ వృద్ధులు ధర్మం చెప్పకపోతే వారు వృద్ధులు కాదు. సత్యము లేకపోతే ధర్మము నిలువదు. కపటపు మాటలతో సత్యము చెప్పలేరు. ఈ సభలో ఉన్న వారు ఇది అధర్మము అని తెలిసి కూడా దానిని బహిరంగంగా చెప్పరో, వారు అబద్ధాలు చెప్పినట్టే. అంతేకాదు. కోపం వలన గానీ, కామప్రకోపము వలన గానీ, తెలిసి కూడా తెలియనట్టు ఉంటారో వారికి వరుణపాశములు చుట్టుకుంటాయి. కాబట్టి మీరు ఇరువురి వాదనలు విన్నారు కదా. ఏది సత్యమో, ఏది ధర్మమో వివరంగా చెప్పండి.” అని అడిగాడు రాముడు.

తరువాత సభాసదులు అందరూ ఆలోచించి “రాజా! గుడ్లగూబ చెప్పినది సత్యము, గ్రద్ద చెప్పినది అసత్యము. తరువాత మీకు తోచిన నిర్ణయం చెయ్యండి.” అని ముక్తకంఠంతో చెప్పారు. తరువాత రాముడు ఇలా అన్నాడు. “ఈ సందర్భంలో పురాణాలలో చెప్పబడిన విషయములను మీకు చెబుతాను. సావధానంగా వినండి. ఒకప్పుడు ఈ మూడు లోకములు నీటిలో మునిగిపోయాయి. ప్రపంచం అంతా జలమయం అయింది. భూదేవి విష్ణుమూర్తి ఉదరంలోకి ప్రవేశించింది. భూమిని తన

ఉదరములో ఉంచుకొన్న విష్ణువు యోగనిద్రలో ఉన్నాడు. అనేక సంవత్సరములు గడిచిపోయాయి. అప్పుడు బ్రహ్మదేవుడు విష్ణువు ఉదరములోకి ప్రవేశించాడు. విష్ణువు గర్భంలో ఉన్న జలములో నుండి ఒక పద్మము పుట్టింది. అది విష్ణువు నాభి ద్వారా బయటకు వచ్చింది. ఆ పద్మము యొక్క నాళము (తామర తూడు) లో నుండి బ్రహ్మ బయటకు వచ్చాడు. ఆ పద్మములో కూర్చున్నాడు. తరువాత బ్రహ్మ తపస్సు చేసాడు. భూమిని, వాయువును, పర్వతములను, వృక్షములను, సృష్టించాడు. తరువాత మనుష్యులను, జంతువులను పాకే జంతువులను, ఎగిరే పక్షులను సృష్టించాడు. అండములనుండి పుట్టే వాటిని, గర్భములో నుండి బయటకు వచ్చేవాటిని, చెమట నుండి పుట్టే వాటిని, భూమి నుండి పుట్టే వాటిని సృష్టించాడు.

బ్రహ్మ యొక్క చెవిలో నుండి మధు, కైటభులు అనే రాక్షసులు పుట్టారు. వారు బ్రహ్మదేవుని చూచి కోపంతో ఊగిపోయారు. ఆ మధుకైటభులు బ్రహ్మ మీదికి వచ్చారు. అప్పుడు బ్రహ్మ పెద్దగా అరిచాడు. ఆ శబ్దము విని శివుడు, విష్ణువు అక్కడకు వచ్చారు. విష్ణువు తన చక్రాయుధముతో ఆ మధు కైటభులు అనే రాక్షసులను సంహరించాడు. ఆ రాక్షసుల శరీరంలో నుండి బయటకు వచ్చిన కొవ్వుతో ఈ భూమి అంతా నిండి పోయింది. అందులో నుండి వృక్షములు, ఓషధులు, సస్యములలో భూమి నిండి పోయింది. ఆ రాక్షసుల కొవ్వు (మేధ) తో నిండి పోయింది కాబట్టి భూమికి మేధ అనే పేరు వచ్చింది. పై కారణాల వలన గుడ్లగూబ వృక్షములు పుట్టిన తరువాత ఇల్లు కట్టుకొంది. అంతకు ముందు వృక్షములు లేవు కాబట్టి గ్రద్ద ఇల్లు కట్టుకొనే అవకాశము లేదు.

కాబట్టి ఈ ఇల్లు గుడ్లగూబది కానీ గ్రద్దది కాదు. అబద్ధము చెప్పిన ఈ గ్రద్దను దండించాలి." అని అన్నాడు రాముడు.

ఆ సమయంలో ఆకాశం నుండి ఇలా వినపడింది. "రామా! ఈ గ్రద్ద ను చంపకుము. ఈ గ్రద్ద పేరు బ్రహ్మదత్తుడు. ఎల్లప్పుడూ సత్యమునే పలికెడి వాడు. ధర్మాత్ముడు.

ఒక సారి ఒక బ్రాహ్మణుడు బ్రహ్మదత్తుని ఇంటికి వచ్చాడు. తనకు నూరు సంవత్సరముల పాటు భోజనము పెట్టమని అడిగాడు. బ్రహ్మదత్తుడు ఆ బ్రాహ్మణునికి అర్ఘ్యము పాద్యము ఆసనము సమర్పించాడు. అతని భోజనానికి తగిన ఏర్పాట్లు చేసాడు. కాని అతనికి పెట్టిన ఆహారములో మాంసాహారము కూడా కలిసింది. దానికి ఆ బ్రాహ్మణుడు కోపించాడు. నీవు గ్రద్దలు తినే మాంసాహారము పెట్టావు కాబట్టి నీవు గ్రద్దగా జీవించు." అని శపించాడు. అప్పుడు బ్రహ్మదత్తుడు ఆ బ్రాహ్మణుని కాళ్ల మీద పడి తన అపరాధమును మన్నించి తనకు శాపవిమోచనము కలుగచేయమని వేడుకున్నాడు. "రాబోవు త్రేతాయుగములో ఇక్ష్వాకు వంశములో రాముడు అనే రాజు జన్మిస్తాడు. అతని స్పర్శతో నీకుశాపవిమోచన అవుతుంది." అని ఆ బ్రాహ్మణుడు బ్రహ్మదత్తునికి శాపవిమోచన అనుగ్రహించాడు. కాబట్టి రామా! ఇతనికి శాపవిమోచన కలిగించు" అని ఆకాశవాణి పలికింది.

అప్పుడు రాముడు సంతోషంగా ఆ గ్రద్దకు శాపవిమోచన కలిగించాడు. అప్పుడు ఆ గ్రద్ద బ్రహ్మదత్తుడిగా మారి పోయాడు.

"రామా! నీ అనుగ్రహము వలన నాకు శాపవిమోచన కలిగింది." అని రాముడికి నమస్కరించి వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము ప్రక్షిప్త సర్గలు సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
అరవయ్యవ సర్గ.

రాముడు జనరంజకంగా రాజ్యపాలన సాగిస్తుంటే వసంత ఋతువు వచ్చింది. ఒకరోజు భార్గవుడు, చ్యవనుడు తదితర మహా మునులు అందరూ రాముని చూడటానికి వచ్చారు. రాముడు వారిని సాదరంగా ఆహ్వానించాడు. అర్ఘ్యము పాద్యము ఇచ్చి సత్కరించాడు. అందరికీ ఉచితాసనములు మీద ఆసీనులను చేసాడు. ఆ మహా మునులు తాము సేవించిన పుణ్యతీర్థములలో జలములను రామునికి సమర్పించారు.

రాముడు ఆ మునులను చూచి ఇలా అన్నాడు. "మహామునులారా! తమరు వచ్చిన పని ఏమి? మీరు ఏమి కోరినా చెయ్యడానికి నేను సిద్ధంగా ఉన్నాను. నా సమస్తరాజ్యము, నేను బ్రాహ్మణుల అధీనము. ఆజ్ఞాపించండి" అని అన్నాడు రాముడు. రాముని మాటలు విన్న ఆ మహామునులు ఎంతో సంతోషించారు.

"రామా! ఇలామాట్లాడటం నీ వంటి వారికే తగి ఉన్నది. నీ కన్నా ముందు ఈ భూమిని ఎందరో రాజులు పరిపాలించారు. వారందరూ మేము అడగబోయే కార్యము ఏమిటో ఆలోచించి గానీ ఆ కార్యము చేస్తానని మాట ఇచ్చేవారు కాదు. నీవు మాత్రము మేము ఏమి అడుగుతామో తెలుసుకోకుండానే మాట ఇచ్చావు. నీకు బ్రాహ్మణుల మీద ఉన్న భక్తి అనంతమైనది. ప్రస్తుతము మేము భయాందోళనలతో ఉన్నాము. మమ్ములను ఆ భయం నుండి దూరం చేసి మా అందరినీరక్షించు." అని అన్నారు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము అరవయ్యవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

అరవయ్యవ ఒకటవ సర్గ.

ఈ బ్రాహ్మణుల మాటలు వినిన రాముడు "మీరు ఏమీ దిగులుచెందనవసరం లేదు. ఈ క్షణం నుండి మీకు భయం నుండి విముక్తి కలిగిస్తాను. మీ భయకారణం చెప్పండి." అని అన్నాడు. అప్పుడు ఆ మునులు రామునితో ఇలా అన్నారు. "రామా! పూర్వము కృతయుగములో మధువు అనే దైత్యుడు ఉండేవాడు. ఆ మధువు బ్రాహ్మణులను పూజించేవాడు. ధర్మాత్ముడు. దేవతలకు ప్రీతి పాత్రుడు. మంచి పరాక్రమ వంతుడు. అతని గుణగణములకు మెచ్చి రుద్రుడు అతనికి ఒక వరం కూడా ఇచ్చాడు. రుద్రుడు అతనికి ఒక దివ్యమైన ప్రతిభావంతమైన

శూలమును ఇచ్చాడు. "నీ సత్యనిష్ఠను, ధర్మనిరతిని చూచి నీకు ఈ శూలమును బహూకరిస్తున్నాను. నీవు ఎప్పటిదాకా దేవతలను బ్రాహ్మణులను ద్వేషించవో అప్పటిదాకా ఈశూలము నీ దగ్గర ఉంటుంది. నీలో దేవ, బ్రాహ్మణ ద్వేషము మొదలైననాడు ఈ శూలము నీ దగ్గర నుండి మాయమై నా దగ్గరకు చేరుతుంది. నీవు ధర్మంగా న్యాయంగా ఉన్నంతకాలము నిన్ను ఎవరైనా అన్యాయంగా అక్రమంగా, దుర్మార్గంగా ఎదిరిస్తే ఈ శూలం వాడిని భస్మం చేస్తుంది." అని శూలాన్ని రుద్రుడు మధువుకు ఇచ్చాడు. అప్పుడు మధువు రుద్రునికి నమస్కరించి ఇలా అన్నాడు. "ఓ దేవదేవా! ఈ శూలము నాకే కాదు మా తరతరాలకు మా వంశములోనే ఉండేటట్టు వరం ప్రసాదించు." అని అడిగాడు. "అది సంభవం కాదు. కాని నీవు అడిగావు కాబట్టి నీ తరువాత నీ కుమారునికి మాత్రమే చెందుతుంది. ఈ శూలము నీ కుమారుని చేతిలో ఉన్నంతకాలము అతనిని కూడా ఎవరూ ఎదిరించలేరు, చంపలేరు." అని వరం ఇచ్చాడు రుద్రుడు.

ఈ ప్రకారంగా రుద్రునివలన అత్యంత మహిమగల శూలమును పొందిన మధువు, ఒక దివ్యమైన భవనమును నిర్మించుకున్నాడు. ఆ మధువు భార్యపేరు కుంభీనసి. మధువుకు, కుంభీనసికి లవణుడు అనే కుమారుడు జన్మించాడు. వాడు మధువు మాదిరి ధర్మాత్ముడు కాడు. పరమ దుర్మార్గుడు. బాల్యము నుండి అతడు బ్రాహ్మణులను బాధించేవాడు. అందరినీ హింసించేవాడు. కుమారుని దుర్మార్గాలకు మధువుకు కోపం వచ్చేది. కాని పుత్రవ్యామోహంతో ఏమీ అనేవాడు కాదు. రుద్రుడు తనకు ఇచ్చిన శూలమును తన కుమారుడు లవణుడికి ఇచ్చి,

దాని మహిమలను కుమారుడికి చెప్పి, మధువు వరుణలోకమునకు వెళ్లిపోయాడు. లవణుడు అసలే దుర్మార్గుడు దానికి తోడు అజేయమైన శూలము అతని చేతిలో ఉంది. అతని దుర్మార్గాలకు పట్టపగ్గాలు లేకుండాపోయాయి. అతడు ఋషులను, మునులను, బ్రాహ్మణులను బాధించసాగాడు. ఓ రామా! మీరు మమ్ములను ఆ లవణుడి నుండి రక్షించాలి. నీ దగ్గరకు రాక ముందు మేము చాలా మంది రాజుల దగ్గరకుపోయి రక్షణ కల్పించమని అడిగాము. కానీ ఏ రాజూ లవణుడికి భయపడి మమ్మల్ని రక్షించడానికి ముందుకు రాలేదు. నీవు రావణుడు అనే రాక్షసుని సంహరించి నట్టు విని మీ దగ్గరకు వచ్చాము. నీవే ఈ కార్యమును నెరవేర్చుటకు సమర్థుడవు అన్న నమ్మకంతో వచ్చాము. ఈ భూలోకములో మమ్ములను రక్షించేవాడు నీవు తప్ప మరొకడు లేడు. తరువాత నీ ఇష్టం." అని చెప్పి మౌనం వహించారు ఆ మునులు.

"ఓ మహా ఋషులారా! ఆ లవణుడు ఎక్కడ ఉంటాడు. వాడి ఆహార అలవాట్లు ఏమిటి? వాడు ఎక్కడెక్క తిరుగుతుంటాడు. ఏం పనులుచేస్తుంటాడు. వివరంగా చెప్పండి." అని అడిగాడు. ఆ ఋషులు లవణుడి గురించి ఇలా చెప్పారు. "వాడు మాంసాహారి. అన్ని రకములైన ప్రాణులను చంపి తింటాడు. ఎక్కువగా మునులను బాధిస్తుంటాడు. వాడు అతి క్రూరుడు. వాడు ఉండేది మధువనంలో. వాడికి అది ఇదీ అని లేదు. జంతువులను, మనుషులను చంపి తింటాడు." అని అన్నారు ఆ ఋషులు. రాముడు వారికి అభయం ఇచ్చాడు.

తరువాత రాముడు తన సోదరులను చూచి ఇలా అన్నాడు. "మీలో ఎవరు లవణుని చంపగలరు. భరతుడా లేక శత్రుఘ్నుడా!" అని అన్నాడు. వెంటనే భరతుడు "అన్నయ్యా! వాడిని నా పాల బడనివ్వండి. వాడిని నేను చంపుతాను." అని అన్నాడు భరతుడు. వెంటనే శత్రుఘ్నుడు లేచి "అన్నయ్యా! భరతుడు మీరు లేని రోజుల్లో ఈ రాజ్యభారము వహించి అలసి పోయాడు. ఇంకా ఆయనను ఈ యుద్ధాలతో కష్టపెట్టకండి. ఆయనకు విశ్రాంతినివ్వండి. ఆ లవణుని నేను చంపుతాను. ఆ అవకాశం నాకు ఇవ్వండి." అని అన్నాడు. ఆ మాటలకు రాముడు ఎంతో సంతోషించాడు. "శత్రుఘ్నా! ఆ ప్రకారమే కానిమ్ము. నీవు ఆ లవణుని చంపు. నిన్ను ఆ మధునగరమునకు రాజుగా చేస్తాను. ఒక రాజ్యమును జయించిన తరువాత ఆ రాజ్యమునకు పాలకుడిని నియమించకపోతే, జయించిన వాడికి నరకం తప్పదు. అదీ కాకుండా నీవు కూడా నీ పరాక్రమముతో, సామర్థ్యముతో ఒక రాజ్యము ఏర్పరుచుకున్నట్టు అవుతుంది. అదే వీరుడి లక్షణము. అన్న కష్టపడకూడదు అన్న నీ భావన ఎంతో శ్లాఘనీయము. నీవు లవణుని జయించి, వాడిని సంహరించి, ఆ రాజ్యమును స్వాధీనం చేసుకో. యమునా నదీ తీరంలో ఉద్యాన వనములను, సుందరమైన నగరములను నిర్మించు. ఇక్ష్వాకుల రాజ్యమును విస్తరించు. మధునగరాన్ని పాలించు. నీ విజయ వార్త విని నేను తమ్ములు, వసిష్టుడు మొదలగు వారు వచ్చి నీకు పట్టాభిషేకమును జరిపిస్తాము." అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము అరవైరెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

అరవై మూడవ సర్గ.

రాముడు తనను పొడుగుతూ ఒక రాజ్యానికి రాజును చేస్తానంటే శత్రుఘ్నుడు కొంచెం సిగ్గు పడ్డాడు. "అన్నయ్యా! నేను అందరిలోకీ చిన్న వాడిని కేవలం లవణుడిని సంహరిస్తాను అన్నాను. కానీ నన్ను రాజును చెయ్యడం ఏమిటి. నా కన్నా పెద్దవాళ్లు ఉన్నారు కదా! పెద్దవాళ్లు ఉండగా చిన్న వాళ్లు పట్టాభిషిక్తులుకావడం ధర్మమా! కానీ నీ ఆజ్ఞ తప్పక పాటిస్తాను. లవణునితో యుద్ధం చేస్తాను. కానీ నాకన్నా ముందు భరతుడు లవణుని చంపుతాను అన్నప్పుడు నేను మధ్యలో అడ్డుకోవడం పొరపాటు. ఈ అవకాశము భరతుడికి ఇవ్వకుండా నేను లవణుడిని చంపుతాను అనడం నేను చేసిన తప్పు. అన్న మాటలకు ఎదురు చెప్పకూడదు అని తెలిసి కూడా నేను భరతుని మాటలకు విరుద్ధంగా మాట్లాడాను. ఒక సారి భరతుని మాటలను కాదని నేను లవణున్ని చంపుతాను అని తప్పుచేసాను. ఇప్పుడు నీ మాటను కూడా కాదని మరొక తప్పు చేయను. నీ ఆజ్ఞప్రకారమే నడుచుకుంటాను." అని అన్నాడు శత్రుఘ్నుడు.

అతనిమాటలు విన్న రాముడు లక్ష్మణునితో, భరతునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! భరతా! శత్రుఘ్నుని పరాక్రమము నాకు తెలియును. అతడు లవణుని చంపగలడు. కాబట్టి ఇప్పుడే ఇక్కడే శత్రుఘ్నునికి పట్టాభిషేకం జరిపిస్తాను. తగిన సంభారములను తీసుకొని రండి. వసిష్టుని ఋత్విక్కులను పిలిపించండి. " అని ఆదేశించాడు.

(విభీషణుడికి కూడా రావణ సంహారం ముందే లంకకు పట్టాభిషిక్తుని చేసాడుకదా! రాముడు ఏదైనా సంకల్పిస్తే దానికి తిరుగు ఉండదు.) శత్రుఘ్నుని మధు నగరమునకు పట్టాభిషిక్తుని చేయడానికి ఏర్పాట్లు చకా చకా సాగిపోయాయి. రాముడు శత్రుఘ్నుని మధునగరమునకు రాజుగా పట్టాభిషిక్తుని చేసాడు. అయోధ్యానగర పౌరులు ఈ పట్టాభిషేక మహోత్సవమును చూచి మహదానందభరితులయ్యారు. కౌసల్య, సుమిత్ర, కైక ఇంకా ఇతర రాజమాతలు, అంతఃపుర కాంతలు శత్రుఘ్నునికి మంగళహారతులు ఇచ్చారు. శత్రుఘ్నుడు మధునగరానికి పట్టాభిషిక్తుడు అయ్యాడు అన్న వార్త తెలిసిన మహాఋషులు "ఇంక లవణుని చావు తథ్యం" అని అనుకున్నారు.

అప్పుడు రాముడు శత్రుఘ్నుడిని చూచి ఇలా అన్నాడు. "శత్రుఘ్నా! నీకు నా శుభాకాంక్షలు. నీవు లవణాసురుని మీదికి యుద్ధానికి వెళుతున్నావు. వాడి దగ్గర ఒక దివ్యమైన శూలం ఉంది. దానికి దీటుగా నేను నీకు ఒక దివ్యమైన అస్త్రమును ఇస్తున్నాను. ఇది శత్రువులను నాశనం చేస్తుంది. దీనితో లవణాసురుడిని సంహరించు. కల్పాంతమున శ్రీమహావిష్ణువు మహాసముద్రములో పడుకొని ఉన్నప్పుడు ఆయనకు రక్షణగా ఈ అస్త్రము సృష్టించబడింది. దీనిని దేవతలు కానీ, దానవులుకానీ చూడలేరు. ఎల్లప్పుడూ ఈ అస్త్రము అదృశ్యరూపంలో ఉంటుంది. శ్రీమహావిష్ణువు మధు కైటభులను చంపడానికి, రాక్షస సంహారానికి ఈ అస్త్రమును సృష్టించాడు. ఈ అస్త్రముతో మధు, కైటభులు అనే రాక్షసులను చంపి ఈ లోకాలను సృష్టించాడు విష్ణువు. నేను రావణునితో యుద్ధం చేసే సమయంలో ఈ అస్త్రమును

ప్రయోగిద్దామని అనుకున్నాను. కాని ఈ అస్త్రమును ప్రయోగిస్తే విపరీతంగా ప్రాణనష్టము సంభవిస్తుంది. కేవలం రావణుని గురించి అమాయకులైన రాక్షసులను చంపడం ఇష్టంలేక ఈ అస్త్రమును రావణుని మీద ప్రయోగించలేదు. నేను సేకరించిన సమాచారము ప్రకారము లవణుడు తనకు తండ్రివలన లభించిన పరమేశ్వరదత్త శూలమును పూజా గృహములో భద్రపరిచి నిత్యము పూజలు చేస్తూ ఉంటాడు. దానిని బయటకు తీయడు. ఎవడైనా తనను ఎదిరించి నపుడు, తనతో యుద్ధానికి వచ్చినపుడు మాత్రమే ఆ శూలమును ధరించి శత్రువులను చంపుతాడు. తాను ఆహారము కొరకు బయటకు వెళ్లేటప్పుడు కూడా దానిని పూజా మందిరములో భద్రపరిచి బయటకు వెళుతాడు. ఆ దివ్యమైన శూలము అతని చేతిలో లేకపోతే అతనిని సులభంగా చంప వచ్చును. కాబట్టి నీవు ఆయుధములను ధరించి, లవణుడు ఆహారము కోసరము బయటకు వెళ్లగానే అతని నగర ద్వారము దగ్గర పొంచి ఉండు. అతడు ఆహారమును సేకరించుకొని తిరిగి వచ్చునపుడు అతనితోయుద్ధానికి తలపడు. లవణుడికి లోపలికి వెళ్లి శూలమును తెచ్చుకొనే వ్యవధి ఇవ్వకు. అతడు తన మందిరములోనికి ప్రవేశించక ముందే అతనితో యుద్ధము చేసి సంహరించు. మరొక విధంగా అతనిని చంపడం అసాధ్యము. పరమేశ్వరుని శూలమును జయించడం ఎవరి తరమూ కాదు." అని చెప్పాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము అరువది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
అరువది నాలుగవ సర్గ.

ఆ ప్రకారంగా రాముడు శత్రుఘ్నునికి లవణాసురుని ఎలా చంపాలో వివరంగా చెప్పాడు. శత్రుఘ్నునికి సాయంగా 4000 గుర్రాలు, రెండు వేల రథాలు, నూరు ఏనుగులు, ఇంకా కాల్బలము పంపాడు రాముడు. సైన్యమును పోషించడానికి అతని వెంట లక్ష బంగారు నాణెములు కల బండ్లను పంపాడు. వినోదము కొరకు అనేక మంది నర్తకీమణులను పంపాడు. రాముడు శత్రుఘ్ననకు మరొక విషయం కూడా చెప్పాడు. "శత్రుఘ్నా! ముందు సైన్యాన్ని పంపు. ఆ సైన్యము ఎవరిదో తెలియనియ్యకు. తరువాత నీవు వెళ్లు. నీవు లవణుని మీదికి దండయాత్రకు వస్తున్నట్టు లవణునికి తెలియనివ్వకు. వాడికి నీ మీద ఎటువంటి అనుమానము రానీయకు. అప్పుడే వాడిని నీవు చంపగలవు. ఒకసారి వాడికి నీవు ఎవరో తెలిస్తే నిన్ను బతుకనివ్వడు. ఇప్పుడు గ్రీష్మఋతువు. వర్షఋతువు ప్రారంభం కాగానే అతనిని చంపడానికి బయలుదేరు. నీ సైన్యములను గ్రీష్మఋతువులోనే గంగానదిని దాటించు. వర్షములు మొదలయితే గంగానదిని దాటడం కష్టం. నీ సైన్యమును గంగానదీ తీరంలో విడిది చేయించు నువ్వు ఒంటరిగా వాడి దగ్గరకు వెళ్లు. అవసరం అయితే నీకు సాయంగా నీ సైన్యం వస్తారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటేనే గానీ నీవు వాడిని చంపలేవు." అని పలికాడు రాముడు.

రాముని మాటలను శ్రద్ధగా విన్నాడు రాముడు. వెంటనే తన సేనాధి పతులను పిలిచాడు. వారికి రాముడు చెప్పిన సూచనలు అన్నీ ఇచ్చాడు. ముందు సైన్యమును పంపాడు. శత్రుఘ్నుడు తన తల్లులు అయిన కౌసల్య, కైకేయి, సుమిత్రల ఆశీర్వాదము తీసుకున్నాడు. కులగురువు వసిష్టుల వారికి నమస్కరించి ఆయన ఆశీర్వాదము తీసుకున్నాడు. రాముడికి నమస్కరించాడు. ముందు తన సేనలను పంపి వారి వెంట తనుకూడా బయలుదేరాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము అరవైనాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

అరవై ఐదవ సర్గ.

శత్రుఘ్నుడు మధు పురానికి వెళుతూ, రెండు రోజుల ప్రయాణం తరువాత, మార్గ మధ్యలో గంగానదీ తీరంలో ఉన్న వాల్మీకి ఆశ్రమానికి వెళ్లాడు. శత్రుఘ్నుడు వాల్మీకి మహర్షికి నమస్కరించి తాను ఆ రాత్రికి వాల్మీకి ఆశ్రమంలో విశ్రాంతి తీసుకోడానికి అనుమతి కోరాడు. వాల్మీకి మహర్షి శత్రుఘ్నుని సాదరంగా ఆహ్వానించి అర్ఘ్యము పాద్యము సమర్పించాడు. శత్రుఘ్నునితో ఇలా అన్నాడు. "శత్రుఘ్నా! ఈ ఆశ్రమము ఇక్ష్వాకుల పాలనలో ఉంది. కాబట్టి ఇది నీ ఆశ్రమమే అనుకో. ఇక్కడ నీవు యధేచ్ఛగా ఉండవచ్చును. ఈ ఫలములను తిని ఈ రాత్రికి ఇక్కడ

విశ్రాంతి తీసుకో." అని అన్నాడు వాల్మీకి. శత్రుఘ్నుడు చాలా సంతోషించాడు. వాల్మీకి ఆతిథ్యాన్ని స్వీకరించాడు. శత్రుఘ్నుడు పరిసరప్రాంతాల్లో తిరుగుతూ ఉంటే అక్కడ శత్రుఘ్నునికి ఒకయజ్ఞవాటిక కనపడింది. అది ఎవరిది అని వాల్మీకి మహర్షిని అడిగాడు శత్రుఘ్నుడు. అప్పుడు వాల్మీకి శత్రుఘ్నునికి ఇలా చెప్పాడు.

"శత్రుఘ్నా! మీ పూర్వీకులలో సుదాసు అనే రాజు ఉండేవాడు. అతడు పరమ ధార్మికుడు. అతని కుమారుడు మిత్రసహుడు. అతనినే సౌదాసుడు అని కూడా అంటారు. ఒకరోజు సౌదాసుడు వేటకై అడవికి వెళ్లాడు. అక్కడ ఇద్దరు రాక్షసులను చూచాడు. ఆ ఇద్దరు రాక్షసులు ఆ అరణ్యములో నివసిస్తున్నారు. వారు ఇద్దరూ పెద్దపులుల ఆకారములు ధరించి ఆ అరణ్యములో ఉన్న మృగములను విచక్షణారహితంగా చంపి తింటున్నారు. కొంత కాలానికి ఆ అడవిలో మృగజాతి అంతా అంతరించి పోతూ ఉంది. ఈ సంగతి తెలిసిన సౌదాసుడు ఆ ఇద్దరు రాక్షసులను తన బాణములతో కొట్టాడు. ఆ బాణముల దెబ్బకు ఒక రాక్షసుడు మరణించాడు. మరొకడు పారిపోయాడు. తన మిత్రుని చంపిన సౌదాసుకు ప్రతిక్రియ చేయాలని అనుకున్నాడు. సమయం కోసరం వేచి చూస్తున్నాడు.

సుదాసుని తరువాత సౌదాసుడు రాజయ్యాడు. సౌదాసుడు ఇక్కడే అశ్వమేధ యాగము చేసాడు. ఆ యజ్ఞమునకు వసిష్ఠుడు ఆధ్వర్యము వహించాడు. అవకాశము కోసరం ఎదురుచూస్తున్న ఆ రాక్షసుడు ఒక రోజు వసిష్ఠుని రూపంలో సౌదాసుని వద్దకు వచ్చాడు.

"రాజా! బాగా ఆకలిగా ఉంది. నాకు మాంసముతో భోజనము వడ్డించు." అని అన్నాడు. వసిష్ఠుడు బ్రాహ్మణుడు. శాఖాహారి. మాంసము ఎందుకు వడ్డించమన్నాడో అర్థం కాలేదు. అయినా ఆయనే కోరాడు కదా అని వంట వాళ్లను పిలిచి వషిష్ఠునికి మంచి రుచికరమైన మాంసాహారమును తయారు చేసి వడ్డించమన్నాడు. వంటవాడు సరే అని వంటింట్లోకి వెళ్లాడు. వసిష్ఠుని రూపంలో ఉన్న రాక్షసుడు మాయం అయ్యాడు. ఆ వంట వాడిలో ప్రవేశించాడు. మాంసాహారానికి బదులు మనుష్య మాంసముతో చేసిన వంటకములను తయారు చేసాడు. ఇంతలో అసలు వసిష్టుడు భోజనానికి వచ్చాడు. సౌదాసుడు ఆయన భార్య మదయంతి, వంటవాడి రూపంలో ఉన్న రాక్షసుడు వండిన మనుష్య మాంసాహార మును వసిష్ఠునికి వడ్డించారు. తనకు వడ్డించినది మనుష్య మాంసము అని వసిష్ఠుడు గ్రహించాడు. సౌదాసుడు చేసిన అకృత్యానికి కోపం వచ్చింది. వెంటనే సౌదాసునితో "రాజా! నేను బ్రాహ్మణుడిని శాకాహారిని అని కూడా చూడకుండా నాకు మనుష్య మాంసమును ఆహారంగా వడ్డిస్తావా. ఇంకనుండి నీవు మనుషులను చంపి తింటూ ఉండు ఇదే నీకు ఆహారము." అని శపించాడు.

తన తప్పు ఏమీ లేకపోయినా తనను వసిష్ఠుడు శపించడం చూచి సౌదాసుడు కోపంతో ఊగి పోయాడు. వసిష్ఠునికి ప్రతిశాపం ఇవ్వబోయాడు. అప్పుడు అతని భార్య మదయంతి ఆయనను వారించింది. "నాధా! వసిష్ఠుడు శాంతమూర్తి. మీకు గురువు. పురోహితుడు. మనక్షేమం కోరేవాడు. ఆయనకు శాపం ఇవ్వడం తగదు. ఇందులో ఏదో మోసం ఉంది. విచారించండి." అని పలికింది.

సౌదాసుడు తన చేతిలో ఉన్న శాపజలాన్ని తన కాళ్ల మీదకు విడిచిపెట్టాడు. ఆ శాపజలము ప్రభావానికి సౌదాసుని కాళ్లు నల్లగా కమిలిపోయాయి. అప్పటినుండి సౌదాసునికి కల్మాషపాదుడు అనే పేరు వచ్చింది. తరువాత సౌదాసుడు, ఆయన భార్య మదయంతి వసిష్ఠునికి నమస్కరించి జరిగిన విషయం చెప్పారు. తను మాంసభోజనం కోరడం ఏమిటా అని వసిష్ఠునికి సందేహం వచ్చింది. వెంటనే దివ్యదృష్టితో చూచి అసలు విషయం తెలుసుకున్నాడు. ఇదంతా ఆ రాక్షసుడు ఆడిన నాటకం అని గ్రహించాడు వసిష్ఠుడు. అనవసరంగా సౌదామునికి శాపం ఇచ్చానే అని బాధపడ్డాడు.

"రాజా! పొరపాటున నీకు ఇచ్చిన నా శాపాన్ని వెనక్కు తీసుకోలేను. కాని నీకు ఒక వరం ఇస్తాను. నేను నీకు ఇచ్చిన శాపము 12 సంవత్సరములుమాత్రమే ఉంటుంది. ఆ తరువాత నీవు నీ నిజస్వరూపమును పొందగలవు. నీవు రాక్షసుడిగా ఉన్నప్పుడు చేసిన పనులు గానీ, తిన్న ఆహారము గురించి గానీ నీకు ఏమీ గుర్తు ఉండదు. ఈ రోజు తరువాత ఆ రోజు వచ్చినట్టు ఉంటుంది." అని అన్నాడు వసిష్ఠుడు. ఆ తరువాత సౌదాసుడు వసిష్ఠుడు ఇచ్చిన శాపమును అనుభవించి తరువాత మరలా రాజై రాజ్యము చేసాడు. నీవు చూసిన యజ్ఞవాటిక ఆ నాడు సౌదాసుడు చేసిన అశ్వమేధయాగ యజ్ఞవాటిక."అని చెప్పాడు వాల్మీకి.

ఆ కథ విన్న శత్రుఘ్నుడు ఆశ్చర్యపోయాడు. కేవలం చిన్న అపోహతో నిరపరాధి అయిన సౌదాసుడు అంత పెద్ద శిక్ష

అనుభవించాడు అని అనుకున్నాడు. శత్రుఘ్నుడుఆ రాత్రికి వాల్మీకి ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము అరవై అయిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓంతత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
అరవై ఆరవ సర్గ.

శత్రుఘ్నుడు ఆ రాత్రి నిద్రించిన వాల్మీకి ఆశ్రమమునకు సమీపములోనే సీతాదేవి, ఇతర ముని కాంతలు నివసిస్తున్న ఆశ్రమములు ఉన్నాయి. శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమంలో నిద్రించిన రాత్రి అక్కడ సీతాదేవికి నెలలు నిండి, ఇద్దరు మగశిశువులను ప్రసవించింది. ముని కుమారుడు ఆ విషయమును వెంటనే ఆ అర్ధరాత్రి వాల్మీకికి తెలియజేసారు. వాల్మీకి చాలా సంతోషించాడు.

మరునాడు ఉదయమే వాల్మీకి సీతాదేవి ఉన్న ఆశ్రమానికి వెళ్లాడు. వాల్మీకి ఆ శిశువులకు భూతబాధను నివారించడానికి రక్షలు కట్టాడు. సీతాదేవికి పుట్టిన ఆ ఇరువురు పుత్రులు మహాతేజంతో ప్రకాశిస్తున్నారు. ముని కుమారులు దర్భలను వేళ్లతో సహా తీసుకొని వచ్చారు. దర్భల వేళ్ల భాగములను లవములు అంటారు. దర్భల కొస భాగములను కుశములు అంటారు. వాటితో వాల్మీకి ఆ బిడ్డలకు రక్ష

చేసాడు. అంటే ఆ దర్భలను వారి ఒంటి మీద మార్జనం చేసాడు అంటే తుడిచాడు. ముందు పుట్టిన వాడికి దర్భకుశలతో మార్జనం చేసాడు కాబట్టి అతనికి కుశుడు అనే నామకరణం చేసాడు. తరువాత పుట్టిన వాడికి దర్భ మొదళ్లతో అంటే లవములతో మార్జనం చేసాడు కాబట్టి లవుడు అనే నామకరణం చేసాడు. ఆ ప్రకారంగా వృద్ధస్త్రీలు ఆ శిశువులకు మార్జనం చేసారు. అప్పటి నుండి సీతాదేవి కుమారులు కుశలవులు అనే పేరుతో పిలువబడ్డారు.

(కొన్ని రామాయణాల్లో శత్రుఘ్నుడు సీతాదేవి ఆశ్రమానికి వచ్చి బిడ్డలను చూచినట్టు ఉంది. మరి కొన్నింటిలో తన పర్ణశాలలోనే ఉండి "తల్లీ నీవు బిడ్డలతో సుఖంగా ఉన్నావు" అని మనసులోనే అనుకున్నట్టు ఉంది. అంతదూరం వచ్చి, తన వదిన సీతకు ఇద్దరు శిశువులు కలిగారు అని తెలిసిన శత్రుఘ్నుడు అక్కడకు రాకుండా ఉంటాడా! దీనికి రాముడి అనుమతి అక్కరలేదు. కాబట్టి శత్రుఘ్నుడు వచ్చి సీతను చూచి బిడ్డలను ఆశీర్వదించాడు అని అనుకుందాము. తప్పేముంది. ఇందులో మరొక విశేషం కూడా ఉంది. ఆ శావణమాసరాత్రి తొందరగా గడిచిపోయింది అని రాయబడింది. అంటే కుశలవులు శ్రావణమాసంలో జన్మించారు అని అర్థం అవుతూ ఉంది. రాముడు చైత్రమాసంలో పుట్టాడు. సరిగ్గా నాలుగు మాసాల తరువాత శ్రావణబహుళ అష్టమి నాడు కృష్ణుడు పుట్టాడు. అదే శ్రావణమాసంలో కుశలవులుకూడా పుట్టారు. అందుకే చైత్రమాసము, శ్రావణ మాసము అంత పవిత్రం అయ్యాయి.)

మరునాడు శత్రుఘ్నుడు వాల్మీకి వద్ద సెలవు తీసుకొని పశ్చిమ దిశగా ప్రయాణం అయ్యాడు. ఏడు రోజులు ప్రయాణం చేసి యమునా తీరం చేరుకున్నాడు శత్రుఘ్నుడు. యమునా తీరంలో కల ఋషీశ్వరుల ఆశ్రమాలలో విశ్రాంతి తీసుకున్నాడు. చ్యవనుడు మొదలైన మహామునులను కలిసి వారితో అన్ని విషయాలు చర్చించాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము అరవైఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

అరవై ఏడవ సర్గ.

శత్రుఘ్నుడు చ్యవన మహర్షితో చర్చల సందర్భంగా లవణుని గురించి, అతని బలము గురించి, ఇంతకు పూర్వము లవణుడితో ఎవరెవరు యుద్ధం చేసారు, ఎంతమందిని లవణుడు ఈశ్వరదత్తమైన దివ్యశూలంతో చంపాడు, ఎలా చంపాడు, అన్న విషయాలు అడిగాడు. అప్పుడు చ్యవనుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"శత్రుఘ్నా! లవణుడితో యుద్ధం చేసి చచ్చిన వాళ్లు ఎంత మందో లెక్కతెలియదు. చాలామంది మరణించారు. అందులో మీ వంశమునకు చెందిన ఒక రాజును గురించి చెబుతాను. విను.

పూర్వము అయోధ్యను యవనాశ్వుని పుత్రుడైన మాంధాత పరిపాలిస్తూ ఉండేవాడు. మాంధాత గొప్ప చక్రవర్తి. భూలోకము నంతా జయించాడు. దేవలోకమును కూడా జయించవలెనని ప్రయత్నించాడు. ఇదివినిన ఇంద్రుడికి, దేవతలకు భయం పట్టుకుంది. తన సైన్యాలతో దేవలోకానికి వచ్చిన మాంధాతతో రాజీప్రయత్నాలు మొదలుపెట్టారు. స్వర్గంలో సగం, దేవేంద్రుని సింహాసనములో సగం ఇస్తాము అని అన్నారు. కాని మాంధాత ఒప్పుకోలేదు. తనకు స్వర్గలోకాధిపత్యము సంపూర్ణంగా కావాలని పట్టుబట్టాడు.

ఇంద్రుడు ఆయనను స్వస్థత పరుస్తూ ఇలా అన్నాడు. "ఓ రాజా! నీవు భూలోకములోనే రాజువు. నీవు భూలోకమును అంతా జయించాను అనుకుంటున్నావు. అది పొరపాటు. నీవు భూలోకమును పూర్తిగా జయించలేదు. భూలోకమును పూర్తిగా జయించి నీ పాలనలోకి తీసుకొచ్చిన తరువాత దేవ లోకాధిపత్యము కోరుకొనుము." అని అన్నాడు.

ఆ మాటలకు మాంధాతకు అనుమానం వచ్చింది. "ఇంద్రా! నేను భూమి నంతా జయించాను. భూలోకం అంతా నా స్వాధీనంలో ఉంది. భూలోకంలో ఎక్కడ ఏ ప్రాంతంలో నా ఆధిపత్యం అధికారము కొనసాగడం లేదు. చెప్పు" అని నిలదీసాడు. "ఓ రాజా! మధు వనములో నివసిస్తున్న మధువు అనే రాక్షసుని కుమారుడు లవణుడు నీ మాటను మన్నించడంలేదు. స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాడు. ముందు వాడిని జయించి తరువాత దేవలోకము వంక చూడు." అని అన్నాడు.

మాంధాత అవమానంతో తల వంచుకున్నాడు. మరలా భూలోకమునకు వచ్చాడు. సైన్యాలను సమీకరించాడు. వెంటనే లవణుని మీద యుద్ధం ప్రకటించాడు. లవణుని వద్దకు ఒక దూతను పంపాడు. తనకు లొంగిపొమ్మని చెప్పాడు. లవణాసుడు ఆ దూతను చంపి ఉపాహారంగా తినేసాడు. ఇది విన్నమాంధాత తన సైన్యముతో మధువనమును చుట్టుముట్టాడు. లవణాసురుని మీద బాణవర్షము కురిపించాడు. లవణాసురుడు తన వద్ద ఉన్న దివ్యశూలమును మాంధాత మీద, అతని సేనలమీదా ప్రయోగించాడు. ఆ శూలము నిప్పులు కక్కుకుంటూ వెళ్లి మాంధాతను, అతని సైన్యమును సమూలంగా నాశనం చేసి తిరిగి లవణుని వద్దకు వచ్చి చేరింది.

కాబట్టి ఓ శత్రుఘ్నా! ఆ శూలము మహిమ అంత గొప్పది. కాబట్టి లవణుని తెలివిగా చంపాలి కానీ ఎదురు పడి చంపకూడదు. అతని చేతిలో శూలం లేని సమయంలోనే అతనిని చంపాలి. ఉదయం పూట అతని చేతిలో శూలం ఉండదు. లవణుడిని చంపడానికి అదే సరి అయిన సమయం. నీవు తప్పకుండా లవణునికి చంపగలవు. లవణుని చావు వలన లోకాలకు మేలు జరుగుతుంది.

శత్రుఘ్నా! లవణుని గురించి పూర్తి వివరాలు నీకు చెప్పాను. పరమేశ్వరుడు ఇచ్చిన శూలమే అతని బలము. ఇంద్రుడు తాను మాంధాతను చంపలేక, లవణుని మీదికి పురికొల్పి అతని చేత మాంధాతను చంపించాడు. నీవు కూడా కపటముతోనే లవణుని చంపాలి.

రేపు ఉదయము అతడు శూలం లేకుండా నగరం బయటకు ఆహారం కోసరం వస్తాడు. ఆ సమయంలోనే నీవు అతనిని చంపగలవు. నీకు జయం కలుగుతుంది." అని ఆశీర్వదించాడు చ్యవనుడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము అరవై ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

అరవై ఎనిమిదవ సర్గ.

ఆరాత్రి గడిచిపోయింది. మరునాడు తెల్లవారగానే యధావిధిగా లవణుడు ఆహారము కొరకు నగరము విడిచి బయలుదేరాడు. ఇదే సమయమని శత్రుఘ్నుడు ధనుర్బాణములు ధరించి, యమునా నదిని దాటి, మధునగరము ముఖద్వారము దగ్గరకు వచ్చాడు. మధ్యాహ్న సమయానికి లవణుడు కొన్ని వేల జంతువులను వేటాడి వాటిని తీసుకొని నగరానికి వచ్చాడు. నగర ద్వారము దగ్గర ధనుర్బాణములను ధరించి నిలబడ్డ శత్రుఘ్నుని చూచాడు. అతని వద్ద ఉన్న ధనుర్బాణములను చూచాడు.

"ఓరీ నరాధమా! ఈ ఆయుధముతో నన్నేమి చేస్తావురా! నీ లాంటి వారిని నేను కొన్ని వేల మందిని చంపి తిన్నాను. నీకు కాలము మూడి నా దగ్గరకు వచ్చావు. ఈ రోజు నాకు నరమాంసము చాలినంతగా

దొరకలేదు. రా నిన్ను కూడా తింటాను.” అని అన్నాడు లవణుడు.

“ఓరీ రాక్షసుడా! రారా. నాతో యుద్ధం చెయ్యి. ఈరోజు నీ చావు నా చేతిలో ఉంది. నేను ఎవరో తెలుసా. ఇక్ష్వాకు వంశ చక్రవర్తి దశరథమహారాజు కుమారుడను. రాముని సోదరుడను. శత్రుఘ్నుడను. నిన్ను చంపడానికే అయోధ్య నుండి ఇక్కడకు వచ్చాను. నిన్ను చంపి ఈ లోకానికి పట్టిన పీడ వదిలిస్తాను.” అని అన్నాడు.

ఆ మాటలకు లవణుడు పెద్దగా నవ్వాడు. “అవును అంత దూరం నుండి నా చేతిలో చావడానికి నా దగ్గరకు వచ్చావు. నీ రాముడు చంపిన రావణుడు నాకు మేనమామ. మా అమ్మ సోదరుడు. రాముడు ఒక ఆడుదాని గురించి నా మేనమామను చంపాడు. రావణ కులమును నాశనం చేసాడు. అయినా నేను రాముని క్షమించాను. నాకు రాముడు అంటే లెక్కలేదు. నా ముందు రాముడు ఒక అల్పజీవి. రాముడి లాంటి వాళ్లను ఎంతో మందిని నేను చంపాను. నువ్వు నీ రాముడు నా ముందు గడ్డిపరకల లాంటివాళ్లు. నాతో యుద్ధము చేస్తాను అన్నావు కదా. కాసేపు ఉండు నేను లోపలకు పోయి ఆయుధమును తెచ్చుకుంటాను. నేను ఆయుధమును చేతబూని యుద్ధమునకు సిద్ధం అయ్యేవరకూ ఆగు.” అని అన్నాడు లవణుడు.

“నేను ఇక్కడ ఉండగా నువ్వు ఎక్కడకు పోతావు. ఇప్పుడే ఇక్కడే యుద్ధం చెయ్యి. చేత చిక్కిన శత్రువును విడిచి పెట్టడానికి నేను వెర్రివాడను కాను. నీ మాటలను బట్టి చూస్తే నీవు నాకే కాదు రామునికి

కూడా శత్రువు. నిన్ను విడువకూడదు. నిన్ను ఇప్పుడే చంపుతాను.కాచుకో. ఈ లోకమును ఇప్పుడే తనివిదీరా చూచుకో! " అని అన్నాడు శత్రుఘ్నుడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము అరవై ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

ఉత్తర కాండము

అరవై తొమ్మిదవ సర్గ.

"నిన్ను చంపడానికి నాకు వేరే ఆయుధము ఎందుకురా! నిన్ను ఇప్పుడే చంపుతాను" అంటూ లవణుడు రెండు అరిచేతులను చరచుకుంటున్నాడు.

"ఒరేయ్! నీవు ఎంతో మందిని చంపాను అని ప్రగల్భాలు పలుకుతున్నావు కదా! అప్పుడు నేనుపుట్టలేదు. ఇప్పుడు నేను నీ ఎదుట ఉన్నాను. ఇంక చావడమే కానీ చంపడం నీ తరం కాదు. నా బాణాలదెబ్బకు యమలోకం దాకా పరుగెత్తు. రాముడు రావణుని చంపుతున్నప్పుడు ఆకాశంలో నిలిచి దేవతలు, ఋషులు చూచి ఎలా ఆనందించారో అలాగే నేను నిన్ను చంపుతుంటే ఆకాశం నుండి దేవతలు గంధర్వులు చూచి ఆనందిస్తారు. నీవు నా బాణముల దెబ్బలు తిని నేలకూలగానే ఈ లోకం అంతా ఆనందిస్తుంది. నా ధనుస్సు నుండి వెలువడ్డ బాణాలు నీ గుండెల్లో దిగబడి నిన్ను హతమారుస్తాయి. " అని

అన్నాడు శత్రుఘ్నుడు.

ఇన్నాళ్లు తనను చూచి గడగడవణికిన వాళ్లే కానీ ఎదురు నిలిచి మాట్లాడిన వాళ్లు లేరు. అందుకని లవణునికి రోషం పెల్లుబికింది. మారుమాట్లాడకుండా పక్కనే ఉన్న ఒక పెద్ద వృక్షమును పెరికి శత్రుఘ్నుని గుండెలకు గురిపెట్టి విసిరాడు. శత్రుఘ్నుడు తన బాణములతో ఆ వృక్షమును ముక్క ముక్కలుగా నరికాడు. లవణుడు ఈ సారి రెండు చేతులతో వృక్షములను పెకలించి శత్రుఘ్నుడు మీదికి విసిరాడు. శత్రుఘ్నుడు తన మీదికి వస్తున్న వృక్షములను తన బాణములతో ముక్కల కింద నరుకుతున్నాడు. అంతే కాకుండా శత్రుఘ్నుడు లవణుని మీద బాణములను వర్షము మాదిరి కురిపించాడు. ఆ బాణముల బారి నుండి తప్పించుకున్న శత్రుఘ్నుడు మరొక వృక్షమును పెరికి శత్రుఘ్నుని తల మీద మోదాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక శత్రుఘ్నుడు కింద పడ్డాడు. లవణుడు పెద్దగా అట్టహాసం చేసాడు.

శత్రుఘ్నుడు పడి పోగానే పరుగు పరుగున తన గృహమునకు పోయి తన దివ్వమైన శూలమును తెచ్చుకొనే అవకాశము ఉన్నా కూడా లవణుడు ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. శత్రుఘ్నుని లెక్కచేయలేదు. శత్రుఘ్నుడు తన చేతిలో హతం అయ్యాడు అని అనుకున్నాడు. తాను వేటాడి తెచ్చిన మృగములను పైకి ఎత్తుకున్నాడు. ఇంతలో మూర్ఛనుండి తేరుకున్న శత్రుఘ్నుడుపైకి లేచి ధనుర్బాణములను ధరించి నగర ద్వారమునకు అడ్డంగా నిలబడ్డాడు. రాముడు తనకు ఇచ్చిన అస్త్రమును విల్లుకు సంధించాడు. ఆ అస్త్రము ఎర్రగా భగా భగా

మండుతూ ఉంది. ఆ అస్త్రమును లవణుని మీదికి ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నాడు. . ఆ దివ్యమైన అస్త్రము ప్రళయాగ్ని వలె మండుతూ ఉండడం చూచి ప్రాణి కోటి గడగడలాడింది. దేవతలు గంధర్వులు మునులు అందరూ బ్రహ్మ దగ్గరకు వెళ్లారు. లోకాలు నశించిపోతాయేమో అయి అందరూ భయపడ్డారు. వారు బ్రహ్మతో ఇలా అన్నారు. "ఓ బ్రహ్మదేవా! ముల్లోకములకు ప్రళయం సంభవించినట్టు ఉంది. ఏమిటీ విపరీతము. లోకాలన్నీ భగభగ మండుతున్నాయి. ఇదివరకు ఇంతటి ప్రళయాన్ని మేము ఎప్పుడూ చూడలేదు."అని అన్నాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు జరిగిన విషయం వారితో చెప్పాడు. "లవణుడు అనే లోక కంటకుని చంపడానికి రాముని తమ్ముడు శత్రుఘ్నుడు దివ్యమైన అస్త్రమును సంధించాడు.దాని తేజస్సుతోనే ఇంతటి ప్రళయం సంభవించింది. ఇది మహావిష్ణువు బాణము. మహాశక్తివంత మైనది. పూర్వము విష్ణువు మధు, కైటభులను వధించడానికి ఈ అస్త్రమును సృష్టించాడు. ఈ అస్త్రమును గురించి విష్ణువు ఒక్కడికే తెలుసు. అసలు ఈ అస్త్రము విష్ణు స్వరూపము. మీరందరూ వెళ్లి ఆ దివ్యమైన అస్త్రముతో లవణాసురుడు ఎలాచస్తాడో చూడండి." అని అన్నాడు.

ఆ మాటలు విన్న దేవతలు, గంధర్వులు శత్రుఘ్నుడు లవణుడు యుద్ధం చేసే ప్రదేశానికి వచ్చారు. ఆకాశంలో నిలబడి వారి యుద్ధమును చూస్తున్నారు. శత్రుఘ్నుడు పెద్దగా సింహనాదం చేసాడు. లవణుని యుద్ధానికి పిలిచాడు. లవణుడు శత్రుఘ్నునితో యుద్ధానికి సిద్ధం

అయ్యాడు. శత్రుఘ్నుడు తనకు రాముడు ఇచ్చిన దివ్యాస్త్రమును విల్లుపై ఎక్కుపెట్టి, వింటి నారిని ఆకర్ణాంతము లాగి ఆ అస్త్రమును లవణుని గుండెలకు గురిపెట్టి విడిచాడు. క్షణంలో ఆ దివ్యాస్త్రము లవణుని గుండెలను చీల్చుకొని భూమిలోకి ప్రవేశించింది. మరలా అదేవేగంతో వెనుకకు వచ్చి శత్రుఘ్నుని అమ్ములపొదిలోకి చేరింది. యుగయుగాల నుండి పరమేశ్వరుడు ప్రసాదించిన శూలముతో వేలకు వేలమందిని చంపిన లవణాసురుడు, శత్రుఘ్నుడు ప్రయోగించిన దివ్యాస్త్రము దెబ్బకు గుండెలు పగిలి పర్వతము మాదిరి నేలకూలి మరణించాడు.

లవణుని మృతితో, అప్పటి దాకా లవణుని పూజామందిరములో పూజలందుకుంటున్న ఆ దివ్యమైన పరమేశ్వరుని శూలము, పైకి ఎగిరి కైలాసము చేరుకొని పరమేశ్వరునిలో లీనం అయింది. దేవతలు, గంధర్వులు,ఋషులు శత్రుసంహారం చేసిన శత్రుఘ్నుని వేనోళ్లపొగిడారు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము అరవై తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

డెబ్బయ్యవ సర్గ.

లవణాసురుని సంహారంతో దేవతాగణములు హర్షం ప్రకటించాయి. స్వయంగా దేవేంద్రుడు శత్రుఘ్నునితో ఇలా అన్నాడు. “కుమారా! మా అదృష్ట వశాత్తు నీవు లవణుని చంపి విజయుడవు అయ్యావు. లవణుని బారి నుండి ముల్లోకములకు విముక్తి కల్పించావు. నీకు ఏదైనా వరం ఇవ్వాలని అనుకుంటున్నాను. కోరుకో!” అని అన్నాడు. అప్పుడు శత్రుఘ్నుడు ఇంద్రునితో ఇలా అన్నాడు. “మహేంద్రా! ఈ మధు నగరాన్ని ఇప్పటిదాకా ఈ లవణాసురుడు పరిపాలించాడు. ఈ మధు నగరాన్ని నాకు రాజధానిగా చెయ్యండి.” అని అడిగాడు. దానికి ఇంద్రుడు సమ్మతించాడు. శత్రుఘ్నుడికి కోరిన వరాలు ఇచ్చి ఇంద్రుడు దేవతలు స్వర్గానికి వెళ్లిపోయారు. శత్రుఘ్నుడు శ్రావణమాసంలో మధురానగరానికి పట్టాభిషిక్తుడు అయ్యాడు. అప్పటి నుండి శత్రుఘ్నుడు మధు నగరమును రాజధానిగా చేసుకొని లవణాసురుని రాజ్యమును జనరంజకంగా పరిపాలించాడు. 12 సంవత్సరాలు గడిచాయి. ఈ 12 సంవత్సరములలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు.

ఇక్కడ వాల్మీకి కూడా మధు నగరాన్ని మధురాపురీ అనిరాసాడు.

తస్యబుద్ధి:సముత్పన్నా నివేశ్య మధురాం పురీమ్
రామపాదం నిరీక్షేహం వర్షే ద్వాదశ ఆగతే.

మధురాపురమును ఏర్పరిచిన 12 సంవత్సరముల తరువాత శత్రుఘ్నునికి రాముని చూడాలని అనిపించింది. (యమునా నదీ తీరంలో ఉన్న ప్రస్తుత

మధుర అప్పటి మధురానగరం అయి ఉండవచ్చు అనడంలో సందేహం లేదు.ఈ మధురా నగరమే నాటి కంసుని రాజధాని. శ్రీకృష్ణుని జన్మస్థలము.) శత్రుఘ్నుడు వెంటనే అయోధ్యకు బయలుదేరాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము డెబ్బదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
డెబ్బది ఒకటవ సర్గ.

లవణాసురుని సంహరించి, మధురా నగరమును రాజధానిగా చేసుకొని పన్నెండు సంవత్సరములు పరిపాలించిన తరువాత శత్రుఘ్నుడు రాముని చూడవలెనని కొద్దిగా సైన్యమును వెంటతీసుకొని అయోధ్యకు బయలుదేరాడు. ఏడు రోజుల తరువాత శత్రుఘ్నుడు గంగాతీరంలో ఉండే వాల్మీకి ఆశ్రమానికి చేరుకున్నాడు. (అప్పటికి వాల్మీకి ఆశ్రమంలో పెరుగుతున్న కుశలవులు 12 ఏళ్ల వాళ్లు అయ్యారు) శత్రుఘ్నుడు ఆ రాత్రికి వాల్మీకి ఆశ్రమంలో విడిది చేసాడు. శత్రుఘ్నుడు వాల్మీకి వద్దకు పోయి అభివాదముచేసాడు ఆయన ఇచ్చిన అర్ఘ్యము పాద్యము స్వీకరించాడు.

వాల్మీకి శత్రుఘ్నుని చూచి ఇలా అన్నాడు. “కుమారా! నీవు లవణాసురుని చంపావని తెలిసి చాలా సంతోషించాను. ఎందుకంటే లవణాసురుడు ఇప్పటిదాకా వేలకొలది రాజులను, వారి సైన్యములను

నిర్మూలించాడు. అతడిని జయించేవాడు లేడు అనుకుంటూ ఉండగా నువ్వు ఉపాయంతో లవణుడిని సంహరించావు. ముల్లోకములకు శాంతి చేకూర్చావు. రావణ వధ తరువాత అటువంటి రాక్షసుని నీవు చంపావు. నీవు లవణాసురునితో యుద్ధం చేస్తున్నప్పుడు నేను ఇంద్ర సభలో ఉన్నాను. అక్కడి నుండి మీరిరువురి యుద్ధమును చూచాను." అని చెప్పి వాల్మీకి శత్రుఘ్నుని శిరస్సును ఆఘ్రాణించి ఆశీర్వదించాడు.

ఆ రాత్రికి శత్రుఘ్నుడు వాల్మీకి మహర్షి ఇచ్చిన ఆతిథ్యమును స్వీకరించాడు. తీరిగ్గా కూర్చుని వాల్మీకి రచించిన రాముని కథను మునికుమారులు గానం చేస్తుంటే కర్ణపేయంగా విన్నాడు. రామకథ ఎలా జరిగిందో యథాతథంగా మునికుమారులు గానం చేస్తుంటే శత్రుఘ్నుని కళ్లవెంట నీళ్లుకారు తున్నాయి. రామ కథ మరలా తన కళ్ల ముందు జరుగుతున్నట్టు భావించాడు. శత్రుఘ్నుని వెంట ఉన్న మంత్రులు సేనాపతులు కూడా రామ కథ తమ ఎదుట మరలా జరుగుతున్నట్టు భావించారు.

"జరిగింది జరిగినట్టు రామ కథను గానం చేస్తున్నారు. మనం కలగంటున్నామా!" అని ఆశ్చర్యపోయారు. వారు శత్రుఘ్నుని వద్దకు పోయి "మహారాజా! ఈ రామకథ ఉన్నది ఉన్నట్టు జరిగింది జరిగినట్టు ఎలా రాయబడింది, ఎలా గానం చేయబడిందో వాల్మీకి మహర్షిని అడిగి తెలుసుకోండి." అని అడిగారు.

దానికి శత్రుఘ్నుడు వారితో ఇలా అన్నాడు. "మనం వారికి

అతిథులుగా వచ్చాము. రామ కథ మృదుమధురంగా గానం చేస్తుంటే విన్నాము. అంతే కానీ ఇలాంటి విషయాలు అడగకూడదు. మునుల ఆశ్రమములలో ఎన్నోవిషయాలు జరుగుతూ ఉంటాయి. వాటి గురించి మనం అడగడం బాగుండదు.” అని మందలించాడు. తరువాత శత్రుఘ్నుడు వాల్మీకి మహర్షికి నమస్కరించి తనకు ఏర్పరిచిన శయనాగారమునకు వెళ్లిపోయాడు.(ఇప్పటి దాకా వాల్మీకి రామాయణ గాధను ఎవరు గానం చేసారో చెప్పలేదు. సంగీత బద్ధంగా గానం చేసారు అన్నాడే గానీ, ఎవరు గానం చేసారు అన్న విషయాన్ని సస్పెన్సులో ఉంచాడు వాల్మీకి.)

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము డెబ్బైఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

డెబ్బైరెండవ సర్గ.

శత్రుఘ్నుడు తన శయ్య మీద పడుకున్నాడే కానీ ఆ మృదుమధురగానం వినిపిస్తూనే ఉంది. చెవిలో మార్మోగుతూనే ఉంది. శత్రుఘ్నుడుకి ఎంతకూ నిద్ర రాలేదు. ఆ గానం చేసింది ఎవరా అని ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రలోకి జారుకున్నాడు. మరునాడు ఉదయం శత్రుఘ్నుడు వాల్మీకి వద్దకు పోయి “ఓ మహర్షీ! నాకు రాముని చూడవలెనని కోరికగా ఉంది. అందుకని నాకు అయోధ్యకు వెళ్లడానికి

అనుమతి ఇవ్వండి” అని అడిగాడు. వాల్మీకి శత్రుఘ్నుని ఆశీర్వదించి అతను అయోధ్యకు పోవడానికి అనుమతి ఇచ్చాడు. శత్రుఘ్నుడు వెంటనే తన సైన్యముతో అయోధ్యకు బయలుదేరాడు.

అయోధ్యలో ప్రవేశించగానే శత్రుఘ్నుడు రాముని మందిరమునకు వెళ్లాడు. రాముని చూడగానే శత్రుఘ్నుడు రెండు చేతులు జోడించి నమస్కరించి ఆయనతో ఇలా అన్నాడు. “రామా! నీ ఆజ్ఞను సారము నేను మధుపురమునకు పోయి, లవణునితో యుద్ధము చేసి అతనిని సంహరించారు. తరువాత నాకు దేవేంద్రుడు మధుర పురము అనే రాజధానిని నిర్మించి ఇచ్చాడు. ఆ నగరమును రాజధానిగా చేసుకొని నేను లవణుని రాజ్యమును 12 సంవత్సరములు పరిపాలించాను. నిన్ను చూడవలెనని కోరికతో వచ్చాను. రామా! నిన్ను వదిలి నేను ఉండలేను. నేను నీ వద్దనే ఉంటాను.” అని అన్నాడు.

దానికి రాముడు ఇలా అన్నాడు. “నీవు మధురా నగరమునకు రాజువు. నీవు అక్కడే ఉండాలి. నన్ను చూడటానికి వచ్చావు కాబట్టి కొన్ని రోజులు ఉండి వెళ్లు. నన్ను చూడాలని అనిపించినప్పుడల్లా అయోధ్యకు వచ్చి నన్ను చూచి వెళుతూ ఉండు. క్షత్రియులకు ప్రజాపాలనే విద్యుక్త ధర్మము. క్షత్రియులు తమ స్వధర్మమును మరిచిపోరాదు. నీవు లేకపోతే రాజ్యములో అరాచకము ప్రబలుతుంది. నీ వలన ప్రజలు కష్టాల పాలవుతారు. కాబట్టి ప్రజాపాలనే నీ కర్తవ్యము. నాకు కూడా నిన్ను నా వద్దనే ఉంచుకొనవలెనని ఉంది. కానీ మనకు ప్రజాపాలన ముఖ్యం కదా. అందువలన నీవు ఇక్కడ ఏడు రోజులు ఉండి తరువాత నీ సేనలతో

మధురా పురికి వెళ్లు." అని అన్నాడు రాముడు.

శత్రుఘ్నుడు రామునికి నమస్కరించి "అలాగే చేస్తాను రామా!" అని అన్నాడు. రాముని ఆజ్ఞ ప్రకారము ఏడు రాత్రులు అయోధ్యలో గడిపి శత్రుఘ్నుడు మధురా పురికి ప్రయాణం అయ్యాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము డెబ్బది రెండవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
డెబ్బది మూడవ సర్గ.

నిరాఘాటంగా జనరంజకంగా సాగుతున్న రాముని పాలనలో ఒక చిన్న అపశృతి దొర్లింది. ఒక రోజు ఒక బ్రాహ్మణుడు తన కుమారుని శవమును తీసుకొని రాముని మందిర ద్వారము దగ్గరకు వచ్చాడు. రాజ ద్వారము వద్ద కూర్చుని కొడుకును తల్చుకుంటూ ఏడుస్తున్నాడు. "నేను ఏ జన్మలో ఏమి పాపం చేసానో ఏమో పసి వయస్సులోనే నా కుమారుని పోగొట్టుకున్నాను. నా ఒక్కగానొక్క కుమారుడు బాల్యములోనే మరణించాడు. ఈ పుత్రశోకము నేను నా భార్య భరించలేము. కుమారుని కోసరం శోకించి శోకించి నేను నా భార్యకూడా మరణిస్తాము. నేను ఏ నాడూ ఎవరికీ ఎటువంటి అపకారమూ చేయలేదు. అబద్ధం చెప్పలేదు. ఎవరినీ హింసించలేదు. ఎవరినీ చంపలేదు. మరి నాకు ఇటువంటి

పుత్రశోకము ఎందుకు కలిగిందో తెలియదు. నా కుమారుడు నాకు కర్మకాండలు చేస్తాడని, ప్రతి సంవత్సరము నాకు శ్రాద్ధము పెడతాడనీ కలలు కన్నాను. అటువంటిది నేను నా కుమారునికి కర్మకాండలు నిర్వర్తించాల్సిన ఖర్మ దాపురించింది. రాముడు పరిపాలించే రాజ్యములో ఇటువంటి ఘోరములు జరగడం వింతగా ఉంది. ఇదివరకు ఎప్పుడూ పెద్ద వాళ్లు బతికి ఉండగా చిన్న వాళ్లు మరణించడం ఎరుగము. అటువంటిది నా విషయంలోనే ఇలా జరిగింది. దీనికి కారణం ఎక్కడో ఏదో పాపం జరిగింది. అది రాముడు చేసిన పాపమో లేక రామరాజ్యంలో జరుగుతున్న పాపమో తెలియదు.

కాబట్టి ఓ రామా! నీవు నీ రాజ్యములో జరుగుతున్న పాపమును పరిహరించి మరణించిన నా కుమారుని బతికించు. లేకపోతే నేను నా భార్య ఇక్కడే నిరాహారులుగా ఉండి మరణిస్తాము. బ్రహ్మహత్యాపాతకము నీకు చుట్టుకుంటుంది. నువ్వు మాత్రము నీ సోదరులతో సుఖంగా ఉండు. దశరథుని పాలనలో ఇలాంటి ఘోరం జరగ లేదు. ఇదిగో రాముడు వచ్చాడు. ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయి. రాముడి పాలనలో అయోధ్య అనాధ అయింది. రాముడు శాస్త్రప్రకారము పరిపాలన సాగిస్తే ఇలాంటి అనర్థాలు జరగవు కదా! రాజు పాపాలు చేస్తేనే ఇటువంటి అకాల మరణాలు సంభవిస్తాయి. రాముని కాలంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయింది. అకృత్యాలు ప్రబలిపోయాయి. ఇది తప్పక రాజు చేసిన దోషమే. సందేహము లేదు. అందు చేతనే రాముని రాజ్యములో ఇటువంటి అకాల మరణాలు, బాల్య మరణాలు సంభవిస్తున్నాయి." అని ఆ బ్రాహ్మణుడు పరి పరి విధాల

రాముని,రాముని పాలననూ నిందిస్తూ శోకిస్తున్నాడు.
(రాముని పాలనలో ప్రజలు10,000 సంవత్సరాలు బాగానే ఉన్నారు. సుఖపడ్డారు. ప్రజల కోసరం రాముడు తన భార్యనే వదులుకున్నాడు. కానీ, ఈ ఒక్క సంఘటనతో అంతా మట్టికొట్టుకుపోయింది. ఈనాడు కూడా అంతే కదా! ప్రభుత్వము ఎన్ని మంచి పనులుచేసినా ఎవరూ పట్టించుకోరు. ఏ చిన్న సంఘటన జరిగినా ప్రభుత్వ వైఫల్యము, పోలీసుల అసమర్థత అని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తుంటాయి. మంచి జరిగితే పట్టించుకోరు. ఏ చిన్న తప్పుజరిగినా భూతద్దంలో చూస్తారు. అమాయకులైన అమ్మాయిల మీద యాసిడ్ దాడులు చేస్తే ప్రజలకు రక్షణ లేదు అంటారు. ఆ యాసిడ్ పోసిన వాడిని నాలుగు తగిలిస్తే, పౌరహక్కుల ఉల్లంఘన అంటారు. నాడూ నేడూ ఇదే వరస!)

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము డెబ్బది మూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
డెబ్బది నాలుగవ సర్గ.

బ్రాహ్మణ బాలుడు మరణించడం, ఆ బ్రాహ్మణుడు శోకించడం తనను నిందించడం రాముడికి తెలిసింది. రాముడు దు:ఖంతో క్రుంగిపోయాడు. వెంటనే సభ ఏర్పాటు చేసాడు. రాజ పురోహితులను మంత్రులను,పురప్రముఖులను పిలిపించాడు. వారితో సమాలోచనలు

జరిపాడు. ఆ సభకు వసిష్ఠుడు, మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు,జాబాలి, గౌతముడు, నారదుడు విచ్చేసారు. రాముడు ఆ బ్రాహ్మణుని సమస్యను అందరికీ వివరించాడు. "ఆ బ్రాహ్మణుడు తన కుమారుని పునరుజ్జీవితుని చెయ్యమని మొండి పట్టు పట్టాడు. ఏమిచెయ్యాలి. దీనికి తరుణోపాయము ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు నారదుడు లేచి ఇలా అన్నాడు.

"రాజా! ఆ బ్రాహ్మణ కుమారునికి అకాల మరణం ఎలా సంప్రాప్తించిందో వివరిస్తాను. నేను చెప్పినది విని, నీకు తోచినది చెయ్యి. కృతయుగములో కేవలము బ్రాహ్మణులు మాత్రమే తపస్సు చేసుకొనే వారు. బ్రాహ్మణులు కాని వారు తపస్సు చేసుకొనే వారు కాదు. అప్పుడు ధర్మము నాలుగు పాదములతో నడిచేది. అకాల మరణాలు లేవు. సర్వమూ బ్రహ్మ మయంగా ఉండేది. త్రేతాయుగంలో యుగ ధర్మము మారింది. బ్రాహ్మణులతో పాటు క్షత్రియులు కూడా తపస్సు చేస్తున్నారు. కృతయుగములే బ్రాహ్మణులకే పరిమితమైన తపస్సు త్రేతాయుగంలో క్షత్రియులకు కూడా ఆచరణయోగ్యమయింది. కాని త్రేతాయుగములో తపస్సు చేసిన క్షత్రియులు, కృతయుగములో ఉన్న తాపసులైన బ్రాహ్మణుల కంటే తక్కువ వారే! ఇంకా వివరంగా చెప్పాలంటే కృతయుగములో బ్రాహ్మణులు తమ తపస్సు చేతా, వీరత్వము చేతా అధికంగా ఉండేవారు. క్షత్రియ జాతి బ్రాహ్మణుల కన్నా తక్కువగా ఉండేవారు. (అందుకే క్షత్రియుడైన విశ్వామిత్రుడు బ్రాహ్మణులకే పరిమితమైన బ్రహ్మర్షి పదవి కోసరం నానా తంటాలు పడ్డాడు.)

త్రేతాయుగంలో క్షత్రియులు కూడా తపస్సు చేయడంతో రెండు జాతులూ తపస్సులోనూ, వీరత్వములోనూ సమానమయ్యాయి. కాని కృతయుగ బ్రాహ్మణ జాతి కన్నా త్రేతాయుగ బ్రాహ్మణులు కింది వరసలో ఉండేవారు. ఆ కారణం చేత అందరూ కలిసి అందరికి యోగ్యమైన, సమ్మత మైన చాతుర్వర్ణ వ్యవస్థను ఏర్పాటు చేసారు. తరువాత త్రేతాయుగములో అధర్మము ఒక పాదమును మోపింది. ప్రజలలో అసత్యములు పలకడం ఎక్కువ అయింది. దానికి అనుగుణంగా త్రేతాయుగములో ప్రజల ఆయు:ప్రమాణము కూడా తగ్గిపోయింది. ఒక పక్క అసత్యములు పలకడం అలవాటుగా మారినప్పటికినీ, లోకములో ప్రజలు సత్యము,ధర్మముల మీద ఆసక్తి చూపడం మానలేదు. మంచి పనులను చేయడంలో ఆసక్తి చూపుతుండేవారు.

యుగధర్మము ప్రకారము త్రేతాయుగములో బ్రాహ్మణులు, క్షత్రియులు మాత్రమే తపస్సు చేసేవారు, ఇతర జాతుల వారు వారికి తగిన సామగ్రిని, సేవలను సమకూర్చేవారు. బ్రాహ్మణులకు, క్షత్రియులకు సేవ చేయడం వైశ్యులు, శూద్రులు తమ ధర్మంగా భావించేవారు. శూద్రులు, బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు సేవ చేయడం తమ ధర్మంగా భావించేవారు. కాల క్రమేణా వైశ్య, శూద్రులు తమకు నిర్దేశించిన ధర్మం తప్పడం, అసత్యములు ఆడటం మొదలు పెట్టారు. దాని ప్రభావంతో బ్రాహ్మణ క్షత్రియులలో కూడా వారి తేజము తగ్గిపోయింది. అధర్మం తన ప్రభావం చూపసాగింది.

తరువాత అధర్మము తన రెండవ పాదం కూడా భూమి మీద మోపింది. అప్పుడు ద్వాపరము మొదలయింది. ద్వాపర యుగంలో అబద్ధాలు ఆడటం, ధర్మం తప్పి చరించడం ఎక్కువ అయింది. ఒకరికి ఒకరు మోసం చేసుకోవడం మితిమీరి పోయింది. ద్వాపరంలో వైశ్యులు కూడా తపస్సు చేయడం మొదలు పెట్టారు. ఈ ప్రకారంగా మూడు యుగములలో మూడు వర్ణములలో తపస్సు వృద్ధిపొందింది. కాబట్టి కృత,త్రేత,ద్వాపర యుగములలో కూడా శూద్రులకు తపస్సు చేసే అధికారము సంక్రమించలేదు. అదీ కాకుండా శూద్రులు తపస్సు చేయడానికి ఎన్నడూ ఉద్యుక్తులు కాలేదు. కలి యుగంలో శూద్రులుకూడా తపస్సు చేస్తారేమో చూడాలి.

అందుచేత రామా! ద్వాపరంలో కూడా శూద్రులు తపస్సు చేయడం అధర్మము. ఈ కారణంగా నీ రాజ్యంలో ఎక్కడో అధర్మము జరుగుతూ ఉంది. ఎవరో శూద్రుడు తపస్సు చేస్తూ ఉండిఉంటాడు. అందువలననే ఇంతటి అధర్మము జరిగింది. తండ్రి బతికి ఉండగానే బాలుడు మృతి చెందాడు. ఏ రాజ్యములో నైనా ఏ పౌరుడైనా అధర్మమునకు పాల్పడ్డా, చేయకూడని పని చేసినా, ఆ రాజ్యములో సంపద ఉండదు. ఆ రాజ్యమును ఏలే రాజు నరకంలో పడతాడు. ఎందుకంటే, రాజ్యములో ఉన్న ప్రజలు చేసే పాపపుణ్యాలలో రాజుకు ఆరవ వంతు వచ్చి చేరుతుంది. పౌరులు చేసిన పుణ్యములో, వారు ఆర్జించిన ధనములో ఆరవ వంతు స్వీకరిస్తున్న నీకు నీపౌరులను రక్షించవలసిన బాధ్యత ఉంది. కాబట్టి నువ్వు నీ రాజ్యమంతా వెదికి నీ రాజ్యములో ఎవరు ఎక్కడ అధర్మానికి పాల్పడుతున్నారో, ఎవరు చేయకూడని పని చేస్తున్నారో

కనిపెట్టి వారిని శిక్షించు. అదే నీ బాధ్యత. అప్పుడే అకాల మరణం పొందిన ఈ బాలుడు కూడా జీవిస్తాడు."అని అన్నాడు నారదుడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము డెబ్బది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

డెబ్బది ఐదవ సర్గ.

అధర్మము ఎక్కడ జరుగుతుందో తెలుసుకోడానికి రాముడు స్వయంగా బయలుదేరాడు. పుష్పకమును తలచుకున్నాడు. పుష్పకము వచ్చి రాముని ఎదుట నిలిచింది. రాముడు లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. "లక్ష్మణా! నీవు పోయి పుత్రశోకముతో బాధపడుతున్న ఆ బ్రాహ్మణ దంపతులను ఓదార్చు. ఆ బాలుని శవముచెడిపోకుండా తైలములు, సుగంధ ద్రవ్యములు పూసి ఒక ద్రోణిలో భద్రపరచు. ఎట్టి పరిస్థితులలోనూ ఆ బాలుని శరీరము ఏ భాగానికి ఆ భాగము విడిపోకుండా చూడు. (డికంపోజ్). నగర రక్షణకు లక్ష్మణుని, భరతుని నియమించాడు. తరువాత రాముడు సభికులకు, మునులకు, కులగురువుకు నమస్కరించి పుష్పక విమానము ఎక్కాడు. పశ్చిమదిక్కుగా పోనిచ్చాడు. అక్కడనుండి ఉత్తర దిక్కుకు తరువాత తూర్పు దిక్కుకు వెళ్లాడు. తరువాత దక్షిణ దిక్కుగా మళ్లాడు. దక్షిణ దిక్కు అంతా వెతుకుతున్నాడు. అక్కడ శైవల పర్వతము పక్కనే ఉన్న ఒక సరస్సును చూచాడు. ఆ సరస్సులో

తల కిందికి పెట్టి కాళ్లు పైకెత్తి తపస్సు చేస్తున్న ఒక ఋషిని చూచాడు. వెంటనే పుష్పకమును దిగి ఆయన వద్దకు వెళ్లాడు. ఆయనకు నమస్కరించాడు. "మునివర్యా! నేను ఈ రాజ్యమును ఏలే రాజును. నా పేరు రాముడు. తమరు ఎవరు! తమరి నామధేయము, కులగోత్రములు ఏమి? తమరు ఇంత ఘోర తపస్సు చేయడం స్వర్గసుఖాలుపొందడం కోసరమేనా! లేక వేరుకోరికలుఉన్నాయా! తమరు ఏకోరిక కోరి ఈ తపస్సు చేస్తున్నారో తెలుసుకో గోరుతున్నాను.నీవు నాలుగు వర్ణములలో ఏ వర్ణమునకు చెందినవాడివి. నిజం చెప్పండి." అని ఆ ముని వివరాలు అడిగాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము డెబ్బది అయిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓంతత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
డెబ్బది ఆరవ సర్గ.

రాముని చూచి కూడా, రాముని మాటలు విని కూడా ఆ ముని తనతపస్సు మానలేదు. తలకిందులుగా ఉండి రామునికి ఇలాసమాధానం చెప్పాడు. "రాజా! నేను శూద్రుడను. నా పేరు శంబూకుడు. నాకు ఈ శరీరంతో స్వర్గమునకు పోవాలని కోరిక. దేవ లోకమును జయించవలెనని కోరిక. అందునిమిత్తము ఈ తపస్సు చేస్తున్నాను." అని అన్నాడు.

రాముడు మారు మాట్లాడలేదు. తన ఖడ్గము తీసి ఆ ముని శిరస్సును ఖండించాడు. శూద్రజాతికి చెందిన ఆ ముని మరణించాడు. ఆకాశమునుండి దేవతలు పుష్పవృష్టి కురిపించారు. దేవతలు రాముని వద్దకు వచ్చి "రామా! నీవు ధర్మమును కాపాడావు. బొందితో స్వర్గము ఎవరికీ సాధ్యము కాదు. నీకు ఏం వరం కావాలో కోరుకో!" అని అన్నాడు. వెంటనే రాముడు "ఇతడు స్వర్గమును చేరుకోడానికి ఈ తపస్సు చేస్తున్నాడు. అతని కోరిక నెరవేర్చండి ఇతనికి శాశ్వత స్వర్గలోక నివాసము ప్రసాదించండి." అని అన్నాడు. "రామా! నీచేతిలో మరణంచడంతోనే అతనికి స్వర్గలోక ప్రవేశ అర్హత వచ్చింది. మేము ఇతనిని స్వర్గమునకు తీసుకొని పోయి అతనికోరిక నెరవేరుస్తాము." అని అన్నారు. వెంటనే రాముడు దేవతల పక్కన ఉన్న ఇంద్రుని చూచి "మహేంద్రా! ఇతడు తపస్సు చేయడం మూలాన అధర్మము తలెత్తి ముని కుమారుడు మరణించాడు. నేను ఆ కుమారుని బతికిస్తాను అని ఆ బ్రాహ్మణునికి మాట ఇచ్చాను. నా మాట వృధా కారాదు. కాబట్టి, తమరు నా మీద దయయుంచి ఆ ముని కుమారుని బతికించండి." అని అన్నాడు. "రామా! దీని కోసరం నీవు ఇంతగా అడగవలెనా! ఈ ముని మరణించిన క్షణమే ఆ బాలుడు బతికాడు. తోటిపిల్లలతో ఆడుకుంటున్నాడు. ఇంక మేము వెళ్లి వస్తాము. మీరు ఇక్కడకు దగ్గరలోనే ఉన్న అగస్త్య ఆశ్రమమునకు వెళ్లి ఆయన దర్శనము చేసుకోండి.శుభం జరుగుతుంది. అగస్త్యుడు 12 సంవత్సరముల దీక్ష పట్టాడు. ఆయనదీక్ష సమాప్తము అయింది. మేము కూడా ఆ మహామునిని కలుసుకొని అభినందించడానికి వెళుతున్నాము. మీరు కూడా ఆ మహామునిని సందర్శించండి."అని అన్నారు.

రాముడు దేవేంద్రుడికి, దేవతలకు నమస్కరించాడు. పుష్పకము ఎక్కాడు. దేవతలు వెళుతున్న విమానము వెనకనే తన పుష్పకము మీద రాముడు అగస్త్యమహాముని వద్దకు వెళ్లాడు.

అగస్త్యుడు తన ఆశ్రమమునకు వచ్చిన దేవేంద్రునకు, దేవతలకు, అర్ఘ్యము పాద్యము ఆసనములు ఇచ్చి సత్కరించాడు. దేవతలందరూ అగస్త్యుని ఆతిథ్యమును స్వీకరించి, ఆయనను అభినందించి స్వర్గమునకు వెళ్లిపోయారు. తరువాత రాముడు తన పుష్పకము దిగి అగస్త్యుని వద్దకు పోయి ఆయనకు నమస్కరించాడు. అగస్త్యుడు రామునికి స్వాగత సత్కారాలు చేసాడు. అగస్త్యుడు రామునితో ఇలా అన్నాడు.

"రామా! నా పూర్వపుణ్యవశమున నాకు నీ దర్శనభాగ్యము కలిగింది. నీవు పూజించ తగ్గ వాడవు. నిత్యము నా హృదయంలో నీవే ఉన్నావు. నీవు తన ధర్మమును మరిచి తపస్సు చేస్తున్న ఆ శూద్రుని సంహరించి, ఆ బాలుని బతికించావు. నీవు ఈ రాత్రికి ఇక్కడే ఉండి విశ్రాంతి తీసుకో. రేపు అయోధ్యకు వెళ్లవచ్చును." అని అన్నాడు అగస్త్యుడు. తరువాత రామునికి ఒక దివ్యమైన ఆభరణమును ఇచ్చాడు.

"రామా! ఈ దివ్యమైన ఆభరణము పూర్వము విశ్వకర్మ తయారు చేసాడు. దీనిని స్వీకరించు. దీనిని నేను ఉపయోగించలేదు. అందుకనే నీకు ఇస్తున్నాను. స్వీకరించు" అని అన్నాడు.

దానికి రాముడు ఇలా అన్నాడు. "ఓ మహర్షి! క్షత్రియులకు ఒకరికి ఇవ్వడం ధర్మం. బ్రాహ్మణులకు తీసుకోవడం ధర్మం. క్షత్రియుడనైన నేను ఇతరులు ఇచ్చినది ఎలా స్వీకరించను. నేను మీకు ఇవ్వాల్సింది పోయి మీవద్దనుండి కానుకలు స్వీకరించడం ధర్మం కాదు కదా! బ్రాహ్మణుల వద్దనుండి కానుకలు తీసుకోవడం ఘోరమైన తప్పు. ఆ తప్పు నేను చేయలేను."అని మర్యాదపూర్వకంగా అగస్త్యుడు ఇచ్చిన కానుకను తిరస్కరించాడు రాముడు.

అప్పుడు అగస్త్యుడు రామునితో ఇలా అన్నాడు. "రామా! కృయుగములో రాజు అనే వాడు లేడు. దేవతలకు రాజుగా ఇంద్రుడు ఉండేవాడు. కృతయుగంలో ఎవరికి వారు తమ తమ విద్యుక్త ధర్మములు నిర్వర్తించేవారు. ఒక రాజు ఉండి చెప్పవలసిన, చేయక పోతే దండించవలసిన అవసరం ఉండేది కాదు. కాబట్టి కృతయుగంలో రాజు యొక్క అవసరం లేకపోయింది. దేవతలకే ఒక అధిపతి ఉన్నప్పుడు మనకు కూడా ఒక అధిపతి ఎందుకు ఉండకూడదు అని తలంచి ప్రజలందరూ బ్రహ్మదేవుని వద్దకు పోయి, "దేవా! నీవు దేవతలకు రాజుగా ఇంద్రుడిని స్థాపించావు. మాకు కూడా నరులలో ఉత్తమమైన వాడిని రాజును ఇవ్వండి. మేము అతనిని సేవిస్తాము. రాజు లేకుండా మేము స్వయంగా పరిపాలించుకోలేకపోతున్నాము." అని అడిగారు.

రాజు కావాలంటే అతనికి దైవాంశ ఉండాలి. కాబట్టి బ్రహ్మ, ఇంద్రుడు, మొదలగు లోక పాలకులను పిలిచాడు. వారి వారి తేజస్సునుండి కొంత భాగం ఇమ్మన్నాడు. వారు అలాగే తమ తమ

తేజస్సులలో కొంతభాగము బ్రహ్మదేవునికి ఇచ్చారు. ఇంతలో బ్రహ్మదేవునికి తుమ్ము వచ్చింది. ఆ వేగవంతమైన తుమ్ములో నుండి ఒకడు పుట్టాడు. వాడి పేరు క్షుపుడు. బ్రహ్మదేవుడు లోకపాలకుల నుండి సంగ్రహించిన అంశలను ఆ క్షుపుడిలో ప్రవేశ పెట్టాడు. అతనిని ప్రజలకు రాజును చేసాడు. అప్పుడు క్షుపుడు రాజ్యాధి కారమును స్వీకరించాడు.

ఇంద్రుని అంశతో పరిపాలనా బాధ్యతలను రూపొందించాడు. వరుణుని అంశతో భూమిని సస్యశ్యామలం చేసి అందరికీ పోషణ కల్పించాడు. యముని అంశతో దండనీతిని, దండనాధి కారాన్ని రూపొందించాడు. కుబేరుని అంశతో ధనము, వినిమయము, వాణిజ్యము దానికి సంబంధించిన శాస్త్రములను రూపొందించాడు.

రామా! ఇంద్రుని అంశ పరిపాలనా బాధ్యత అని చెప్పానుకదా! పరిపాలనలో రాజు ప్రజలనుండి స్వీకరించడం కూడా ధర్మమే. ఆ ధర్మము ప్రకారమే ఈ దివ్యమైన ఆభరణమును స్వీకరించు. నీకు శుభం కలుగుతుంది."అని అన్నాడు అగస్త్యుడు.

రాముడు మారు మాట్లాడలేకపోయాడు. ఆ మహాముని ఇచ్చిన ఆభరణమును స్వీకరించాడు. అప్పుడు రామునికి ఒక సందేహము కలిగింది. అసలు ఈ ఆభరణము ఈ ముని చేతికి ఎలా వచ్చింది. ఎవరు ఇచ్చారు. ఎందుకు ఇచ్చారు. తెలుసుకోవాలని అనుకున్నాడు. అగస్త్యమహా మునిని ఇలా అడిగాడు.

"ఓ మునీంద్రా! ఈ ఆభరణము తమరి దగ్గరకు ఎలా వచ్చింది. ఎవరు ఇచ్చారు దయతో చెప్పండి." అని అడిగాడు. దానికి అగస్త్యుడు ఇలా చెప్పసాగాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము డెబ్బది ఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
డెబ్బది ఏడవసర్గ.

పూర్వము ఈ పక్కనే ఉన్న భూమి మీద నూరు యోజనముల దూరము, చెట్లు గుట్టలు పర్వతములు కొండలు,మృగములు, పక్షులు ఉండేవి కావు. భూమి చదునుగా ఉండేది. దాని పక్కనే ఉన్న అరణ్యములో నేను తపస్సు చేసుకుంటూ ఉండేవాడిని. నేను తపస్సు చేసుకుంటున్న అరణ్యము ఫల వృక్షములతోనూ, స్వచ్ఛమైన నీటి సరోవరములతోనూ, పుష్పజాతులతోనూ నిండి ఉండేది.

ఆ అరణ్యములో ఒక పురాతన ఆశ్రమము ఉండేది. ఆ ఆశ్రమములో ఎవరూ లేరు. నిర్మానుష్యంగా ఉండేది. ఆ ఆశ్రమము పక్కనే ఒక సరస్సు ఉంది. నేను ఆ సరస్సు దగ్గరకు వెళ్లాను. ఆ సరస్సులో ఒక శవం తేలుతూ ఉంది. కాని ఆ శవం ఏ మాత్రం చెడి పోలేదు.అప్పుడే ప్రాణం పోయినట్టు ఉంది. ఇది ఎవరి శవమా అని ఆలోచిస్తూ అక్కడే

నిలబడ్డాను. ఒక ముహూర్త కాలానికి అక్కడికి ఒక దివ్యమైన విమానము వచ్చింది. ఆ విమానములో ఒక దేవతా పురుషుడు ఉన్నాడు. అతనిని అప్సరసలు సేవిస్తున్నారు. కొందరు పాటలు పాడుతున్నారు. కొందరు నృత్యం చేస్తున్నారు. కొందరు అప్సరసలు ఆ పురుషునికి చామరములు వీస్తున్నారు. ఇదంతా నేను చూస్తున్నాను.

ఇంతలో ఆపురుషుడు విమానం దిగి ఆ సరస్సు దగ్గరకు వచ్చాడు. ఆ శవమును భక్షిస్తున్నాడు. తనకు కావలసినంత మాంసమును తృప్తిగా తిన్న తరువాత ఆ పురుషుడు ఆ సరస్సులోకి దిగి నీరు తాగుతున్నాడు. తరువాత ఆ పురుషుడు విమానము దగ్గరకు వెళ్లి విమానము ఎక్కబోతున్నాడు. అత్యాశ్చకరమైన ఆ దృశ్యమును చూచిన నేను ఉండబట్టలేక ఆ పురుషుని వద్దకు పోయి ఇలా అడిగాడు. “నీవు ఎవరు? ఈ శవాన్ని ఎందుకు భక్షించావు. దీనికి కారణం ఏమైనా ఉందా! నీవు చూడబోతే దేవతామూర్తి వలె ఉన్నావు. కాని నిషిద్ధమైన ఆహారమును తిన్నావు. చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ శవము తినడానికి యోగ్యము అని నేను అనుకోడం లేదు. ఇందులో రహస్యము ఏమిటి? నాకు చెప్పగలవా!” అని అడిగాను.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము డెబ్బది ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

డెబ్బది ఎనిమిదవ సర్గ.

"రామా! నేను ఆ ప్రకారము అడుగగా, ఆ దివ్యపురుషుడు ఇలా అన్నాడు. "ఓ బ్రహ్మర్షీ! ఇది నా పూర్వ జీవితమునకు సంబంధించినది. నా తండ్రి పేరు సుదేవుడు. ఆయన విదర్భకు మహారాజు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఆ ఇద్దరికీ ఇద్దరు కుమారులు కలిగారు. నా పేరు శ్వేతుడు. నాకన్నా చిన్న వాడి పేరు సురథుడు. నా తండ్రి చనిపోయిన తరువాత నన్ను రాజును చేసారు. నేను ధర్మబద్ధంగా, జనరంజకంగా పరిపాలించాను.

ఒక సారి నాకు ఒక వింత కోరిక కలిగింది. నా ఆయుర్దా యము ఎంత. నేను ఎప్పుడు మరణిస్తాను అని తెలుసుకోవాలని అను కున్నాను. వెంటనే నా తమ్ముడు సురథుడిని రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసాను. నా మరణం గురించి తెలుసుకోడానికి ఈ అరణ్యములోకి వచ్చాను. తపస్సు చేసాను. మూడు వేల సంవత్సరములు గడిచాయి. నా తపస్సు ఫలితంగా నేను నా శరీరమును వదిలి, బ్రహ్మలోకమునకు వెళ్లాను. నా శరీరం ఈ సరస్సులో పడింది. నేను బ్రహ్మలోకములో ఉన్నా నాకు ఆకలి దప్పిక కలుగుతూనే ఉన్నాయి. నాకు దైవత్వము సిద్ధించలేదు. వెంటనే నేను బ్రహ్మదేవుని వద్దకు పోయి ఇలా అడిగాను.

"ఓ బ్రహ్మదేవా! ఈ లోకములో ఆకలి దప్పిక ఉండవు కదా. మరి నాకు ఆకలి వేస్తూ ఉంది. దాహం వేస్తూ ఉంది. ఎందువలన? నాకు

ఇక్కడ ఏమి ఆహారము దొరుకుతుంది. నేను ఏమి తినాలి. ఏమి తాగాలి. అసలు నాకు ఆకలి దప్పిక ఎందుకు కలుగుతున్నాయి." అని అడిగాడు.

దానికి బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. "ఈ లోకంలో ఆహారం ఉండదు. కాబట్టి నీ మాంసమే నీకు ఆహారము. దానినే నీవు భక్షించాలి. నీవు కూర్చుని తపస్సు చేసి నీ శరీరమును బాగా పెంచావు. నీవు దాన ధర్మములు చేయలేదు. కేవలం తపస్సు చేసావు. నీవు ఒకరికి పెడితే కదా నీకు ఆహారం లభించేది. నీవు ఒకరికి పెట్టలేదు. నీకు ఆహారం లభించదు. ఆ కారణం చేతనే నీకు ఆకలి దప్పులు కలుగుతున్నాయి. కాబట్టి నీవు నీ దేహమునే ఆహారముగా స్వీకరించు. అగస్త్య మహాముని నీవు ఉండు అరణ్యమునకు వస్తాడు. అప్పుడు నీకు ఈ బాధ తప్పుతుంది. ఎందుకంటే ఆ అగస్త్యుడు మహా ఋషి. దేవతలను కూడా తరింప జేస్తాడు. ఇంక నీ ఆకలి దప్పికలను నివారించలేడా!" అన్నాడు బ్రహ్మదేవుడు. ఆ రోజు నుండి బ్రహ్మదేవుని మాట ప్రకారము నేను ప్రతి రోజూ ఇక్కడకు వచ్చి నా శవమును ఆహారంగా తింటున్నాను. ఇన్ని సంవత్సరముల నుండి తింటున్నా ఈ శవము తరగడం లేదు. పైగా నాకు చాలా తృప్తిగా ఉంటూ ఉంది. నా బాధ తీర్చడానికి మీరు ఇక్కడకు వచ్చారు. తమరు కరుణించి నన్ను ఈదుస్థితి నుండి కాపాడండి. మీకు నేనుఏమీ ఇచ్చుకోలేను. ఈ ఆభరణమును స్వీకరించి నన్ను ధన్యుడిని చేయండి. ఇంకా మీకు కావాలంటే బంగారమును, ధనమును వస్త్రములను ఇస్తాను. నన్ను తరింపజేయండి." అని అన్నాడు.

నేను అతనిని తరింపజేయడానికి ఈ ఆభరణమును అతని వద్దనుండి స్వీకరించాను. నేను ఈ ఆభరణమును స్వీకరించిన వెంటనే అతని మనుష్యదేహమైన శవము నశించిపోయింది. అతడు స్వర్గమునకు వెళ్లిపోయాడు. అతడు నాకు ఇచ్చిన ఆభరణము ఇదే. ఇప్పుడు ఇది నీకు ఇస్తున్నాను." అని అన్నాడు అగస్త్యుడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము డెబ్బది ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

డెబ్బది తొమ్మిదవ సర్గ.

అగస్త్యుడు చెప్పిన వృత్తాంతమును విని రామునికి ఆశ్చర్యం కలిగింది. ఇటువంటి కథలు కూడా ఉంటాయా అని అనుకున్నాడు. కాని రామునికి మరొక అనుమానం కలిగింది. "ఓ మునీంద్రా! మీరు తపస్సు చేసుకుంటున్న వనము ఫలవృక్షములతోనూ, పూల మొక్కలతోనూ, వన్య మృగములతోనూ శోభిల్లుతూ ఉంది కదా మరి ఆ రాజర్షి తపస్సు చేసిన ప్రదేశములో ఒక్క చెట్టు లేదు మొక్క లేదు, ఒక్క పక్షిగానీ, జంతువు గానీ లేదు. ఎందు చేత?ఆ రాజు వృక్షమృగ,పక్షి శూన్యమైన చోట తపస్సు చేయాలని ఎందుకు అనుకున్నాడు." అని అడిగాడు. అగస్త్యుడు రామునితో ఇలా అన్నాడు.

"రామా! కృతయుగములో మనువు ఈ భూమిని పరిపాలించేవాడు. అతని కుమారుడు ఇక్ష్వాకువు. "ఈ భూమిలో రాజ వంశములనుస్థాపించు" అని చెప్పి మనువు ఇక్ష్వాకువును రాజును చేసాడు. అతని పేరుతో ఇక్ష్వాకు వంశము మొదలయింది. రాజ్యాధి కారము ఇచ్చిన తరువాత మనువు ఇక్ష్వాకువుతో ఇలా అన్నాడు. "రాజుకు దండనాధి కారము ఉండవలసినదే కానీ అకారణంగా ఎవరినీ దండించ కూడదు. అపరాధుల విషయంలో కూడా అతడు చేసిన తప్పుకు సరి అయిన దండన విధించవలెనే కానీ, క్రూరంగా దండించకూడదు. కాబట్టి నీవు దండనీతిని అనుసరించునపుడు చాలా అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే ధర్మం వర్ధిల్లుతుంది. నిన్ను ప్రజలు గౌరవిస్తారు." అని ఇక్ష్వాకువుకు రాజనీతిని దండనీతిని ఉపదేశించి, మనువు బ్రహ్మలోకమునకు వెళ్లిపోయాడు. అప్పుడు ఇక్ష్వాకువు తన వంశమును ఎలా వృద్ధిచేయ వలెనా అని ఆలోచించాడు.

తరువాత ఇక్ష్వాకువు నూర్గురు పుత్రులను కన్నాడు. ఆ నూర్గురిలో చిన్న వాడు పరమ మూర్ఖుడు. పెద్దల మాట వినేవాడు కాదు. దుర్మార్గుడు. చదువు మీద శ్రద్ధలేదు. వీడిని ఎవరో బాగా దండిస్తారు అని తెలుసుకున్న ఇక్ష్వాకువు వాడికి దండుడు అని పేరు సార్థకంచేసాడు.

వాడికి తగిన రాజ్యము కనపడలేదు. అందుకని ఇక్ష్వాకువు దండుని వింధ్యపర్వతప్రాంతములకు రాజును చేసాడు. ఆ దండుడు ఆ పర్వత ప్రాంతములో ఒక నగరమును ఏర్పాటు చేసుకొని రాజ్యపాలన చేస్తున్నాడు. ఆ నగరము పేరు మధుమంతము.

దండుని కుల గురువు శుక్రాచార్యుడు. ఆయనకు ఒకకుమార్తె ఉంది.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము డెబ్బది తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
ఎనుబదవ సర్గ.

దండుడు అనేక సంవత్సరములు రాజ్యపాలన చేసాడు. ఒకరోజు దండుడు తన గురువు శుక్రాచార్యుని ఇంటికి వెళ్లాడు. అక్కడ ఒకసుందరాంగిని చూచాడు. ఆమె శుక్రాచార్యుల వారి కుమార్తె అని దండునికి తెలియదు. ఆమెను మోహించాడు. దండుని మన్మధుడు ఆవహించాడు. మన్మథ బాణములతో పరవశుడయ్యాడు దండుడు. ఆ సుందరాంగిని చూచి ఇలా అడిగాడు.

"ఓ లలనా! నీవుఎవరు? ఇక్కడ ఎందుకుఉన్నావు? నీ తల్లితండ్రులు ఎవరు? నాకు నీ మీద మోహము కలిగింది. నా కోరిక తీర్చు." అని అడిగాడు. ఆ మాటలకు ఆ సుందరాంగి ఇలా బదులు చెప్పింది.

"రాజా! నేను నీ గురువు శుక్రాచార్యుని కుమార్తెను. నా పేరు అరజ. నేను ఈ ఆశ్రమములో ఉంటాను. నేను నీ గురువుగారి పుత్రికను.

నేను నా తండ్రి గారి సంరక్షణలో ఉన్నాను. నాకు ఇంకా పెళ్లి కాలేదు. నన్నుకోరడం తగదు. ఈ విషయం నా తండ్రికి తెలిస్తే నిన్ను శపిస్తాడు. అంతగా నా మీద నీకు కోరిక ఉంటే నీవు నా తండ్రిని అడిగి ఆయన ఒప్పుకుంటే నన్ను వివాహమాడి నీ కోరిక తీర్చుకో. అలా కాకుండా నన్ను బలవంతంగా అనుభవిస్తే నీకు పరాభవము తప్పదు. నా తండ్రి శుక్రాచార్యునకు కోపంవస్తే మూడులోకములను భస్మం చేస్తాడు. నీవు ఈ రాజ్యమునకు రాజువు. నీవు కోరితే నా తండ్రి తప్పకుండా నన్ను నీకు ఇచ్చి వివాహముచేస్తాడు. నా మాట విను."అని పరి పరి విధాల బతిమాలింది.

కాని మోహపరవశుడు, కామాతురుడు అయిన దండుడు ఆమె మాటలు వినలేదు. "ఓ లలనామణీ! నిన్ను చూచినప్పటినుండీ మన్మథుడు నన్ను కాల్చివేస్తున్నాడు. నేను ఇంక ఒక్క క్షణం కూడా తట్టుకోలేను. ఒక్కసారి నిన్ను అనుభవించిన తరువాత నేను చచ్చినా, నా సర్వస్వము నాశనం అయినా నాకు చింతలేదు. నేను నీ దాసుడిని నన్ను అనుగ్రహించు." అని బలవంతంగా ఆమెను ఆక్రమించుకున్నాడు. ఆమెను ఎంత వద్దని వారిస్తున్నా, ఆమెను బలవంతంగా అనుభవించాడు. తరువాత ఏమీ ఎరుగనట్టు తన నగరానికి వెళ్లిపోయాడు.

శుక్రాచార్యుని కుమార్తె అరజ ఏడుస్తూ తన తండ్రి శుక్రాచార్యుని రాక కోసం ఎదురుచూడసాగింది.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము ఎనుబదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

ఎనుబది ఒకటవ సర్గ.

శుక్రాచార్యుడు రాగానే అరజ జరిగినది అంతా తండ్రికి చెప్పింది. శుక్రాచార్యుడు కోపంతో మండిపడ్డాడు. "వీడు నా కుమార్తెనే అవమానిస్తాడా! వీడికి నాశనం అయ్యే కాలం దాపురించింది. వీడు ఘోరమైన అపరాధము చేసాడు. దానికి తగినఫలం అనుభవిస్తాడు. నేటి నుండి ఏడురోజుల లోపల ఈ దండుడు తన పుత్రుల సహితంగా, పరివార సమేతంగా నాశనం అవుతాడు. ఈ దండుని రాజ్యమునకు నూరు యోజనముల విస్తీర్ణములో ధూళిమేఘములు కమ్ముకొని సర్వనాశనం చేస్తాయి. ఒక్క మానవులే కాదు సమస్తజంతుజాలము కూడా పశుపక్ష్యాదులు కూడా, వృక్షములు కూడా ఆ ధూళిలో పడి మాడిపోతాయి. ఈ ప్రాంతము నిర్మానుష్యము అవుతుంది. ఈ దండుని రాజ్య సరిహద్దులదాకా ధూళిమేఘాలు కప్పివేస్తాయి." అని శపించాడు. వెంటనే తన శిష్యులను చూచి "మీ రందరూ దండుని రాజ్యము విడిచి వెళ్లండి. రాజ్యము సరిహద్దుల అవతల నివసించండి." అని అన్నాడు. శు క్రాచార్యుని మాట ప్రకారము శిష్యులు అందరూ ఆశ్రమం విడిచి వెళ్లిపోయారు.

శుక్రాచార్యుడు తన కుమార్తెను చూచి ఇలా అన్నాడు. "ఇందులో నీ దోషం కూడా ఉంది కాబట్టి నీవు ఈ ఆశ్రమము నందు యోగాభ్యాసము చేస్తూ ఇక్కడే ఉండు. నిన్ను ఆ ధూళిరేణువులు తాకవు. వాటి వలన నీకు ఏమీ భయము లేదు." అని అన్నాడు.

తరువాత శుక్రాచార్యులు దండుని రాజ్యము విడిచిపెట్టి వెళ్లిపోయాడు. శుక్రాచార్యుని శాపప్రభావము వలన దండుని రాజ్యము అతని పరివారము సహా ఏడురోజులలో సర్వనాశనం అయింది. అప్పటి నుండి వింధ్య పర్వతము శైవల పర్వతము మధ్య ఉన్న ఈ ప్రదేశము దండుని పేరు మీద దండకారణ్యము అని పిలువబడింది. ఇక్కడ మునులు నివసించే ప్రదేశమును జనస్థానము అని పిలుస్తారు. రామా! ఇదీ ఆ ప్రాంతచరిత్ర. సాయం సంధ్యకు వేళఅయింది. నీవు వెళ్లి సంధ్యోపాసన చేయుము." అని అన్నాడు అగస్త్యుడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము ఎనభై ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
ఎనభైరెండవ సర్గ.

రాముడు సంధ్యోపాసనకు పక్కనే ఉన్నసరస్సుకు వెళ్లాడు. సాయంసంధ్యాకార్యక్రమములు ముగించుకొని ఆశ్రమంలో ప్రవేశించాడు. ఆ రాత్రికి అక్కడే విశ్రాంతి తీసుకున్నాడు. మరునాడుఉదయమే వెళ్లి అగస్త్యునికి నమస్కరించి అయోధ్యకు వెళ్లడానికి అనుమతి కోరాడు. "రామా! నీవు ఏ క్లేశములు లేకుండా ధర్మబద్ధంగా రాజ్యమును పరిపాలించు." అని అన్నాడు. రాముడు అగస్త్యుని ఆశీర్వాదము తీసుకొని పుష్పక విమానము ఎక్కి అయోధ్యకు బయలు దేరాడు.

అయోధ్యలోదిగిన తరువాత పుష్పకమును పంపించి వేసాడు. తనమందిరమునకు వెళ్లాడు. ద్వారపాలకుని పిలిచి వెంటనే లక్ష్మణుని భరతుని తన వద్దకు తీసుకొని రమ్మని చెప్పాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము ఎనభై రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

ఎనభై మూడవ సర్గ.

రాముడు అయోధ్యకు వచ్చాడని ద్వారపాలకుని ద్వారా తెలుసుకున్న లక్ష్మణుడు భరతుడు వెంటనే రాముని వద్దకు వచ్చారు. రాముడు వారిని చూచి ఇలా అన్నాడు.

"నేను అధర్మమును ఆచరించుచున్న శంబూకుని చంపి బ్రాహ్మణ కుమారుని పునర్జీవితుని చేయగలిగాను. మీ ఇరువురిసాయంతో నేను రాజసూయ యాగమును చేయవలెనని అనుకుంటున్నాను. క్షత్రియులకు రాజసూయము చేయడం అత్యుత్తమమైన ధర్మము. పూర్వము మిత్రుడు రాజసూవయము చేసి వరుణత్వాన్ని పొందాడు. సోముడుకూడా రాజసూయము నిర్వహించి శాశ్వత కీర్తిని సంపాదించు కున్నాడు. కాని రాజసూయము చేయడం సామాన్యమైన పనికాదు. కాబట్టి మీరిరువురూ బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి." అని అన్నాడు రాముడు.

అప్పుడు భరతుడు రామునితో ఇలా అన్నాడు. "రామా! నీవు ధర్మస్వరూపుడవు. నీయందు ధర్మము,కీర్తి నిలిచి ఉంది. నీవు రాజులలో కెల్లా శ్రేష్టుడవు. లోకములకు నాధుడవు. ప్రజలను కన్నబిడ్డలవలె పాలించుచున్నావు. రాజసూయము వలన భూమి మీద ఉన్న రాజ్యములను అన్నిటినీ మనము జయించవలెను. అప్పుడు రక్తపాతము, జనక్షయము తప్పదు. క్షత్రియ వంశము నాశనమౌతుంది. అటువంటి రాజసూయమును నీవు ఎందుకు చేస్తావు. రాజసూయము చేస్తే ఎందరో రాజులు మనకు శత్రువులు అవుతారు. దాని వలన వినాశము సంభవిస్తుంది.

అయినా రామా! ఇప్పుడు నీ మాట కాదంటున్న వారు ఎవరు? అందరు రాజులూ నీ మాటమీరడం లేదు కదా. కొత్తగా రాజసూయం చేసి వారిని చంపడం ధర్మమా!" అని అన్నాడు భరతుడు. భరతుని మాటలు సమంజసంగా అనిపించాయి రామునికి. "భరతా! నీవు చక్కగా చెప్పావు. నీ మాటలు నాకు ఎంతో ఆనందం కలిగించాయి. ధర్మాన్ని చక్కగా, నిర్భయంగా చెప్పావు. రాజసూయం చేస్తే రాబోయే దుష్పరిణామాలను చక్కగా వివరించావు. నీ మాట ప్రకారము నేను రాజసూయ యాగము చేయవలెను అన్న సంకల్పాన్ని విరమించు కుంటున్నాను. నీవు చిన్న వాడి వైనా చక్కటి మాట చెప్పావు. నిన్ను నేను అభినందిస్తున్నాను." అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము ఎనభైమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

ఎనభై నాలుగవ సర్గ.

రాముడు రాజసూయ యాగము చేయడం లేదు అని తెలుసుకున్న లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు. “రామా! తమరు అనుకున్నట్టు రాజసూయము చేయడం లేదు కాబట్టి అశ్వమేధ యాగము చేయడం మంచిదేమో ఆలోచించండి. అశ్వమేధ యాగము పవిత్రమైనది సర్వ పాపములను హరిస్తుంది. నీకు ఇష్టం అయితే అశ్వమేధ యాగమును చేయవచ్చును. పూర్వము ఇంద్రుడు అశ్వమేధ యాగము చేసి తన బ్రహ్మహత్యాపాతకమును పోగొట్టుకున్నాడు కదా! ఆ కథ వివరిస్తాను.

రామా! పూర్వము వృత్రుడు అనే దైత్యుడు ఉండేవాడు. అతడు ధర్మాత్ముడు. మూడులోకములవారు అతనిని అభిమానించేవారు. అతనికి ధర్మములు బాగా తెలుసు కృతజ్ఞుడు. బుద్ధిమంతుడు. ఈ భూమిని అంతా ధర్మబద్ధంగా పరిపాలించాడు. అతని పాలనలో ప్రజలు సంతోషంగా జీవించేవారు. వానలు కురిసి పంటలు బాగా పండేవి. కరువుకాటకాలు ఉండేవి కావు.

ఈ ప్రాపంచిక సుఖముల కన్నా తపస్సు చేయడం శ్రేష్ఠమని అనుకున్నాడు వృత్రుడు. వెంటనే తన పెద్ద కుమారుడు మధురుడు అనే వాడికి రాజ్యము అప్పగించి తాను తపస్సుకు వెళ్లాడు. ఉగ్రమైన తపస్సు చేసాడు. ఎవరు తపస్సు చేసినా ముందు ఇంద్రుడికి అసూయ

కలుగుతుంది. అసూయతోపాటు తన పదవికి ఎక్కడ ముప్పు వస్తుందో అనే భయం కూడా కలిగింది ఇంద్రుడికి. వెంటనే ఇంద్రుడు విష్ణువు దగ్గరకు పరుగెత్తాడు.

"ఓ విష్ణూ! వృత్రుడు ఘోరమైన తపస్సు చేస్తున్నాడు. అతడు ముల్లోకములను జయించాడు. అతను నా మాట వినడం లేదు. అతనిని శాసించడం నా వల్ల కావడం లేదు. అతడు తన తపస్సును ఇలాగే కొనసాగిస్తే అతనికి ముల్లోకాధిపత్యము సిద్ధిస్తుంది. అప్పుడు నా గతేమిటి. నీవు మాత్రం చూచీచూడనట్టు ఉన్నావు. నీవే కనుక కోపగిస్తే వాడు ఇంత కాలము తపస్సు చేసేవాడు కాదు. నాకు తెలుసు. వృత్రుడు నీకు మిత్రుడు, భక్తుడు. అందుకనే అతనిని ఉపేక్షిస్తున్నావు. అందుకే అతడు మూడు లోకముల వారిచేత ఆదరింపబడుతున్నాడు. నన్ను అనుగ్రహించు. అతని తపస్సును ఆపుచెయ్యి. లేకపోతే అతనిని చంపు. వృత్రుడిని చంపి దేవలోకమునకు శాంతి ప్రసాదించు. దేవతలు అందరూ వృత్రాసుర సంహారము కొరకు ఎదురుచూస్తున్నారు. నీవు ఒక్కడివే ఈ పని చేయగల సమర్థుడివి. గతిలేని వాళ్లకు నీవే గతి కదా! కాబట్టి ఈ పని చేసి పెట్టి, దేవతలను ఉద్ధరించు." అని దీనంగా వేడుకున్నాడు ఇంద్రుడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము ఎనభై నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
ఎనభై ఐదవ సర్గ.

ఇంద్రుని మాటలు విన్న విష్ణువు ఇలా అన్నాడు. "మహేంద్రా! నాకూ వృత్రునికి స్నేహం ఉంది అని నీకు తెలుసు కదా! అందుకని నేను వృత్రుని చంపలేను. కానీ నీకు సాయం చెయ్యక తప్పడం లేదు. అందుకని వృత్రుని చంపడానికి సాయం చేస్తాను. నేను నా శక్తిని మూడు భాగములుగా విభజిస్తాను. ఒకటి మహేంద్రునిలోనూ, మరొక అంశ వజ్రాయుధములోనూ, మూడవ అంశ భూమిలోనూ నిక్షిప్తం చేస్తాను. అప్పుడు ఇంద్రుడు వృత్రుని చంపగలడు." అని అన్నాడు. ఆ మాటలకు దేవేంద్రుడు, దేవతలు సంతోషించారు. విష్ణువు తన తేజస్సును మహేంద్రునిలో ప్రవేశపెట్టాడు. అందరూ వృత్రుని చంపడానికి వెళ్లారు.

అప్పుడు వృత్రుడు ఒక మహారణ్యములో తపస్సు చేసుకుంటున్నాడు. అతని తేజస్సు ముల్లోకాలలో వెలిగిపోతూ ఉంది. ఇతనిని ఎలా చంపడమా అని దేవతలు మధనపడుతున్నారు. ఇంతలో దేవేంద్రుడు తన వజ్రాయుధమును రెండు చేతులతో పట్టుకొని ఒకే వేటుతో వృత్రుని తల నరికాడు. వృత్రుని తల తెగి కింద పడగానే భూమి కంపించింది. దేవేంద్రుడు కూడా భయంతో కంపించి పోయాడు. వెంటనే భూమి చివరి అంచుదాకా పరుగెట్టాడు. వృత్రుడు బ్రాహ్మణుడు. బ్రాహ్మణుని చంపితే వచ్చే బ్రహ్మహత్యాపాతకము ఇంద్రుని తరిమింది. ఇంద్రుడి అన్ని అవయవములలో ప్రవేశించింది. ఇంద్రుడు నిర్వీర్యుడు

అయ్యాడు. దు:ఖంతో కుచించుకుపోతున్నాడు ఇంద్రుడు.

వృత్రాసురుడు మరణించాడు. ఇంద్రుడు కనపడటం లేదు. దేవతలకు ఏమి చెయ్యాలో తోచలేదు. వృత్రాసురుడు మరణించినందుకు దేవతలు అందరూ విష్ణువును పూజించారు. మహేంద్రుడిని బ్రహ్మహత్యా పాతకము నుండి విడిపించమని విష్ణువును ప్రార్థించారు. అప్పుడు విష్ణువు తరుణోపాయము చెప్పాడు.

"ఇంద్రుడు అశ్వమేధయాగము చేసి నన్ను పూజిస్తే వెంటనే అతనికి బ్రహ్మహత్యాపాతకము నుండి విముక్తి కలుగుతుంది." అని వరం ఇచ్చాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము ఎనభై ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
ఎనభై ఆరవ సర్గ.

బ్రహ్మహత్యాపాతకము ఇంద్రుని శరీరం అంతా పాకిపోయింది. ఇంద్రునికి మూర్ఛవచ్చినట్టయింది. కింద పడి దొర్లుతున్నాడు. లోకపాలకుడు ఇంద్రుడు లేక పోవడం వల్ల వర్షాలు కురవడం లేదు. పంటలు ఎండిపోతున్నాయి. నదులలో, సరస్సులలో నీరు ఎండి పోయింది.

ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. అనావృష్టి సంభవించింది. దేవతలు అందరూ కలిసి ఇంద్రుని వద్దకు వెళ్లారు. ఇంద్రుడిని ముందు ఉంచుకొని అశ్వమేధ యాగము చేసారు. యజ్ఞముపూర్తి కాగానే బ్రహ్మహత్యా పాతకము ఇంద్రుని విడిచిపెట్టింది. “నేను ఎవరిని ఆవహించాలి.” అని అడిగింది. అప్పుడు దేవతలు ఇలా అన్నారు.

“ఓ బ్రహ్మహత్యాపాతకమా! నిన్ను నీవు నాలుగు భాగములుగా విభజించుకో! ఒక భాగము వర్షాకాలము నాలుగు మాసములు పవిత్ర పుణ్య నదీ జలములలో ఆవహించు. నీలో స్నానం చేసే వారి పాపములను తొలగించు. రెండవ అంశను ఎండి పోయి బీడు పడ్డ చవిటి నేలలలో ఆవహించు. వాటిని సస్యశ్యామలం చెయ్యి. మూడవ అంశను యౌవనవతులు, ప్రౌఢలు అయిన స్త్రీలలో వారి బహిష్టు మూడురోజులు ఆవహించు. ఆ మూడురోజులు వారిని ఏ దుష్ట గ్రహదోషములు, పీడలు లేకుండా కాపాడుతూ ఉండు. నాల్గవ అంశను ఏ పాపమూ ఎరుగని బ్రాహ్మణులను ఎవరు పీడించి చంపుతారో వాళ్లని ఆశ్రయించి వారిని తగు విధముగా శిక్షించు. ఈ విధంగా లోక కల్యాణము గావించు.” అని పలికారు దేవతలు. బ్రహ్మహత్యాపాతకము దానికి ఒప్పుకొని ఆ ప్రకారమే చేసింది. బ్రహ్మహత్యాపాతకము తొలగిపోగానే ఇంద్రుడు దేవతలతో స్వర్గానికి వెళ్లాడు. రామా! అశ్వమేధ యాగమ మహిమ అంత గొప్పది.” అని లక్ష్మణుడు రామునితో చెప్పాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము ఎనభై ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

ఎనభై ఏడవ సర్గ.

లక్ష్మణుడు చెప్పిన వృత్రాసురుని వృత్తాంతము విన్న రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. “లక్షణా! యదార్ధము చెప్పావు. అశ్వమేధ యాగ ఫలము చాలా గొప్పది. ఇదే కాదు. అశ్వమేధ యాగ మహిమను చెప్పే వృత్తాంతము మరొకటి ఉంది. పూర్వము కర్దమ ప్రజాపతి కుమారుడు ఇలుడు అనే వాడు వాహ్లి దేశమును పాలిస్తున్నాడు. అతడు ధర్మం తప్పకుండా ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలిస్తున్నాడు. దేవతలు, దైత్యులు, నాగులు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు అందరూ అతని ఎడల భయం భక్తి కలిగి ఉండేవారు. అతడు ఎంత దయకలవాడో అంత కోపిష్టి. కోపం వస్తే ప్రళయకాలరుద్రుడు అవుతాడు. అందుకని ఎవరూ తప్పుచేయడానికి భయపడేవారు.

ఒక సారి ఆయన వేటకు వెళ్లాడు. అలా వేటాడుతూ కుమారస్వామి జన్మస్థలమయిన కైలాస శిఖరమునకు వెళ్లాడు. అక్కడ మహాశివుడు, పార్వతితో కలిసి విహరిస్తున్నాడు. పార్వతీ పరమేశ్వరులు తమ కేళీవిలాసములలో భాగంగా శివుడు స్త్రీవేషం ధరించాడు. శివుడు ఎప్పుడు స్త్రీరూపం ధరించాడో పరిసరాలలో ఉన్న మృగములు, పక్షులు, అన్నీ స్త్రీరూపం ధరించాయి. ప్రతి వస్తువుకూ స్త్రీత్వము ఆవహించింది. ఇది తెలియని ఇలుడు, అతని పరివారమూ అక్కడకు వచ్చారు. ఆ ప్రదేశమునకు రాగానే ఇలుడు అతని పరివారమూ కూడా స్త్రీలుగా మారిపోయారు. అది శివుని మహిమ అని తెలుసుకొన్న ఇలుడు

పరమశివుని శరణు వేడాడు. ఇది వినిన శివునికి నవ్వు వచ్చింది. ఏదో తాను పార్వతిని సంతోషపెట్టడానికి స్త్రీరూపం ధరిస్తే ఈ విపరీతం జరిగినందుకు నవ్వాడు శివుడు. కాని ఒక సారి స్త్రీగా మారిన తరువాత అతనికి పురుషత్వము ఇవ్వడం సాధ్యం కాదు. అందుకని శివుడు ఇలునితో ఇలా అన్నాడు.

"రాజా! నీకు పురుషత్వం సిద్ధించడం తప్ప వేరు ఏవరం అయిన కోరుకో ఇస్తాను" అని అన్నాడు. ఇలుడు ఏవరమూ కోరలేదు. కాని పార్వతీదేవిని భక్తితో ప్రార్థించాడు. "అమ్మా! జగజ్జననీ! నా తప్పు ఏమీ లేకుండా నాకు స్త్రీత్వము సంప్రాప్తించింది. నన్ను కరుణించు." అని వేడుకున్నాడు. అయ్య కాదన్నా అమ్మ ఊరుకోదు కదా! "రాజా! శివుడు నిన్ను స్త్రీగా మార్చాడు. నేను ఆయనలో సగం కదా. అందుకని నీలో సగం భాగాన్ని పురుషుడిగా నేను మారుస్తాను. మరి ఎప్పుడు ఎలా ఉండాలో నీవే నిర్ణయించుకో." అని వరం ఇచ్చింది పార్వతి.

పార్వతి ఇచ్చిన వరానికి ఎంతో సంతోషించాడు ఇలుడు. "అమ్మా! నేను ఒక నెల స్త్రీగానూ, ఒక నెల పురుషుడుగానూ ఉండేట్టు వరం ప్రసాదించు." అని అడిగాడు.

పార్వతీ దేవి అలాగే అని వరం ఇచ్చింది."రాజా! నీవు స్త్రీగా ఉన్నప్పుడు నీవు పురుషుడవు అనే విషయం గుర్తుకు రాదు. అలాగే నీవు పురుషుడుగా ఉన్నప్పుడు నీవు స్త్రీవి అనే విషయం గుర్తుకు రాదు. లేకపోతే మనోవ్యధతో కుంగిపోతావు. ఈ పద్ధతి నీకే కాదు నీ పరివారము

అందరికీ వర్తిస్తుంది" అని మరొక వరం కూడా ప్రసాదించింది పార్వతీదేవి.

ఆ ప్రకారంగా ఇలుడు,అతని పరి వారము ఒకమాసము పురుషులు గానూ, మరొక మాసము స్త్రీలు గానూ కాలం గడిపారు. ఇలుడు ఒక నెల ఇలమహారాజుగా, మరొక మాసము ఇలాదేవిగా కాలంగడిపాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము ఎనభైఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓంతత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

ఎనభై ఎనిమిదవ సర్గ.

రాముడు చెబుతున్న కథను లక్ష్మణుడు భరతుడు ఆశ్చర్యంగా వింటున్నారు. "లక్ష్మణా! భరతా! ఇలుడు అతని పరివారము స్త్రీలుగా మారి పోయారు అని చెప్పాను కదా! స్త్రీగా ఉన్న మొదటి మాసము ఇలాదేవి, తనతోపాటు స్త్రీలుగా మారిపోయిన పరివారముతో గడిపింది. తరువాత ఇలమహారాజుగా ఉన్నప్పుడు పురుషులుగా మారిన తన పరివారముతో గడిపింది. ఒక సారి, ఇలాదేవిగా ఉన్నప్పుడు ఆమె తన పరివారముతో విహరిస్తూ ఉండగా, ఒక సరస్సులో తపస్సు చేసుకుంటున్న బుధుడిని చూచింది. అప్పుడు బుధుడు మంచి యవ్వనంలో ఉన్నాడు.

పూర్ణచంద్రుని మాదిరి ప్రకాశిస్తున్న బుధుని చూచిన ఇలాదేవి మోహంలో పడిపోయింది. ఇలాదేవి ఆ సరస్సులోకి దిగి జలకాలాట ఆడింది. ఆమెను చూచిన బుద్ధుడు కూడా ఆమెను మోహించాడు.

"ఆహా! ఈమె ఎవరు? లోకోత్తరసౌందర్యముతో ప్రకాశిస్తూ ఉంది. ఆమెను చూచి నా మనసు పరవశించి పోయింది. దేవతలలో గానీ, గంధర్వులలోగానీ, అప్సరసలలో గానీ ఇంతటి సౌందర్యవతిని చూడలేదు. ఈమెకు వివాహము కాకపోతే నేను ఈమెను నాదానిగా చేసుకుంటాను." అని అనుకున్నాడు బుధుడు. వెంటనే నీటిలోనుండి బయటకు వచ్చాడు బుధుడు.

ఇలాదేవి వెంట ఉన్న స్త్రీల వద్దకు పోయి "ఈమె ఎవరు. మీరు ఎవరు" అని అడిగాడు. "ఈమె మాకు మహారాణి. మేము ఈమెకు చెలులము. ఈమెకు ఇంకా వివాహము కాలేదు. మేమంతా అరణ్యములలో వినోదంగా విహరిస్తున్నాము." అని అన్నారు. కాని బుధునికి నమ్మకము కుదరలేదు. ఆయన తన దివ్యదృష్టితో చూచాడు. అసలు విషయం తెలుసుకున్నాడు. వారంతా విధివశాత్తు స్త్రీలుగా మారిన పురుషులు అని తెలుసుకున్నాడు. వారితో ఇలా అన్నాడు.

"మీరందరూ కింపురుషీలుగా పిలువబడతారు. ఈ పక్కనే ఉన్న పర్వతము మీద నివాసం ఉండండి. మీకు కింపురుషులు అనే వాళ్లు భర్తలుగా దొరుకుతారు." అని అన్నాడు.

బుధుని మాటలతో వారందరూ కిపురుషీలుగా మారిపోయారు. అందరూ ఆ పర్వతము మీదికి వెళ్లారు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము ఎనభైఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
ఎనభైతొమ్మిదవ సర్గ.

రాముడు ఇలాదేవి కథను ఇలా చెప్ప సాగాడు. "తరువాత ఒక నాడు బుధుడు ఇలాదేవితోనూ ఆమె పరివారముతోనూ నవ్వుతూ ఇలా అన్నాడు. "నేను చంద్రుని కుమారుడను. నా పేరు బుధుడు. నాకు ఇలా దేవిమీద మోహము కలిగినది. నా ప్రేమను అంగీకరించు." అని అన్నాడు. అప్పుడు ఇలాదేవి అతనితో ఇలా అంది. "మేము ఇక్కడ స్వేచ్ఛగా విహరిస్తున్నాము. నేను కూడా నిన్ను చూచి మోహించాను. నీవు ఎలా చెబితే అలా చేస్తాను." అని పలికింది ఇలాదేవి. తరువాత బుధుడు, ఇలాదేవి ఆ వనములో స్వేచ్ఛగా విహరించారు. కామకేళీవిలాసములలో తేలియాడారు. అలా ఒక నెల గడిచిపోయింది.

నెల గడిచిన మరునాడు సూర్యోదయమునకు పూర్వమే నిద్రలేచిన బుధుడు తపస్సుకు వెళ్లిపోయాడు. మాసము గడిచిపోగానే ఇలా దేవి ఇల మహారాజుగా నిద్రలేచాడు. ఇలమహారాజు సరస్సులో ఏ

ఆధారమూ లేకుండా నీటి మీద నిలబడి తపస్సుచేస్తున్న బుధుడిని చూచాడు. ఇలమహారాజుకు ఏమీ గుర్తు లేదు. బుధుడిని చూచి ఇలా అన్నాడు. "మహాత్మా! నేను నా పరివారము వేటకు వచ్చాము. దారి తప్పాము. నా పరివారము కనిపించడం లేదు. మీరు చూచారా!" అని అడిగాడు. ఇలమహారాజుకు ఏమీ గుర్తులేదు అని తెలుసుకున్నాడు బుధుడు.

"రాజా! పెద్ద వాన వచ్చింది. ఆ వానకు తట్టుకోలేక నీ వారందరూ మరణించారు. నీవు మాత్రము మిగిలావు. నీవు నా ఆశ్రమంలో నిద్రపోయావు. అందుకే బతికావు. నీవు ఇక్కడే నాతోపాటు ఉండు." అని అన్నాడు బుధుడు. దానికి ఇల మహారాజు సమ్మతించలేదు. "నా పరివారము లేని చోట నేను ఉండలేను. నేను వెంటనే నా నగరానికి పోతాను." అని అన్నాడు. కాని బుధుడు అతనిని బలవంతం చేసాడు. "నీవుఒక్క సంవత్సరము ఇక్కడ ఉంటే నీకు మేలుఅవుతుంది." అని అన్నాడు. చేసేది లేక ఇలమహారాజు అక్కడ ఉండటానికి నిశ్చయించు కున్నాడు. తరువాత స్త్రీగా ఉన్న మాసము రోజులు బుధుడు, ఇలాదేవి కామక్రీడలలో తేలియాడుతున్నారు, పురుషుడు గా ఉన్న మాసము రోజులు విడిగా ఉంటున్నారు. ఇలాదేవికి బుధునికి ఒక కుమారుడు కలిగాడు అతని పేరే పురూరవసుడు. ఇలాదేవి తన పుత్రుడు పురూరవసుని బుధునికి అప్పగించింది." అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము ఎనభైతొమ్మిదవ సర్గ. సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్ .

ఉత్తర కాండము

తొంభయ్యవ సర్గ.

ఇలుడి కథ వింటుంటే లక్ష్మణునికి భరతునికి ఆశ్చర్యం కలుగుతూ ఉంది. ఉత్సాహంగా కుతూహలంగా వింటున్నారు. "రామా! ఇలుడు బుధుని వద్ద ఒక సంవత్సరము ఉన్నాడు కదా! తరువాత ఏమి జరిగింది." అని అడిగారు.

"సంవత్సరము తరువాత ఇలుడు తన పురుషత్వాన్ని పొందాడు. తరువాత బుధుడు సంవర్తునిడిని, చ్యవనుడిని, అరిష్టనేమిని,దుర్వాసుని మొదలగు మహామునులను పిలిపించాడు. వారితో ఇలా అన్నాడు. "మహామునులారా! ఈయన కర్దమ ప్రజాపతి పుత్రుడైన ఇలుడు. ఈయన విషయంలో ఒక విపరీతము జరిగింది."అని చెబుతూ ఉండగానే కర్దముడు కొంతమంది బ్రాహ్మణులతో కలిసి అక్కడకు వచ్చాడు. కర్దమునితో పాటు పులస్త్యుడు, క్రతువు, వషట్కారుడు, ఓంకారుడు కూడా అక్కడకు వచ్చారు.

కర్దముడు వారితో ఇలా అన్నాడు. "నేను చెప్పేది వినండి. ఈ రాజుకు ఏది హితమో అది చేయండి. దీనికంతటికీ కారణము శివుడు. శివునికి అశ్వమేధ యాగము ప్రీతి పాత్రమైనది. అందుకని ఇలారాజు క్షేమముకోరి మనం అందరం అశ్వమేధ యజ్ఞము నిర్వహిద్దాము." అని అన్నాడు కర్దముడు. కర్దముని సంకల్పానికి అందరూ అంగీకరించారు. సంవర్తనుని శిష్యుడు అయిన మరుత్తు ఆ యజ్ఞానికి కావాల్సిన ఏర్పాట్లు

చేసారు. బుధుని ఆశ్రమము దగ్గర అశ్వమేధయాగము చేసారు. ఆ యాగమునకు రుద్రుడు వచ్చి హవిర్భాగములనుస్వీకరించాడు. అప్పుడు రుద్రుడు ఇలా అన్నాడు. “ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ అశ్వమేధ యాగము చేసి నన్ను తృప్తిపరిచారు. నేను ఇలునికి ఏమి చెయ్యాలో చెప్పండి.” అని అడిగాడు. “మహాదేవా! ఇలుడు తమ దగ్గరకు రాక ముందు పురుషుడు. మీ దగ్గరకు వచ్చిన తరువాత స్త్రీగా మారిపోయాడు. తరువాత పార్వతీ దేవి వరము వలన మాసము స్త్రీగానూ, మాసము పురుషుడు గానూ మారుతున్నాడు. తమరు దయయుంచి ఇలుని పూర్ణపురుషుడుగా మార్చండి.” అని వేడుకున్నాడు.

పరమశివుడు ఇలునికి సంపూర్ణ పురుషత్వము ఇచ్చి కైలాసము వెళ్లిపోయాడు. తరువాత యాగ నిర్వహణమునకు వచ్చి బ్రాహ్మణులు కూడా ఎవరి ఆశ్రమములకు వారు వెళ్లారు. తరువాత ఇలుడు తన పూర్వ రాజధాని బాహ్లిక దేశమును తన కుమారుడు శశబిందువుకు వదిలిపెట్టాడు. తను ప్రతిష్ఠాన పురము అనే కొత్త రాజధానిని ఏర్పాటుచేసుకున్నాడు. తండ్రి ప్రతిష్ఠానమును, కుమారుడు బాహ్లికదేశమును పరిపాలిస్తున్నారు.

కొంత కాలము తరువాత ఇలుడు రాజ్యాధి కారమును తనకుమారుడు పురూరవునికి అప్పగించి తాను బ్రహ్మలోకమునకు వెళ్లిపోయాడు. ఇలుడు, బుధుని పుత్రుడైన పురూరవసుడు ప్రతిష్ఠానపురమునకు రాజయ్యాడు.

లక్ష్మణా! అశ్వమేధయాగమునకు అంతటి మహత్తు ఉంది.” అని రాముడు అశ్వమేధయాగ మహిమను తన తమ్ములు లక్ష్మణుడు, భరతునికి వివరించాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము తొంబదియవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
తొంబది ఒకటవ సర్గ.

రాముడు అశ్వమేధ యాగము చేయడానికి నిర్ణయం జరిగింది. దానికి చేయవలసిన ఏర్పాట్లు గురించి రాముడు, లక్ష్మణుడు, భరతునితో చర్చించాడు. “లక్ష్మణా! నీవు మన కుల గురువు వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, ఇంకా ఇతర బ్రాహ్మణులను పిలిపించి వారితో అశ్వమేధ యాగము నిర్వహణ గురించి చర్చించు. కావలసిన ఏర్పాట్లు చెయ్యి. ఒక ఉత్తమ అశ్వమును మనము వదలవలసి ఉంటుంది. ఆకార్యక్రమమునకు మంచి ముహూర్తము నిర్ణయించమని వసిష్ఠుల వారికి చెప్పు.” అని అన్నాడు.

వెంటనే లక్ష్మణుడు ఆ ఏర్పాట్లు చేసాడు. రాముడు చెప్పిన బ్రాహ్మణోత్తముల నందరినీ రావించాడు. రాముడు వారందరి పాదములకు నమస్కరించాడు. వారు రాముని ఆశీర్వదించారు.

రాముడు తాను అశ్వమేధ యాగము చేయదలచుకున్నానని వారితో అన్నాడు. రాముని సంకల్పమును వారందరూ శ్లాఘించారు. బ్రాహ్మణులందరికీ వారు వారు చేయదగిన పనులను అప్పచెప్పాడు రాముడు. సుగ్రీవునికి ఆహ్వానము పంపమని లక్ష్మణునికి చెప్పాడు.

"లక్ష్మణా! నీవు సుగ్రీవునికి, వానర నాయకులకు అశ్వమేధ యాగమునకు రమ్మని వేరువేరుగా ఆహ్వానములను పంపించు. విభీషణుడికి, ఇతర రాక్షస వీరులకు అశ్వమేధ యాగమునకు రమ్మని ఆహ్వానము పంపించు. మనకు సామంత రాజులైన వారందరికీ ఆహ్వానాలు పంపించు. దేశదేశములలో ఉన్న ఉత్తములైన బ్రాహ్మణులకు వేదపండితులకు ఆహ్వానాలు పంపించు. మనదేశములో ఉండి, తమ పనుల మీద ఇతర దేశములకు వెళ్లిన బ్రాహ్మణులకు కూడా ఆహ్వానాలు పంపించు. ఇంకా నటులను, నర్తకులను ఆహ్వానించు.

మనము ఈ యజ్ఞమును పవిత్రమైన నైమిశారణ్యములో చేసెదము. అక్క గోమతీ నదీ తీరంలో ఒక పెద్ద యజ్ఞశాల నిర్మించు. ఆ యజ్ఞశాలలో వందలకొద్దీ ఆహూతులు కూర్చుని యజ్ఞమును తిలకించుటకు ఏర్పాట్లు చేయించు. వచ్చిన వారందరికీ తగిన మర్యాదలు చేయడానికి ఏర్పాట్లు చేయించు. మంచి బియ్యమును ఒక లక్ష వాహనములలోనూ, తిలలు, పెసలు, శెనగలు ఇంకా ఇతరములైన తృణధాన్యములను, తైలములను, సుగంధ ద్రవ్యములను సమృద్ధిగా యజ్ఞశాలకు తరలించు. వెండి, బంగారు నాణెములను నూరు కోట్లు బండ్లమీద యజ్ఞశాలకు తరలించు. వాటికి రక్షణగా భరతుడు వెళ్తాడు.

యజ్ఞము జరిగే చోట అంగళ్లను తెరవడానికి వర్తకులను, వండి వార్చడానికి వంటవాళ్లను, వినోదము అందించడానికి నర్తకులను గాయకులను, వార కాంతలను తరలించండి. ఈ ఏర్పాట్లు భరతుడు స్వయంగా పర్యవేక్షిస్తాడు.

పౌరసంఘముఖ్యులను, కార్యనిర్వాహకులను, పర్యవేక్షకులను, ధనాగారముల అధ్యక్షులను, ఇతర ఉద్యోగులను, అంత:పుర కాంతలను, మన తల్లులను, నా భార్య సీత యొక్క బంగారు ప్రతిమను, వీరందరినీ తీసుకొని భరతుడు ముందుగా యజ్ఞశాలకు చేరుకుంటాడు. యజ్ఞవాటిక దగ్గర ఆహూతులైన బ్రాహ్మణులకు, వివిధ దేశాధీశులకు వసతి, భోజన సదుపాయములు సమకూర్చండి." అని రాముడు లక్ష్మణునికి భరతునికి తగిన ఆదేశాలు ఇచ్చాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము తొంబై ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
తొంబై రెండవ సర్గ.

అశ్వమేధ యాగమునకు కావలసిన ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఒక సుముహూర్తమున యాగాశ్వమును వదిలారు. యాగాశ్వము వెంట లక్ష్మణుడు పరిమిత సైన్యముతోనూ ఋత్విక్కుల

తోనూ వెళ్లాడు. రాముడు నైమిశారణ్యములో ఏర్పాటుచేయబడిన యజ్ఞవాటిక వద్దకు వచ్చాడు. అక్కడ యజ్ఞవాటిక నిర్మాణమును, ఏర్పాట్లను చూచి తన సంతృప్తిని వ్యక్తంచేసాడు.

రాజులందరూ ఒకరొక్కరుగా యజ్ఞవాటిక వద్దకు చేరుకుంటున్నారు. అందరికన్నా ముందుగా శత్రుఘ్నుడు వచ్చాడు. అన్న భరతునికి సాయంగా ఉన్నాడు. వచ్చిన రాజులందరూ తెచ్చిన కానుకలను స్వీకరిస్తున్నాడు రాముడు. వచ్చిన రాజులందరికీ భరతుడు, శత్రుఘ్నుడు భోజన, వసతి ఏర్పాట్లను చేస్తున్నారు. సుగ్రీవుడు మొదలగు వానర వీరులు కిష్కింధనుండి వచ్చారు. వారు కూడా యజ్ఞము పనులలో పాలుపంచుకుంటున్నారు. లంకా నగరము నుండి విభీషణుడు తన రాక్షస వీరులతో వచ్చాడు. విభీషణుడు యజ్ఞమునకు వచ్చిన బ్రాహ్మణులను భక్తితో సేవిస్తున్నాడు. వారికి కావలసిన అవసరములను తీరుస్తున్నాడు.

లక్ష్మణునిచేత రక్షింపబడుతున్న యాగాశ్వము తన సంచారమును ముగించుకొని యజ్ఞవాటికకు తిరిగి వచ్చింది. ఆ యజ్ఞములో యాచకులకు ఇంక చాలు అన్నదాకా అన్నం పెడుతున్నారు. ధనము బహూకరిస్తున్నారు. "అడిగినవారికి అడిగినంత ఇవ్వండి" అన్న మాట తప్ప "ఇంకలేదు" అన్న పదమే వినపడటం లేదు. యజ్ఞమునకు వచ్చిన వారందరికీ తృప్తిగా భోజనములు వడ్డించబడ్డాయి. యజ్ఞమునకు వచ్చిన వారు ఇది కావాలి అని అడగకముందే వారు కోరినవి సమకూర్చబడుతున్నాయి. ఆ యజ్ఞములో తృప్తి చెందని వాడు

ఎవడూ లేడు అంటే అతిశయోక్తి లేదు. ఆ యజ్ఞమునకు వచ్చిన మునులు, ఋషులు, బ్రాహ్మణులు నోటి వెంట "ఇటువంటి యజ్ఞమును మేము ఇంతవరకూ చూడలేదు" అన్నమాటే వినబడుతూ ఉంది. యాచకులకు ఆహూతులకు ఎన్ని కానుకలు, బహుమానములు ఇచ్చినా ఇంకా ఇవ్వవలసిన బంగారు నాణెములు, వస్త్రములు రాసులు రాసులుగా కనపడుతున్నాయి. వానరులు, రాక్షసులు ఎక్కడ చూచినా సిద్ధంగా నిలిచి ఉండి యజ్ఞమునకు వచ్చిన వారి సేవలలో నిమగ్నమై ఉన్నారు. ఈ విధంగా ఒక సంవత్సరము పాటు ఆ యజ్ఞము సాగింది.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము తొంభై రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

తొంభై మూడవ సర్గ.

రాముడు చేస్తున్న అశ్వమేధ యాగానికి వాల్మీకి తన శిష్యులతో సహా వచ్చాడు. వాల్మీకి తన శిష్యులతో సహా ఉండటానికి ఋషులు ఋత్విక్కులు ఉండేచోట ఒక పర్ణశాలను నిర్మించారు. ఆయన పర్ణశాలలో మధురమైన ఫలములు, శాకాహారములు సమకూర్చారు. రాముడు వాల్మీకికి నమస్కరించి ఆయన ఆశీర్వాదము తీసుకున్నాడు. వాల్మీకి శిష్యులైన కుశలవులు కూడా ఆయన వెంట వచ్చారు.

వాల్మీకి కుశలవులను చూచి ఇలాఅన్నాడు. “మీరు ఇద్దరూ నేను మీకు నేర్పించిన రామాయణ కావ్యమును, ఋషులు, బ్రాహ్మణులు నివసించే చోట మృదుమధురంగా గానం చెయ్యండి. గృహముల ముందు, నాలుగు వీధులు కలిసే చోట, రాజుల నివాసములలో గానం చేయండి. ముఖ్యంగా అశ్వమేధ యాగము జరిగేచోట, ఋత్విక్కుల ఎదుట, రాముని ఎదుట గానం చేయండి.

మీ వెంట మీరు తినడానికి ఫలములను తీసుకొని వెళ్లండి. ఎవరు ఏమి ఇచ్చినా తీసుకోకండి. రాజుగారు అయిన రాముడు మిమ్ములను రామాయణ కావ్యము గానం చేయడానికి పిలిపిస్తే వెళ్లండి. ఆయన ఎదుట ఋత్విక్కుల ఎదుట రామాయణ కావ్యమును గానం చేయండి. రోజుకు ఇరవై సర్గలు మాత్రమే గానంచేయండి. ఎవరైనా ధనం ఇస్తే తీసుకోకండి. వనములలో నివసించే మునులకు ధనముతో పనిలేదుకదా!

మీ గానమును విన్న రాముడు, మీ తల్లి తండ్రుల గురించి గానీ, కులగోత్రముల గురించి గానీ అడిగితే మేము వాల్మీకి శిష్యులము అని మాత్రమే చెప్పండి. మీరు ఎవరికీ భయపడవద్దు. నిర్భయంగా రామాయణ కావ్యమును శృతి లయ బద్ధంగా గానం చేయండి.

రాజు అడిగితే గానం చేయను అని చెప్పకండి. రాజు మనలకందరికీ తండ్రి వంటి వాడు. మీకు కూడా తండ్రి వంటి వాడు. ఆయనను నిరాదరించవద్దు. మీ రామాయణ కావ్య గానమును రేపు

ఉదయమునుండి మొదలు పెట్టండి.” అని లవకుశులకు చెప్పాడు వాల్మీకి.

సీతామాత పుత్రులయిన కుశలవులు వాల్మీకికి నమస్కరించి తమరు చెప్పినట్లే చేస్తాము అని మాట ఇచ్చారు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము తొంభైమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓంతత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

తొంభైనాలుగవ సర్గ.

మరునాడు రాముడు సభామంటపంలో కూర్చుని ఉన్నాడు. ఆ సభకు అనేక మంది వచ్చారు. మహామునులు, రాజులు, పండితులు, పౌరసంఘముల అధ్యక్షులు, విద్యావేత్తలైన బ్రాహ్మణులు, సంగీతజ్ఞానము కల వాళ్లు, సంగీతము మీద ఆసక్తి కలవాళ్లు, గాంధర్వ శాస్త్రములో నిష్ణాతులైన వాళ్లు, ఛందోబద్ధంగా కవిత్వము చెప్పగలిగిన వాళ్లు, స్వరజ్ఞానముకలవాళ్లు, జ్యోతిష శాస్త్రములోనూ, అలంకార శాస్త్రములోనూ నిపుణులు, కావ్యరచనలో దిట్టలు, బహుభాషాప్రవీణులు, మనస్తత్వ శాస్త్రవేత్తలు, వర్తకులు, లౌకికులు, న్యాయశాస్త్ర ప్రవీణులు, ఇతర శాస్త్రములయందు జ్ఞానము సముపార్జించినవారు, పురాణములు చదివిన వారు, వేదపండితులు, చిత్రకళలో ప్రావీణ్యులు, నృత్య,గానముల

యందు ఆసక్తి ఉన్న వారు, నీతి శాస్త్ర వేత్తలు, వేదాంత అర్థములను విశదీకరించి చెప్పగలిగిన నిష్ణాతులు, ఇంకా ఇతర మేధావులు ఆ సభను అలంకరించి ఉన్నారు. కుశలవుల రామాయణ కావ్య గానాన్ని నిండు సభలో రాముడు విన్నాడు. ఆ చిన్ని బాలలు ఇద్దరూ సంగీతబద్దంగా పాడుతున్న గానాన్ని విని ముగ్ధుడయ్యాడు రాముడు. వీణలు వాయిస్తూ కుశలవులు సంగీత ప్రమాణములు తప్పకుండా పాడుతుంటే రాముడు చాలా కుతూహలంగా విన్నాడు. ఆ సభలోని వివిధశాస్త్రములలో నిష్ణాతులందరూ కుశలవుల గానానికి ముగ్ధులయ్యారు. ఎంత సేపు విన్నా వారికి తృప్తి కలగడం లేదు.

కాని ఆ సభలో ఉన్న వారందరికీ ఒకే ఒక విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంది. కుశలవులు ఇద్దరూ అచ్చు రాముని ప్రతిబింబముల మాదిరి ఉన్నారు. కుశలవులు నారబట్టలు జటాజూటములు ధరించక పోతే అచ్చం రాముని మాదిరే ఉన్నారు. రామునికి ఆ బాలురకు ఏమీ భేదము కనిపించడం లేదు. అది ఎలా సాధ్యం అన్నది వారి మనసులో మెదులుతున్న ప్రశ్న.

ఇంతలో రామాయణకథాగానంలో మొదటి ఇరవైసర్గలు పూర్తి అయ్యాయి. వాల్మీకి చెప్పినట్టు ఇరవై సర్గలు పూర్తి కాగానే కుశలవులు రామాయణ కావ్యము గానం చేయడం ఆపారు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. రాముడు లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. “లక్ష్మణా! ఈ ముని కుమారులకు 18,000 బంగారు నాణెములు, ఇంకా వారికి ఏమి కావాలంటే దానిని వారికి ఇమ్ము.” అని ఆదేశించాడు.

రాముని ఆదేశము ప్రకారము లక్ష్మణుడు వారికి బంగారు నాణెములు వారికి ఇచ్చాడు. కాని వారు తీసుకోలేదు. "మేము మునికుమారులకు. అడవులలో కందమూలములు తినువారము. మాకు ఈ బంగారము ఎందుకు. దీనితో మేము ఏమి చేసుకుంటాము." అని అన్నాడు. బంగారము ఇస్తుంటే వద్దనే వాళ్లను చూచి రాముడు, సభాసదులు ఆశ్చర్యపోయారు. రాముడు కుశలవులనుచూచి ఇలా అన్నాడు.

"బాలలూ! మీరుఎవ్వరు? ఈ కావ్యమును ఎవరు రచించారు? ఆయన ఎక్కడ ఉంటాడు? ఆయన దేశము ఏది?" అని అడిగాడు. కుశలవులు రామునికి ఈ విధంగా సమాధానం ఇచ్చారు.

"రాజా! ఈ కావ్యమును రాసిన వారు వాల్మీకి మహర్షి. ఈ యజ్ఞమునకు వారు కూడా వచ్చారు. ఇది తమరి యొక్క కథ. దీనిని వాల్మీకి మహర్షి 24,000 శ్లోకములలో రచించాడు. ఇందులో నూరు ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఈ రామాయణ కావ్యంలో ఐదు కాండములు ఉన్నాయి. ఉత్తర కాండతో సహా ఆరు కాండములు ఉన్నాయి. ఈ ఆరు కాండములలో 500 సర్గలు ఉన్నాయి. ఈ కావ్యమునకు నాయకుడు రాముడు. అంటే మీరు. మీ జీవితము ఎంతవరకు ఉందో అంతవరకుఉన్న కథ ఈ రామాయణ కావ్యంలో రాయబడింది. తమరికి వినవలెనని కోరిక ఉంటే ఈ యజ్ఞము జరుగుతున్న సమయంలో తమ్ములతో సహా ఈ రామాయణ కావ్యమును సభాసదులందరితో కలిసి వినండి. మేము గానం చేయడానికి సిద్ధంగా ఉన్నాము." అని అన్నారు.

దానికి రాముడు సమ్మతించాడు. సాయంత్రం కావడంతో కుశలవులు వాల్మీకి వద్దకు వెళ్లారు. రాముడు కూడా యజ్ఞశాలకు వెళ్లాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము తొంభైనాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓంతత్సత్

ఉత్తర కాండము
తొంభై ఐదవ సర్గ.

ఆ ప్రకారంగా రాముడు సభాసదులతో కలిసి రామాయణ కావ్యగానాన్ని చాలారోజులు విన్నాడు. కుశలవుల ముఖకళవళికలను బట్టి, వారి రూపములను బట్టి వారు తాను వాల్మీకి మహర్షి ఆశ్రమ ప్రాంతంలో విడిచి రమ్మన్న సీతకు జన్మించిన కుమారులు అని గ్రహించాడు రాముడు. ఒక రోజు సభామధ్యలో కూర్చుని ఇరువురి దూతలను పిలిపించాడు. వారితో ఇలా అన్నాడు. “మీరు వాల్మీకి మహర్షి వద్దకు వెళ్లండి. ఆయన వద్ద నా భార్య సీత ఉంది. మీరు వాల్మీకి మహర్షితో ఇలా చెప్పండి.

“నా భార్య సీత ఏ పాపము ఎరుగనిది ఐతే, ఆమె పరిశుద్ధమైన ప్రవర్తన కలది ఐతే, వాల్మీకి మహర్షితో కలిసి సీత ఇక్కడికి వచ్చి తన పరిశుద్ధత్వమును నిరూపించుకోవాలి. అప్పుడు నేను ఆమెను తిరిగి నా

వద్దకు స్వీకరిస్తాను." అని చెప్పండి.

వాల్మీకి అభిప్రాయమును, సీతయొక్క మనస్సులో ఉన్న భావాన్ని తెలుసుకొని వచ్చి నాకు చెప్పండి. సీత ఒప్పుకుంటే, రేపు ఉదయము ఈ సభాపరిషత్తు మధ్యలో నిలబడిసీత తన నిర్దోషిత్వాన్ని నిరూపిస్తూ ప్రతిజ్ఞ చేయాలి." అని అన్నాడు రాముడు.

రాముని మాటలను ఆశ్చర్యంతో విన్నారు సభాసదులు. వెంటనే ఆ దూతలు వాల్మీకి వద్దకు వెళ్లారు. రాముడి మాటలను యధాతథంగా వాల్మీకి మహర్షితో చెప్పారు. ఆ మాటలను విన్నాడు వాల్మీకి. రాముని హృదయంలో మెదులుతున్న భావాన్ని గ్రహించాడు. ఆ దూతలతో ఇలా అన్నాడు. "దూతలారా! రామునితో నా మాటగా చెప్పండి. స్త్రీకి పతియే దైవము. అందుకని సీత రాముడు చెప్పినట్టు సభామధ్యలో నిలబడి ప్రతిజ్ఞ చేస్తుంది." అని అన్నాడు. ఆ దూతలు రాముని వద్దకు వచ్చి వాల్మీకి మహర్షి చెప్పిన మాటలను చెప్పారు.

అప్పుడు రాముడు సభాసదులను చూచి ఇలా అన్నాడు. "సభాసదులారా! మహా ఋషులారా! పురప్రముఖులారా! నీతి కోవిదులారా! రేపటి దినమున సీత సభాభవన మధ్యలో మీ అందరి ఎదుట నిలబడి తన నిర్దోషిత్వమును నిరూపించుకుంటూ ప్రతిజ్ఞ చేస్తుంది. మీరందరూ వచ్చి సీత చేయబోవు ప్రతిజ్ఞను వినండి." అని అన్నాడు.

"రామా! ఇలా చేయడం నీకే తగునయ్యా! ఇలా చేయడం భూమి మీద ఎవరి తరమూ కాదు!" అని సభాసదులందరూ ముక్త కంఠంతో అరిచారు.

("ఉపపన్నం నరశ్రేష్ట! త్వయ్యేవ భువి నాన్యత:" ఈ మాటలలో శ్లేష గమనించండి.)

తరువాత రాముడు సభ మరునాడు సమావేశమవుతుంది అని ప్రకటించి యాగశాలకు వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము తొంబై ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము
తొంబై ఆరవ సర్గ.

మరునాడు తెల్లవారింది. అందరూ సభకు వచ్చారు. వసిష్టుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, విశ్వామిత్రుడు, దుర్వాసుడు, పులస్త్యుడు, శక్తి, భార్గవుడు, వామనుడు, మార్కండేయుడు, మౌద్గల్యుడు, గర్గుడు, చ్యవనుడు, శతానందుడు, భరద్వాజుడు, అగ్నిపుత్రుడు, నారదుడు, పర్వతుడు, గౌతముడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, అగస్త్యుడు, ఇంకా ఇతర మునులు వేదవేదాంగపారంగతులైన బ్రాహ్మణోత్తములు, ఆ సభకు

వచ్చారు. వానరులు, వానర వీరులు, విభీషణుడు అతనితో వచ్చిన రాక్షస ప్రముఖులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, జ్ఞానులు, యోగులు, వీరందరూ సీత చేయబోవు ప్రతిజ్ఞను వినడానికి వేలాది మందిగా వచ్చారు.

రాముడు సింహాసనము మీద కూర్చుని ఉన్నాడు. వాల్మీకి సభలోకి ప్రవేశించాడు. ఆయన వెంట సీత కళ్లలో కన్నీరు నిండగా మనసులో రాముని స్మరించుకుంటూ సభామధ్యకు వచ్చింది. సీతనుచూచిన సభాసదులు ఆశ్చర్యంతో ఆమెను చూస్తున్నారు. వారందరూ జీవితమంతా కష్టములు పడుతున్న సీతను చూచి దు:ఖించారు. సభలో ఉన్న వారు కొంత మంది రాముని చర్యను పొగిడితే, మరి కొందరు సీతను సమర్థించారు. మరి కొందరు సీతారాములకు జయజయధ్వానాలు చేసారు.

ఆ సన్నివేశాన్ని వాల్మీకి ఈ విధంగా వర్ణించాడు.

సాధు రామేతి కేచిత్తు సాధు సీతేతి చాపరే
ఉభావేవ చ తత్రాన్యే ప్రేక్షకా: సంప్రచుక్రుశ:

వాల్మీకి సభామధ్యమున నిలిచి రామునితో ఇలా అన్నాడు.

"రామా! ఉత్తమురాలు, ధర్మము తప్పనిది అయిన నీ భార్య సీతను, లోకాపవాదమునకు భయపడి నీవు నా ఆశ్రమము దగ్గర ఒంటరిగా వదిలి వెళ్లావు. నీవు అనుమతి ఇస్తే లోకాపవాదము వలన భయ పడ్డ నీకు, సీత తన పాతివ్రత్యమును, నిర్దోషిత్వమును

నిరూపించుకోగలదు. ఈ కవలలు, కుశలవులు సీతకు జన్మించిన నీ పుత్రులు. వీరిద్దరూ నీ కుమారులు. ఇది సత్యము. నేను ఎప్పుడూ అసత్యము పలకలేదు. వీరిద్దరూ నీ కుమారులు అని ప్రమాణము చేసి చెబుతున్నాను. నన్ను నమ్ము. నేను కొన్ని వేల సంవత్సరములు తపస్సు చేసాను. నీ భార్య సీతలో ఏదైనా దోషం ఉంటే నేను చేసిన ఇన్ని సంవత్సరాల తపస్సు ఎందుకూ పనికిరాకుండా అయిపోతుంది.

నేను ఇప్పటి వరకూ నా మనో వాక్కు శరీరములతో ఏ పాపమూ చేయలేదు. సీతకు ఏ పాపము తెలియదు అని నిశ్చయంగా చెబుతున్నాను. నేను సీతను అరణ్యములో చూచి నపుడు ఆమె పరిశు ద్ధురాలని గ్రహించి ఆమెకు ఆశ్రయం ఇచ్చాను. నాటి నుండి నేటి వరకూ సీత నిన్ను మనసా వాచా కర్మణా స్మరిస్తూ ఉంది. పతిదేవునిగా ఆరాధిస్తూ ఉంది. లోకాపవాదంతో భయపడుతున్న నీకు సీత తన పాతివ్రత్యమును నిరూపించుకొనే శపథం చేస్తుంది.

రామా! సీతలో ఏ దోషమూ లేదని నీకూ తెలుసు. కానీ లోకాపవాదమునకు భయపడి నీవు సీతను విడిచిపెట్టావు. నేను దివ్యదృష్టితో చూచి చెబుతున్నాను. సీత ఉత్తమురాలు, మహా పతివ్రత. ఆమెలో ఏ దోషమూ లేదు. అని నీకు తెలియజేస్తున్నాను." అని అన్నాడు వాల్మీకి.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము తొంభై ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

తొంబై ఏడవ సర్గ.

వాల్మీకి మహర్షి చెప్పిన మాటలను సావధానంగా విన్నాడు రాముడు. వాల్మీకి వెనక ఒదిగి నిలబడి ఉన్న సీతను చూచాడు. వాల్మీకి మహర్షికి భక్తితో నమస్కరించి ఇలా అన్నాడు. "మహర్షీ! తమరు పలికిన పలుకులు యదార్థములు. తమరి పలికిన పలుకుల మీద నాకు పరిపూర్ణ విశ్వాసము, నమ్మకమూ ఉన్నాయి. లంకా నగరం వద్ద, దేవతల సమక్షంలో సీత అగ్ని ప్రవేశము చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంది. అందుచేతనే ఆమెను స్వీకరించాను. కానీ, అయోధ్యలో మరొక సారి ఆమె మీద నిందమోపబడింది. లోకులు వేసిన నింద చాలా బలంగా ఉంది. అందుచేత లోకాపవాదమునకు భయపడి నేను సీతను తమరి దగ్గర విడిచిపెట్టాను. సీత ఏ పాపమూ ఎరుగదనీ, ఆమెలో ఏ దోషమూ లేదని తెలిసి కూడా లోకాపవాదమునకు వెరచి ఆమెను వదిలిపెట్టాను. దీనికి మీరు నన్ను క్షమించాలి. రామాయణకావ్యమును గానం చేసిన కవలలు నా కుమారులు అని నాకు తెలుసు. సీత అందరి మధ్య దోషము లేనిదిగా నిరూపితమైతే గానీ నేను ఆమెను తిరిగి స్వీకరించలేను." అని అన్నాడు రాముడు.

ఇంతలో దేవేంద్రుడు, దేవతలు, ఆదిత్యులు, మరుత్తులు, రుద్రులు, విశ్వేదేవతలు, సమస్తదేవతలు, సిద్ధులు, సాధ్యులు, నాగులు, మొదలగు దేవతా గణములు సీత చేయబోవు శపథమును వినుటకు అక్కడకు చేరుకున్నారు. అక్కడు వచ్చిన దేవతలందరినీ చూచి రాముడు

మరలా ఇలాఅన్నాడు.

"దేవతలారా! నాకు వాల్మీకి మహర్షి మాటల యందు నమ్మకం ఉంది. కాని జనవాక్యమునకు కట్టుబడిన నేను స్వంత నిర్ణయము తీసుకోలేను. కాబట్టి తన నిర్దోషిత్వమును నిరూపించుకోడానికి సీత ప్రమాణము చేయక తప్పదు." అని అన్నాడు రాముడు.

సభఅంతా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడు కాషాయ వస్త్రములను కట్టుకున్న సీత తల వంచుకొని సభా మధ్యకు వచ్చి నిలబడింది. సీత ఇలా అన్నది.

(సీత పలికిన పలుకులు యధాతథంగా మనం తెలుసుకుందాము.)

యథాహం రాఘవాదన్యంమనసాపి న చిన్తయే
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.
(నేను నా మనసులో రాముని తప్ప మరొకరిని తలవని దానినయితే భూదేవి నాకు దారి ఇచ్చుగాక!)

మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి
(నేను నా మనస్సుచేతా వాక్కుచేతా, కర్మ చేతా ఎల్లప్పుడూ రాముని పూజించెదనేని, భూదేవి నాకు దారి ఇచ్చు గాక!)

యథైతత్సత్యముక్తం మే వేద్మి రామాత్ పరం న చ,
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి
(నేను చెప్పిది అంతా నిజం అయితే, నాకు రాముడు తప్ప మరొక వ్యక్తిని తెలియనట్లయితే, భూదేవి నాకు దారి ఇచ్చుగాక)

పైవిధంగా సీతాదేవి సభామధ్యలో నిలబడి సభాముఖంగా పలికింది. సీత ఆ మాదిరి శపథం చేయుచుండగా ఒక అద్భుతము జరిగింది. ఒక దివ్యమైన సింహాసనము భూమిని చీల్చుకుంటూ భూమి లో నుండి పైకి వచ్చింది. ఆ సింహాసనాన్ని నాగులు మోస్తున్నాయి. ఆ సింహాసనము మీద భూదేవి కూర్చుని ఉంది. ఆమె తన చేతులు రెండూ సీత కోసం చాచింది. సీతను తన వద్దకు రమ్మని పిలిచింది. సీత తన తల్లి భూదేవివద్దకు వెళ్లింది. భూదేవి తన కుమార్తె అయిన సీతను తన కౌగిట్లోకి తీసుకుంది. తన పక్కన సింహాసనము మీద కూర్చోబెట్టుకుంది. వెంటనే ఆ సింహాసనము భూదేవి, సీతాదేవిలతో సహా రసాతలమునకు వెళ్లిపోయింది. ఆ ప్రదేశంలో భూమి మామూలుగా అయింది.

క్షణకాలంలో జరిగిన ఆ దృశ్యమును చూచిన దేవతలు పులకించి పుష్పవృష్టిని కురిపించారు. దేవతలందరూ “ఓ సీతా! నీవు ధన్యురాలవు. నీ శీలము గొప్పది” అని పెద్దగా శ్లాఘించారు.

సభలో కూర్చున్న వారందరూ ఈ దృశ్యాన్ని కళ్లప్పగించి చూస్తున్నారు. కనురెప్పపాటులో జరిగిపోయిన ఆ అద్భుతాన్ని వారు ఆశ్చర్యంతో వీక్షించారు. కొంత మంది “ఇది కలా! నిజమా!” అని ఆలోచనలో పడ్డారు. కొందరు రాముడి వంకా, సీత వెళ్లిన వంకా చూస్తున్నారు.

సీత ఆకస్మికంగా రసాతలంలో ప్రవేశించడం చూచి అందరూ ఆశ్చర్యచకితు లయ్యారు. అందరికీ స్పృహ తప్పినట్టు అయింది. సభఅంతా నిశ్శబ్దంగా మారింది.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము తొంభై ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత& ఓంతత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

తొంభై ఎనిమిదవ సర్గ.

అంతా క్షణంలో జరిగిపోయింది. అందరికళ్లముందే, అందరూ చూస్తూ ఉండగానే సీత రసాతలంలో ప్రవేశించింది. ఎవరి కోసరం తాము ప్రాణాలకు తెగించి రాక్షసులతో పోరాడామో అ సీత రాముని విడిచి తమ ఎదురుగుండా రసాతలానికి వెళ్లి పోవడం చూచిన వానరులు పెద్దగా ఏడ్చారు. అక్కడ చేరిన మునులు మాత్రం చాలా బాగా జరిగింది అని ఆమె పాతివ్రత్యాన్ని కొనియాడారు. రాముడు మాత్రం అలాగే కూలబడి పోయాడు. యజ్ఞదండాన్ని ఆనుకొని తలదించుకొని ఏడుస్తున్నాడు.

రాముడి కళ్లనుండి నీరు ధారాపాతంగా కారుతూ ఉంది. ఏదో ప్రజల కోసం ప్రమాణం చెయ్యమన్నాడే కానీ సీత ఇంత దారుణమైన నిర్ణయం తీసుకుంటుందని, తనకుశాశ్వతంగా దూరం అవుతుందనీ

అనుకోలేదు. ఆనాడు లంకలో "నీ ఇష్టంవచ్చిన వారి దగ్గరకుపో" అన్నప్పుడు "ఎక్కడికో ఎందుకు అగ్ని దేవుని వద్దకు వెళతాను" అని అగ్నిలో దూకింది సీత. ఈ నాడు ప్రమాణం చెయ్యమన్నందుకు ఏకంగా శాశ్వతంగా తన పుట్టినింటికి వెళ్లి పోయింది. ఇదంతా తలచుకుంటూ రాముడు ఏడుస్తున్నాడు.

రాముని శోకానికి అంతం లేకుండా పోయింది. ఆ శోకంలో నుండి క్రోధం పుట్టకొచ్చింది. "నా భార్య సీత. అపర లక్ష్మీదేవి. నేను చూస్తూ ఉండగానే రసాతలానికి వెళ్లిపోయింది. నా కళ్లముందే అదృశ్యం అయింది. నేను పర్ణశాలలో లేనపుడు రావణుడు నా సీతను అపహరించుకు పోయాడు. నేను సముద్రము దాటి లంకకు పోయి రావణుని చంపి నా సీతను తిరిగి తెచ్చుకున్నాను. ఇప్పుడు ఈ రోజు నా కళ్లఎదురుగుండా నేను చూస్తూ ఉండగానే భూదేవి నా సీతను తీసుకొని పోయింది. నేను ఊరుకుంటానా! రావణాసురుడినే చంపిన వాడిని. ఈ భూదేవి ఎంత? ఓ భూదేవీ! నా సీతను తిరిగి నాకు ఇవ్వు. లేకపోతే నేనేమిటో నా పరాక్రమము ఏమిటో నీకు రుచి చూపిస్తాను. ఒక విధంగా నీవు నాకు కన్యనిచ్చిన తల్లివి. (అత్తగారివి). నా సీత నీ నుండి పుట్టింది కదా! నా సీతను నాకు తిరిగి ఇమ్ము. లేదా నాకు కూడా దారి ఇమ్ము. రసాతలంలో గానీ, స్వర్గంలో కానీ నేను నా సీతతోనే ఉంటాను. నా సీత కోసరం నేను పిచ్చివాడినయ్యాను. ఈ కోపంలో నేను ఏమైనా చేస్తాను. నా సీతను నాకు తిరిగి ఇస్తావా లేక ఈ భూమి అంతా జలమయం చెయ్యమంటావా! పర్వతాలు, కొండలు, అడవులు, చెట్లు అన్నీ చదును చెయ్యమంటావా! అగ్నితో దగ్ధం చెయ్యమంటావా! ఏం చెయ్యమంటావో చెప్పు?" అని

కోపంతో ఊగిపోతూ రాముడు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు.

రాముని ఓదార్చడానికి కానీ రాముని కోపాన్ని శాంత పరచడానికి కానీ ఎవరికీ ధైర్యం చాలలేదు. అప్పుడు బ్రహ్మదేవుడు రాముని వద్దకు వచ్చాడు. "రామా! ఏమిటీ పామరత్వము. నీవు ఎవరవో నీకు తెలియదా! తెలిసే ఇలా శోకిస్తున్నావా! నీవు ఎవరివో ఒక్కసారి గుర్తు తెచ్చుకో. నేను నీకు చెప్పడం లేదు. నీవే ఆలోచించు. నీ భార్య సీత నాగలోకము చేరుకుంది. నీవు స్వర్గము చేరుకున్న తరువాత ఆమె నీ దగ్గరకు వస్తుంది. ఇప్పటి దాకా నీవు వినిన రామాయణ కావ్యము నీ సందేహములు అన్నీ తీర్చగలదు. రామాయణము పూర్తిగా విను. నీవు పుట్టినది మొదలు, నీ చరిత్ర పూర్తిగా వాల్మీకి తన రామాయణంలో పొందుపరిచాడు. వాల్మీకిచే రచింపబడిన ఈ ఆది కావ్యము నీ యందే ప్రతిష్ఠితమై ఉంది. నీ గురించే చెప్పబడింది. రామాయణ కావ్యంలో నీ కీర్తి ప్రతిష్టలు వర్ణింపబడ్డాయి. రామాయణమును పూర్తిగా వింటే నీ సందేహాలు తొలగి పోతాయి. నేను, దేవతలు కలిసి నీ చరిత్రను పూర్తిగా విన్నాము. కాబట్టి నీవు కూడా రామాయణ కధను పూర్తిగా విను. నీవు ఇప్పటి దాకా చూచిన, విన్న రామాయణము తరువాతి భాగమునకు ఉత్తర కాండము అని పేరు. జరగబోవు రామ కధను నీవు ఋషులతో కలిసి విను. భవిష్యత్తులో జరగబోవు ఈ ఉత్తర కాండమును ముందు నీవు మాత్రమే వినవలెను. తరువాతనే లోకమునకు తెలియాలి."అని పలికిన బ్రహ్మదేవుడు దేవతలతో కలిసి స్వర్గలోకమునకు వెళ్లిపోయాడు.

బ్రహ్మదేవుని మాటలతో రాముడు శాంతించాడు. తన శోకాన్ని విడిచిపెట్టాడు. ఉత్తర రామ కథను వినుటకు మునులు అందరూ బ్రహ్మదేవుని అనుజ్ఞ పొంది రాముని దగ్గర కూర్చున్నారు. రామ కథ భవిష్యత్తులో ఎన్నిమలుపులు తిరగబోతుందో అని అంతా ఆతురతగా ఎదురుచూస్తున్నారు. రాముడు కూడా రాబోవుకాలములో జరగబోవు తన కథను వినడానికి మునులతో సహా కూర్చున్నాడు.

అప్పుడు భూమి లోనుండి ఒక ధ్వని వినబడింది.

"రామా! నీకు కలిగిన శోకము దైవికము. దానిని వదిలిపెట్టు. నీవు సీతను చేజేతులా పోగొట్టుకున్నావు. ఇప్పుడు నీవు కావాలని కోరినా ఆమె నీకు దక్కదు. ఆమె ప్రస్తుతము నాగలోకంలో నాగులపూజలు అందుకుంటూ ఉంది. ఆమె త్రిలోకములలో పూజలందుకుంటుంది.

ఆమె ఎవరోకాదు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు వక్షస్థలములో నివసిస్తున్న లక్ష్మీదేవి అవతారము. కాబట్టి ఆమెను చూడాలని కానీ, తిరిగి ఆమె పొందాలని కానీ అనుకోకు. ఆ ఆలోచన విరమించుకో. నీ కుమారులు, సీతాదేవి పుత్రులు, అయిన కుశలవులలో ఆమెను చూచుకో. వారు ఆమెకు ప్రతిరూపము. ఆ ప్రకారంగా సీతారాములు ఎల్లప్పుడూ శాశ్వతంగా ప్రజల హృదయాలలో నిలిచి ఉంటారు. ఈ రోజు అంతఃపురమునకు వెళ్లు. రేపు వచ్చి రామాయణంలో జరగబోవు కథను విను."అని వినబడింది.

రాముడు అదే ప్రకారంగా సభ రేపటి రోజు జరుగుతుంది అని ప్రకటించాడు. వాల్మీకి కుశలవులను తీసుకొని తనపర్ణశాలకు వెళ్లిపోయాడు. రాముడు రాత్రి అంతా సీతను గురించి ఆలోచనలతోనే గడిపాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండముతొంభై ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

తొంభై తొమ్మిదవ సర్గ.

సీతాదేవి రసాతలంలో ప్రవేశించిన మరునాడు రాముడు సభకు వచ్చాడు. వాల్మీకిని ఆయన శిష్యులను పిలిపించాడు. రామాయణ కావ్య గానమును కొనసాగించమని చెప్పాడు. రాముని ఆదేశము మేరకు కుశలవులు రామాయణ కావ్యమును శ్రావ్యంగా గానం చేస్తున్నారు.

సీత రసాతలములో ప్రవేశించింది. అశ్వమేధ యాగము పూర్తి అయింది. కాని సీతను గురించి రాముని శోకమునకు అంతులేకుండా పోయింది. సీత ఈ లోకంలో లేదు అన్న భావనతో రాముడికి ఈ లోకం అంతా శూన్యంగా తోచింది. రాముడికి మన:శాంతి కరువయింది. తన దు:ఖమును అంతా మనసులో దాచుకొని పైకి గంభీరంగా దైనందిన కార్యములను నిర్వర్తిస్తున్నాడు. యజ్ఞమునకు వచ్చిన కిష్కింధా వాసులను,

లంకా నగర వాసులను తగిన కానుకలు ఇచ్చి పంపాడు. బ్రాహ్మణులకు దానాలు చేసాడు. మనసులో సీతను నిలుపుకొని అయోధ్యలో ప్రవేశించాడు. రాముడు తన జీవితములో మరొక స్త్రీని పరిగ్రహించలేదు. సీతకు మారుగా ఒక బంగారు ప్రతిమను అచ్చు సీత రూపంలో తయారు చేయించాడు. భార్యతో చేయవలసిన యజ్ఞ యాగములు క్రతువులు అన్నీ సీత యొక్క బంగారు ప్రతిమను పక్కన పెట్టుకొని, సీత తన పక్కనే సజీవంగా కూర్చుని ఉన్నదని భావించుకుంటూ చేసేవాడు.

ఆ ప్రకారంగా రాముడు పదివేల సంవత్సరములు రాజ్యపాలన చేసాడు. ఈ పదివేల సంవత్సరములలో లెక్కలేనన్ని అశ్వమేధ యాగములు, వాజపేయములు చేసాడు. దాన ధర్మాలు విరివిగా చేసాడు. అగ్నిష్టోమము, అతి రాత్రము, గోసవము మొదలగు యజ్ఞములను చేసాడు. ఇలా చాలాకాలము గడిచిపోయింది. రాముని రాజ్యపాలనలో ప్రజలు సామంత రాజులు ఎంతో సంతోషంగా ఉండేవారు. సకాలంలో మేఘాలు వర్షాలు కురిసేవి. గ్రామములు, పట్టణములు, నగరములు ధన ధాన్యములతో సమృద్ధిగా ఉండేవి. రాముని రాజ్యములో అకాల మరణములు లేవు. వ్యాధులు లేవు. కరువు కాటకములు లేవు. అనర్థములు లేవు. అంతాసుభిక్షంగా ఉండేది.

కొంత కాలానికి రాముని తల్లి కౌసల్య మరణించింది. ఆమె తరువాత సుమిత్ర, కైకేయికూడా మరణించారు. వారుముగ్గురూ మరణించి స్వర్గంలో ఉన్న దశరథమహారాజును కలుసుకున్నారు. రాముడు తన తల్లులు ముగ్గురికీ కర్మక్రతువులు, జలతర్పణములు, దాన

ధర్మాలు యధావిధిగా చేసాడు. ఈ ప్రకారంగా రాముడు కొన్ని వేల సంవత్సరములు సుఖంగా రాజ్యపాలన చేసాడు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము తొంభైతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
నూరవ సర్గ.

కొంత కాలము తరువాత కేకయ దేశపు రాజు యుధాజిత్తు, తన పురోహితుడైన గార్హ్యుడిని రాముని వద్దకు పంపాడు. ఆ పురోహితుడి ద్వారా యుధాజిత్తు రామునికి వెలలేని కానుకలు ఎన్నో పంపాడు. రాముడు గార్హ్యుడిని సాదరంగా ఆహ్వానించాడు. పూజించాడు.

“మహాత్మా! మీరు మా భరతుని మేనమామ వద్దనుండి వచ్చారు. ఆయన వద్దనుండి ఏమి సందేశము తీసుకొని వచ్చారు.” అని అడిగాడు రాముడు. “రామా! మీ మేనమామ చెప్పిన మాటలను చెబుతాను విను. మా కేకయ దేశము పక్కన ఉన్న సింధునదికి ఇరుపక్కలా గంధర్వులు నివసిస్తున్నారు. (అదే గాంధార దేశము. శకుని పాలించిన దేశము. నేటి ఖాందహార్). ఆ దేశము ఫలపుష్పములతో చాలా అందంగా ఉంటుంది. శైలూషుడు అనే గంధర్వుడు ఆ దేశాన్ని పరిపాలిస్తున్నాడు. ఆ దేశంలో మూడుకోట్ల మంది గంధర్వులు ఉన్నారు. ఆ

గంధర్వ రాజ్యము మన సరిహద్దులో ఉన్నందున, కేకయ రాజు దానిని ఆక్రమించుకోవాలని అనుకుంటున్నాడు. మీరు మీ సైన్యములతో వచ్చి ఆ గాంధార రాజ్యమును జయించి, అక్కడ రెండు మహానగరాలను నిర్మించాలి. ఆ గాంధార రాజ్యమును నీవు చూస్తే వదిలిపెట్టవు. నీవు తప్ప మరొకరు ఆ రాజ్యమును ఆక్రమించలేరు." అని అన్నాడు.

రాముడు భరతుని వంక చూచాడు. భరతుడు సరే అన్నట్టు తలూపాడు. "తప్పకుండా అలాగే చేద్దాము. మాభరతుడు తన కుమారులైన తక్షుడు, పుష్కలుడు తో సహా గాంధార దేశమును జయించి ఆక్రమించుకుంటారు. తరువాత మా భరతుడు మీరుకోరినట్టు రెండు నగరములను నిర్మించి తన కుమారులను ఆ నగరములకు పట్టాభిషిక్తులను చేసి తిరిగి నా వద్దకు రాగలడు." అని అన్నాడు రాముడు.

రాముడు వెంటనే భరతుని కుమారులను పిలిపించి, వారిని తాను గాంధార దేశమును జయించి నిర్మించబోవు మహానగరములకు పట్టాభిషిక్తులను చేసాడు. తరువాత భరతుడు, తన కుమారులతోనూ అపార సేనావాహినితోనూ గాంధార రాజ్యం మీదికి దండయాత్రకు బయలుదేరాడు. భరతుడు ఒకటిన్నర నెలలు ప్రయాణం చేసి కేకయ దేశము చేరుకున్నాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము నూరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నూటొకటవ సర్గ.

తన కోరికను మన్నించి అపార సేనావాహినితో వచ్చిన భరతుని, అతని కుమారులను సాదరంగా ఆహ్వానించాడు భరతుని మేనమామ యుధాజిత్తు. తన వద్ద ఉన్న సైన్యమును కూడా భరతుని సైన్యముతో కలిపాడు. రెండు సైన్యాలు కలిసి గాంధార దేశము మీదికి యుద్ధానికి వెళ్లాయి. కేకయ దేశపురాజు తమ మీదికి యుద్ధానికి వచ్చాడని తెలిసి గంధర్వులు కూడా యుద్ధానికి సన్నద్ధం అయ్యారు. కేకయసేనలకు గంధర్వుల సేనలకు ఏడు రోజులు యుద్ధం జరిగింది. ఇరు పక్షముల వారు ఖడ్గములను, శక్తి ఆయుధములను, ధనుస్సులను, ఉపయోగించి యుద్ధం చేసారు. ఎవరినీ గెలుపు వరించలేదు. తుదకు భరతుడు పరమ దారుణమైన కాలాస్త్రమును ప్రయోగించాడు. ఆ అస్త్రము ధాటికి మూడుకోట్ల మంది గంధర్వులు నశించిపోయారు. గాంధర్వ దేశము భరతుడు స్వాధీనపరచుకున్నాడు.

గాంధర్వదేశములో రెండు మహానగరములను నిర్మించాడు భరతుడు. ఒకదానికి తన కుమారుడు తక్షుని రాజుగా చేసాడు. తక్షుని పేర ఆ నగరము తక్షశిల అనే పేరుతో సార్థకము అయింది.(ఈ తక్షశిల క్రీస్తు పూర్వమునుండి విశ్వవిద్యాలయపీఠముగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడే చాణక్యుడు చదువుకున్నాడు. అక్కడే ఆచార్యుడుగా పనిచేసాడు.) తరువాత మరొక నగరానికి తన రెండవ కుమారుడు పుష్కలుడిని రాజుగా చేసాడు. పుష్కలుడిపేరిట ఆ నగరము పుష్కలావతి అని ప్రసిద్ధి

చెందింది. (తరువాతకుషానుల కాలంలో పురుషపురం అయింది. అదే నేటి పెషావర్ నగరము. ఈ రెండు నగరములు ప్రస్తుతం పాకిస్తాన్ లో ఉన్నాయి.)

ఆ రెండు నగరములు ధనధాన్యములతోనూ భోగభాగ్యములతోనూ, చక్కని ఉద్యానవనములతోనూ, విశాలమైన రాజవీధులతోనూ,ఎత్తైన గృహములతోనూ, దేవాలయములతోనూ, అలరారాయి. భరతుడు ఐదుసంవత్సరములు అక్కడే ఉండి. తరువాత అయోధ్యకు తిరిగి వచ్చాడు. రామునితో తాను గంధర్వులను ఎలా జయించినదీ, ఎలా రెండు నగరములను నిర్మించినదీ, వాటికి తన కుమారులను పట్టాభిషిక్తులను చేసినదీ వివరంగా చెప్పాడు. రాముడు భరతుడు చెప్పిన మాటలను విని చాలా సంతోషించాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము నూట ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నూటరెండవ సర్గ.

రాముడు లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. “లక్ష్మణా! నీ కుమారులు అంగదుడు, చంద్రకేతువు బాగా ధర్మము తెలిసిన వారు. వీరులు. పరాక్రమవంతులు. రాజ్యపాలనకు తగినవారు. వారిని కూడా

రాజ్యాభిషిక్తులను చేస్తే వారు కూడా సుఖంగా ఉంటారు. వారికి తగిన రాజ్యములను గురించి ఆలోచించు. వారికి సరిహద్దులలో ఉన్న రాజుల నుండి ఎలాంటి భయము తగాదాలు ఉండకూడదు. ఆ రాజ్యము సకల సౌభాగ్యములతో సమృద్ధిగా ఉండాలి. అటువంటి రాజ్యము కొరకు అన్వేషించు.” అని అన్నాడు రాముడు.

ఆ మాటలు విని భరతుడు ఇలా అన్నాడు. “రామా! కారుపథము అనే దేశము ఉంది. అదిసస్యశ్యామలంగా ఉంది. దానికి శత్రు రాజుల వలన భయం లేదు. అక్కడ మనము ఒక రాజధానిని నిర్మించి దానికి అంగదుని రాజుగా చేద్దాము. చంద్రకేతువునకు మరొక నగరమును నిర్మించి దానికి ఆయనను పట్టాభిషిక్తుని చేద్దాము.” అని అన్నాడు.

రాముడు వెంటనే ఆ దేశము మీద యుద్ధము ప్రకటించి ఆ రాజ్యమును స్వాధీనము చేసుకున్నాడు. అంగదుని కొరకు అంగదీయము అనే పురమునునిర్మించాడు. దానికి అంగదుని రాజును చేసాడు. చంద్రకేతువు కొరకు అమరావతిని తలదన్నే మరొక నగరమును నిర్మింపజేసాడు. దానికి చంద్రకేతుని రాజుగా చేసాడు. ఇరువురి పట్టాభిషేక మహోత్సవములు వైభవంగా జరిపించాడు రాముడు. అంగదునికి రక్షణగా లక్ష్మణుడు, చంద్రకేతుకు రక్షణగా భరతుడు వెళ్లారు. లక్ష్మణుడు, భరతుడు వారి దగ్గర ఒక సంవత్సరము పాటు ఉండి, అంగదుడు, చంద్రకేతు వారి వారి రాజ్యములలోస్థిరపడిన తరువాత, అయోధ్యకు తిరిగి వచ్చారు.

ఆ ప్రకారంగా పదివేల సంవత్సరములు గడిచిపోయాయి. రాముడు అయోధ్యను పాలిస్తుంటే, లక్ష్మణుడు, భరతుడు రామునికి సాయంగా ఉంటూ, ముగ్గురు మూడు అగ్నులవలె ప్రకాశించారు.

శ్రీమద్రామాయణము
ఉత్తర కాండము నూటరెండవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
నూట మూడవ సర్గ.

అలా కాలం గడుస్తూ ఉండగా ఒక నాడు కాల పురుషుడు ఒక ముని రూపంలో రాముని వద్దకు వచ్చాడు. లక్ష్మణునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! నేను ఒక మహానుభావుని దూతను. ఆ మహానుభావుడు ఎవరో చెప్పను. నేను వచ్చినట్టు రామునికి తెలియజెయ్యి." అని అన్నాడు. లక్ష్మణుడు వెంటనే వెళ్లి ఈ విషయం రామునికి తెలిపాడు. ఆ మునికి స్వాగత సత్కారాలుచెయ్యమని రాముడు లక్ష్మణుని ఆదేశించాడు. లక్ష్మణుడు ఆ మునిని సాదరంగా రాజ మందిరములోని ఆహ్వానించాడు. అర్ఘ్యము పాద్యము ఆసనము ఇచ్చిసత్కరించాడు.

రాముడు వచ్చి కాలపురుషునికి నమస్కరించాడు. కాలపురుషుడు రాముని ఆశీర్వదించాడు. రాముడు కాల పురుషునితో ఇలా అన్నాడు. "ఓ మహామునీ! తమరు ఎవరి దూతగా వచ్చారో వారి

యొక్క వాక్కులు నాకు వినిపించు.” అని అడిగాడు.

“రామా! నేను చెప్పబోవు విషయములు అత్యంత రహస్యములు. వాటిని ఎవరూ వినకూడదు. మనము మాటలాడుకుంటున్నప్పుడు ఎవరైనా మన దగ్గరకు వచ్చినా, మనలను చూచినా, మనము మాట్లాడుకొనే మాటలను విన్నా, వారిని నీవు చంపాలి. దీనికి ఒప్పుకుంటేనే నేను నీతో మాట్లాడతాను.” అని అన్నాడు. రాముడు దానికి అంగీకరించాడు.

లక్ష్మణుని పిలిచాడు. “లక్ష్మణా! నేను ఈ మునితో కొన్ని రహస్యములు మాట్లాడవలసి ఉన్నది. నీవు ద్వార పాలకుని పంపి వేసి, నీవే స్వయంగా ద్వారము వద్ద ఉండు. ఎవరినీ ఎట్టి పరిస్తితులలోగానీ లోపలకు రానీయకు. నీవుకూడా, నేను పిలిచేంతవరకూ లోపలకు రాకు. ఇది నా ఆజ్ఞ. దీనిని అతిక్రమిస్తే మరణదండన విధింపబడుతుంది.” అని అన్నాడు.

లక్ష్మణుడు అంగీకరించాడు. రాముడు ఆదేశించిన ప్రకారము ద్వారపాలకుని పంపివేసి తానే స్వయంగా ద్వారము దగ్గర ఉన్నాడు. రాముడు కాల పురుషుని వద్ద కూర్చుని “ఇంక తమరు చెప్పడం ప్రారంభించండి.” అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము నూటమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నూట నాలుగవ సర్గ.

"రామా! నేను కాల పురుషుడను. నేను బ్రహ్మదేవుడు పంపగా నీ వద్దకు వచ్చాను. నీతో బ్రహ్మదేవుడు ఈ మాటలు చెప్పమన్నాడు.

"రామా! లోక రక్షణార్థము నీవు రామావతారము ఎత్తావు. నీవు శ్రీమహావిష్ణువు. కల్పాంతంలో ఈ లోకం అంతా జలమయం కాగా, నీవు ఆ జలంలో శయనించి ముందుగా నన్ను సృష్టించావు. తరువాత ఆదిశేషుని సృష్టించావు. మధు,కైటభులు అనే రాక్షసుల ఎముకలతో ఈ భూమి పర్వతములతో నిండిపోయింది. నీ నాభిలోనుండి పుట్టిన పద్మములో నుండి నేను ఉద్భవించాను. నువ్వు నన్ను ప్రజాపతిగా నియమించావు. అప్పుడు నేను నిన్ను ప్రార్థించాను. నీ గురించి తపస్సు చేసాను. అప్పుడు నువ్వు నీ తేజస్సును నాకు ప్రసాదించావు. తరువాత నీవు విష్ణుత్వమును పొంది సర్వవ్యాపకుడవు అయ్యావు. నీవు అదితి గర్భంలో నుండి ఉపేంద్రుగా అవతరించి దేవతలకు సాయంచేసావు. ముల్లోకములలో ఉన్న ప్రాణులు రావణుని చేత నానా బాధలు పడుతుండగా రావణ సంహారము కొరకు నీవు రామునిగా అవతరించావు. పదకొండు వేల సంవత్సరములు భూమి మీద నివసిస్తానని నియమం పెట్టుకున్నావు. నీనియమం పూర్తి అయింది. నీవు ఇంక వైకుంఠమునకు రావలసిన సమయం ఆసన్నమయింది.

రామా! నీకు ఇంకా భూలోకంలో ఉండి ప్రజలను రక్షించవలె అనికోరిక ఉంటే అలాగే చెయ్యి. నీవు సర్వాధికారివి. అలా కాకుండా అవతార పరిసమాప్తి చెయ్యదలచుకుంటే రామావతారము చాలించి, వైకుంఠమునకు వచ్చి దేవతా గణములను పాలించు."

రామా! ఇది బ్రహ్మదేవుని సందేశము." అని అన్నాడు కాలపురుషుడు.

కాల పురుషుని మాటలు సావధానంగా విన్న రాముడు ఇలా అన్నాడు. "బ్రహ్మదేవుని పలుకులు నీ నోట వినడం నాకు చాలా ఆనందం కలిగించింది. నేను వచ్చిన పని పూర్తి అయింది. మూడు లోకములు సురక్షితంగా ఉన్నాయి. నేను ఎక్కడి నుండి వచ్చానో అక్కడికే చేరుకుంటాను. ఈ విషయంలో మరో ఆలోచన లేదు. భూలోకంలో ఎంత కాలం ఉన్నా, చివరకు నేను దేవతలను పాలించవలసిన వాడినే కదా!" అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము
ఉత్తరకాండము నూటనాల్గవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నూట ఐదవ సర్గ.

రాముడు ఈ ప్రకారంగా కాలపురుషునితో మాట్లాడుతూ ఉండగా, దుర్వాసుడు లక్ష్మణుడు నిలబడి కాపలా కాస్తున్న ద్వారం వద్దకు వచ్చాడు. "కుమారా! నేను వెంటనే రాముని చూడాలి. నా రాకను గురించి రామునికి తెలియజెయ్యి. లేకపోతే నన్ను లోపలికి పోనివ్వు." అని అన్నాడు. లక్ష్మణుడు దుర్వాసునికి వినయంగా నమస్కరించి ఇలా అన్నాడు. "మహాత్మా! నన్ను మన్నించండి. తమరు ఏ పని మీద వచ్చారో చెబితే దానిని నేనే తమరికి చేసి పెడతాను. రాముడు ప్రస్తుతము మరొక అవసరమైన పని మీద ఉన్నాడు. తమరు కొంచెం సేపు నిరీక్షించండి. రాముడే బయటకు వస్తాడు." అని అన్నాడు లక్ష్మణుడు.

దుర్వాసుడు కోపంతో మండిపోయాడు కళ్లనుండి నిప్పులు రాలుతున్నట్టు లక్ష్మణుని వంక చూచాడు. "లక్ష్మణా! నేను వచ్చానని తక్షణమే రామునికి తెలియజెయ్యి. లేక పోతే, రాముని, నిన్ను, నీ సోదరులను, సుతులను నీ రాజ్యమును సర్వనాశనం అయేట్టు శపిస్తాను. నేను నా కోపాన్ని అణచుకోలేక పోతున్నాను." అని ఉరిమాడు దుర్వాసుడు.

లక్ష్మణుడు మనసులో ఇలా అనుకున్నాడు. "రాముడి దగ్గరకు వెళితే నన్ను ఒకడినే రాముడు చంపుతాడు. రాముడి దగ్గరకు వెళ్లకపోతే ఈ ముని అందరినీ సర్వనాశనం చేస్తాడు. నా ఒక్కడి ప్రాణం కోసం

ఇంతమందిని బలిపెట్టలేను. నేనే వెళతాను." అని అనుకున్నాడు.

ద్వారం తీసుకొని లోపలకు వెళ్లాడు. కాలపురుషుడు మాట్లాడటం ఆపేసాడు. రాముడు లక్ష్మణుని చూచాడు. కాలపురుషుడు వెళ్లిపోయాడు. లక్ష్మణుడు దుర్వాసుని రాక గురించి రామునికి చెప్పాడు. రాముడు వెంటనే దుర్వాసుని వద్దకు వచ్చాడు. ఆయనను సత్కరించాడు.

రాముని చూడగానే దుర్వాసుని కోపం ఎగిరిపోయింది. "ఏమీ లేదు రామా! నేను ఒక వ్రతం చేసాను. ఈ నాటితో అది పరిసమాప్తి అయింది. నీ ఇంట్లో భోజనము చేయవలెనని వచ్చాను. ఇప్పుడు ఈ క్షణంలో ఏది ఉంటే అది పెట్టు. తింటాను." అని అన్నాడు దుర్వాసుడు. రాముడు వెంటనే దుర్వాసునికి భోజన ఏర్పాట్లు చేసాడు. దుర్వాసుడు రాముని మందిరములో భోజనము చేసి వెళ్లిపోయాడు.

అప్పుడు రాముడికి కాలపురుషుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. శోకంతో కుంగి పోయాడు. కాలపురుషునికి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు తను లక్ష్మణునికి మరణ దండన విధించాలి. ఎలాగ" అని దు:ఖిస్తున్నాడు. రాముడికి నోట మాట రావడం లేదు. మౌనంగా తనలో తాను కుమిలిపోతున్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము నూట ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర రామాయణము

నూట ఆరవ సర్గ.

చింతాక్రాంతుడై ఉన్న రాముని చూచి లక్ష్మణుడు ఇలా అన్నాడు. "రామా! కాల గతిని ఎవరు మార్చ గలరు. అంతా విధిలిఖితము. అలా జరగాల్సి ఉంది. జరిగింది. లేకపోతే ఆ సమయంలోనే దుర్వాసుడు అక్కడకు రావలెనా! నీ నియమము ప్రకారము నీవు నన్ను చంపాలి. చంపు. సందేహించకు. చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చకపోతే నరకానికిపోతారు అని నీవే కదా పదే పదే చెబుతావు. కాబట్టి నీవు అన్నమాట నెరవేర్చుకో." అని అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని మాట విన్న సభాసదులు ఏమీ మాట్లాడలేదు. కుల గురువు వసిష్టుడు లేచి ఇలా అన్నాడు. "ఈ విషయం గురించి నాకు ముందే తెలుసు. కాబట్టి లక్ష్మణుడి చంపడంకన్నా దేశబహిష్కరణ ఉత్తమము. రామా! నీవు చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చు. ధర్మస్వరూపుడవు నీవే ధర్మం తప్పితే ఇంక ప్రజలు ఎలా ధర్మంపాటిస్తారు. నీవే ధర్మం తప్పితే మూడులోకములు ధర్మం తప్పుతాయి. నీవు ఇప్పుడు లక్ష్మణుని విడిపెట్టడం ద్వారా ధర్మం రక్షింపబడుతుంది. ఎందుకంటే లక్ష్మణుడు సత్పురుషుడు. నీ తమ్ముడు. వధించడం, విడిచిపెట్టడం రెండూ సమనమే.కాబట్టి లక్ష్మణుని వదిలిపెట్టు. నీ ప్రతిజ్ఞ నెరవేరుతుంది." అని అన్నాడు వసిష్ఠుడు.

రాముడు ఆలోచించి ఇలా అన్నాడు. "కుల గురువు వసిష్ఠుల వారు చెప్పినది యదార్థము. వధించడం, విడిచిపెట్టడం రెండూ

సమానమే. కాబట్టి నేను లక్ష్మణుని వదిలివేస్తున్నాను." అని అన్నాడు.

ఆ మాట విన్న లక్ష్మణుడికి ఒక్క సారిగా కళ్లనిండుగా నీళ్లు వచ్చాయి. పుట్టినప్పటినుండి ఒక్కరోజుకూడా రాముని విడిచి ఉండలేదు. కాని ఈ రోజు రాముని శాశ్వతంగా విడిచిపెట్ట వలసి వచ్చింది. దీని కన్నా మరణం మేలుకదా అని అనుకున్నాడు. కాని రామాజ్ఞను తప్పకూడదు. అందుకని ఇంటికి కూడా వెళ్లకుండా అటునుండి అటే బయటకు వెళ్లిపోయాడు.

సరయూనదీ తీరానికి వెళ్లాడు. ఒక సమతల ప్రదేశంలో కూర్చున్నాడు. శరీరములోని నవరంధ్రములను నిగ్రహించాడు. ఊపిరి బయటకు పోకుండా బిగపట్టాడు. లక్ష్మణుడికి ఉచ్ఛ్వాసము ని:శ్వాసము నిలిచిపోయాయి. యోగసమాధిలో ఉన్నాడు లక్ష్మణుడు. ఇంద్రుడు, దేవతలు లక్ష్మణుని సశరీరంగా స్వర్గానికి తీసుకొని పోయారు. దేవతలందరూ విష్ణువులో నాలుగవ అంశ తిరిగి స్వస్థానము చేరిందని సంతోషించారు.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము నూట ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నూట ఏడవ సర్గ.

లక్ష్మణుని వదిలివేసిన తరువాత రాముడు ఏకాకి అయ్యాడు. రాజ సభకు వచ్చాడు. రాజ సభలో ఉన్న మంత్రులు సేనాపతులు పురప్రముఖులను ఉద్దేశించి ఇలా అన్నాడు. "నేను భరతుని అయోధ్యకు రాజ్యాభిషిక్తుని చేసి వానప్రస్థము వెళ్లదలచుకున్నాను. లక్ష్మణుడు పోయిన మార్గములోనే నేనూ పోతాను."అని అన్నాడు.

రాముని నిర్ణయం విని సభాసదులు నిశ్చేష్టులయ్యారు. కొంతమంది మూర్ఛపోయారు. భరతునికి ఏమి మాట్లాడాలో తోచలేదు. "రామా! నీవులేని ఈ రాజ్యము నాకు అవసరం లేదు. నాకు నీ తోటిదే లోకము. తమరు ఒక పని చేయండి. కుశుని దక్షిణ కోసల దేశమునకు. లవుని ఉత్తర కోసల దేశమునకు పట్టాభిషిక్తులుగా చేయండి. వెంటనే శత్రుఘ్నుని వద్దకు వార్తాహరులను పంపుదాము. శత్రుఘ్నుడు కూడా మనతో వస్తాడు." అని అన్నాడు భరతుడు.

ఆ మాటలు విన్న వసిష్ఠుడు, మౌనంగా ఉన్న సభికులను చూచి, రామునితో ఇలా అన్నాడు. "రామా! ఇన్నాళ్లు అయోధ్యను పాలించావు. ఇప్పుడు వానప్రస్థము వెళతాను అంటున్నావు. ఈ సభికులు ఎలా చెబితే అలా చెయ్యడం ఉత్తమము. ప్రజల మాట పాలకులకు శిరోధార్యము కదా!" అని అన్నాడు వసిష్ఠుడు.

రాముడు సభాసదులను చూచి ఇలా అన్నాడు. "సభాసదులారా! నేను నా తమ్ములతో వానప్రస్థము వెళ్లదలచుకున్నాను. మీ అభిప్రాయము ఏమి?" అని అడిగాడు.

సభికులంతా ముక్తకంఠంతో "మీరు ఎక్కడికి పోతే మేమూ అక్కడికే వస్తాము. మేమేకాదు మా భార్యాపుత్రులతో మిమ్ములను అనుసరిస్తాము. మీరు ఎక్కడికిపోతే అక్కడకు వస్తాము. మీరు లేని అయోధ్యలో మేము ఉండలేము. మిమ్ము అనుసరించి ఉండటమే మాకు ఆనందము. మీరు ఎక్కడ ఉంటే అదే మాకు అయోధ్య. అదే మాకు స్వర్గము." అని అన్నారు.

రాముడు అందుకు సమ్మతించాడు. తరువాత కుశలవుల పట్టాభిషేకమునకు ఏర్పాట్లు చకా చకా చేసారు. కుశుని దక్షిణ కోసల దేశమునకు, లవుని ఉత్తర కోసల దేశమునకు రాజులుగా అభిషేకించారు. వింధ్య పర్వత సమీపములో కుశావతి అనే నగరము రాజధానిగా దక్షిణకోసల దేశమునకు కుశుడు అభిషిక్తుడు అయ్యాడు. శ్రావస్తి అనే నగరము రాజధానిగా లవుడు ఉత్తర కోసల దేశమునకు అభిషిక్తుడు అయ్యాడు. రాముడు వారికి వేలకొలది అశ్వములను, ఏనుగులను, రథములను, అపారమైన ధనరాసులను ఇచ్చాడు. రాముడు కుశలవులను వారి వారి రాజధాని నగరములకు సాగనంపాడు. శత్రుఘ్నుని కొరకు దూతలను పంపాడు.

శ్రీమద్రామాయణము ఉత్తరకాండము

నూట ఏడవ సర్గ సంపూర్ణము ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నూట ఎనిమిదవ సర్గ.

రాముడు పంపిన దూతలు మధురా నగరమునకు వెళ్లారు. మూడురోజులు ప్రయాణం చేసి మధురా నగరం చేరుకున్నారు. అయోధ్యలో జరిగిన పరిణామాలన్నీ విశదంగా శత్రుఘ్నుడికి చెప్పారు. రాముడు చేసిన ప్రతిజ్ఞను అనుసరించి, రాముడు లక్ష్మణుని వదిలివేయడం, కుశలవుల పట్టాభిషేకము, రాముని వాన ప్రస్థ నిర్ణయము, అయోధ్యలోని పౌరులందరూ రాముని అనుసరించడానికి నిర్ణయం తీసుకోవడం, అయోధ్యానగరం నిర్మానుష్యం కాబోతోందన్న విషయము, అన్నీ వివరంగా చెప్పారు. శత్రుఘ్నుని త్వరగా బయలు దేరమని తొందర చేసారు.

శత్రుఘ్నునికి విషయం అర్థం అయింది. తాను కూడా రాముని అనుసరించవలసిన సమయం వచ్చిందని తెలుసుకున్నాడు. వెంటనే మంత్రులను పురోహితులను, పురప్రముఖులను పిలిపించాడు. అయోధ్యలో జరిగిన పరిణామాలన్నీ వారికి వివరించాడు. తాను కూడా రాముని అనుసరించవలసిన సమయం వచ్చిందని తెలియజేసాడు. వెంటనే శత్రుఘ్నుడు తన కుమారులను ఇద్దరినీ రాజ్యాభిషిక్తులను చేసాడు. పెద్దకుమారుడు సుబాహువును మధురకు, చిన్న వాడు శత్రుఘాతిని వైదిశా నగరానికి రాజులుగా చేసాడు. తనకు ఉన్న ధనాగారమును, సైన్యమును రెండు భాగాలుగా చేసి ఇద్దరు కుమారులకు సమంగా పంచి ఇచ్చాడు. ఇద్దరు కుమారులను వారి వారి రాజధానులకు

పంపి తాను అయోధ్యకు బయలుదేరాడు శత్రుఘ్నుడు.

శత్రుఘ్నుడు అయోధ్యకే చేరేటప్పటికి రాముడు తెల్లని వస్త్రములు ధరించి, మునుల మధ్యకూర్చుని ఉన్నాడు. శత్రుఘ్నుడు రాముని చూచి ఇలా అన్నాడు.

"రామా! నేను కూడా నిన్ను అనుసరిస్తాను. నా కుమారు లిద్దరినీ పట్టాభిషిక్తులను చేసి వచ్చాను. నీవు ఎక్కడికి పోతే అక్కడకు నేనూ వస్తాను." అని అన్నాడు. రాముడు దానికి సమ్మతించాడు.

రాముని వానప్రస్థ నిర్ణయము దావాగ్నిలా అటు కిష్కింధకు ఇటు లంకకు పాకిపోయింది.. కిష్కింధనుండి సుగ్రీవుడు, హనుమంతుడు మొదలగు వానరులు, లంకనుండి విభీషణుడు, రామభక్తులైన రాక్షసులు అయోధ్యకు చేరుకున్నారు. వానరులు రాక్షసులు అందరూ రామునికి నమస్కరించి ఇలా అన్నారు.

"రాజా! మేము కూడా నీతో వస్తాము. మేము లేకుండా నీవు ఒక్కడివే వెళితే మమ్ములను చంపినంత ఒట్టు." అని ఒట్టుకూడా పెట్టుకున్నారు.

సుగ్రీవుని రామునితో ఇలా అన్నాడు. "రామా! నేను కూడా అంగదుని కిష్కింధకు పట్టాభిషిక్తుని గావించి, రాజ్యము అతనికి అప్పగించి వచ్చాను. నేను కూడా నిన్ను అనుసరిస్తాను. కాదనకు." అని

అన్నాడు. రాముడు ఆ మాటలకు చలించిపోయాడు.

"మిత్రమా! సుగ్రీవా! నేను కూడా అంతే. నీవు లేకుండా స్వర్గమునకు కూడా వెళ్లను. నీవు నాతో రావచ్చును." అని అన్నాడు.

రాముడు విభీషణుని చూచి ఇలా అన్నాడు. "విభీషణా! నీవు లంకలో లేకపోతే లంకకు దిక్కు ఎవ్వరు? కాబట్టి నీవు లంకకు పోయి లంకను పాలించు. నీతో నాకు ఉన్న స్నేహభావంతో నిన్ను ఆదేశిస్తున్నాను. నీవు వెంటనే లంకకు వెళ్లు. నా మాటకు ఎదురు చెప్పవద్దు. నీకు ఆ జగన్నాధుడే శరణ్యము. నీవు నిరంతరమూ ఆ జగన్నాధుని ఆరాధించు. భజించు నీకు శుభం కలుగుతుంది." అని అన్నాడు. విభీషణుడు రాముని ఆదేశమును శిరసావహించాడు.

రాముడు హనుమంతుని తన దగ్గరగా పిలిచి ఇలా అన్నాడు. "హనుమా! నీకు బ్రహ్మదేవుడు దీర్ఘాయువును ఇచ్చాడు. నీవు బ్రహ్మగారి మాటను వృధా చేయకు. రామాయణము ఈ లోకములో ప్రచారంలో ఉన్నంతవరకూ నీవు జీవించి ఉంటావు. నీవు చిరంజీవివి." అని ఆశీర్వదించాడు రాముడు.

ఆ మాటలు విన్న హనుమ రామునితో ఇలా అన్నాడు. "రామా! నీవు చెప్పినట్లే చేసెదను. రామ కథ ఈ లోకములో నిలిచి ఉన్నంత వరకూ నేను కూడా భూమి మీద జీవించి ఉండెదను." అని అన్నాడు.

తరువాత రాముడు జాంబవంతునికి, మైందునికి ద్వివిదునికి వారు కలియుగము వచ్చువరకూ జీవించి ఉందురని వరం ఇచ్చాడు. వారు తప్ప మిగిలిన వానరములను, ఎలుగుబంట్లను తనతో రావడానికి అనుజ్ఞ ఇచ్చాడు రాముడు.

శ్రీమద్రాయాయణము
ఉత్తర కాండము నూట ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము
నూటతొమ్మిదవ సర్గ.

మరునాడు తెల్లవారగానే రాముడు పురోహితుని పిలిచి ఇలా అన్నాడు. "ఇంక నేను బయలు దేరు సమయం ఆసన్నమయింది. నా ముందు బ్రాహ్మణులు అగ్నిహోత్రము తీసుకొని నడుస్తారు. నేను వాజపేయము చేసినందుకు లభించిన వాజపేయఛత్రము నా ముందు తీసుకువెళ్లండి." అని ఆదేశించాడు.

కులగురువు వసిష్ఠుడు రాముని వానప్రస్థమునకు చేయవలసిన క్రతువులు అన్నీ పూర్తిచేసాడు. తరువాత రాముడు తెల్లని వస్త్రములు ధరించి, దర్భలు చేత పట్టుకొని సరయూ నదీ తీరానికి వెళ్లాడు. రాముడు మౌనంగా నడుస్తున్నాడు. ఎవరితో ఏమీ మాట్లాడటం లేదు. రాముని ధనుస్సు (కోదండము) మనుష్య రూపము ధరించి

రాముని వెంట నడిచింది. వేదములు, గాయత్రి, ఓంకారము, వషట్కారములు అందరూ బ్రాహ్మణ రూపములతో రాముని అనుసరించారు. ఋషులు, మునులు, బ్రాహ్మణులు, రాముడిని అనుసరించి వెళుతున్నారు. వారి వెంట అంత:పుర స్త్రీలు, పరిచారికలు, వెళుతున్నారు. భరతుడు, శత్రుఘ్నుడు తమ అంత:పుర కాంతలతో కలిసి తమ తమ అగ్నిహోత్రములతో సహా రాముని వెంట వెళుతున్నారు. వారి వెనుక మంత్రులు సేనాధి పతులు, సామంతులు, వారి అనుచరులు, భార్యాపిల్లలతో కలిసి రాముని వెంట వెళుతున్నారు. రాముని వెంట వెళు తున్న స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు అంతా అమితోత్సాహంతో రాముని అనుసరిస్తున్నారు. రాముడు ఎక్కడకు వెళితే అక్కడకు వెళ్లడానికి సిద్ధమే అన్నట్టు రాముని వెంట వెళుతున్నారు. వారిలో “అయ్యో ఎందుకు వెళుతున్నామా” అని అనుకున్న వాడు లేడు. ఎవరికీ దు:ఖము లేదు. అందరూ ఆనందంతో రాముని అనుసరిస్తున్నారు. రాముడు వెళు తున్న దారిలో ఉన్న పల్లెలలో ఉన్న ప్రజలు కూడా తమ తమ పనులు వదిలిపెట్టి రాముని అనుసరించారు. అయోధ్యలో ఉన్న ప్రజలు అందరూ రాముని అనుసరించారు. వారివెంట వానరములు భల్లూకములు, రాక్షసులు అనుసరించారు. రాముడు వెళుతుంటే వృక్షములు, కొండలు గుట్టలు కూడా కన్నీరు కార్చాయి. ఇంతెందుకు అయోధ్యా నగరంలో గాలిపీల్చే ఒక్క ప్రాణి కూడా లేదు. అన్నీ రాముని అనుసరించాయి. అయోధ్య నిర్మానుష్యం అయింది.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నూటతొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తరకాండము

నూటపదవ సర్గ.

అయోధ్యకు ఒకటిన్నర యోజనముల దూరంలో ఉన్న సరయూనదీ తీరానికి చేరుకున్నాడు రాముడు. ఆ కాలంలో సరయూ నది పవిత్రజలాలతో నిండుగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ ఉంది. ఆ సమయంలో బ్రహ్మదేవుడు దేవతలతో సహా రాముడు వద్దకు వచ్చి ఆకాశంలో నిలబడ్డాడు. బ్రహ్మదేవుని తేజస్సుతో ఆకాశం అంతా తేజోమయం అయింది. దేవతలు రాముని మీద పుష్పవర్షము కురిపిస్తున్నారు. వాయుదేవుడు మంద్రంగా వీస్తున్నాడు. గంధర్వులు మృదుమధురంగా గానం చేస్తున్నారు. అప్సరసలు నృత్యం చేస్తున్నారు.

బ్రహ్మ దేవుడు ఆకాశము నుండి రామునికి వినబడేటట్టుగా "ఓ శ్రీ మహా విష్ణూ! స్వర్గలోకానికి నీకు స్వాగతం. మా భాగ్యవశంతో మరలా నీవు మరలా స్వర్గలోక ప్రవేశం చేస్తున్నావు. రామా! నీ సోదరులతో సహా నీ పూర్వదేహంలో ప్రవేశించు. నీవు నిరాకారమూ, సర్వవ్యాపకమూ అయిన వైష్ణవ తేజంలో కానీ, శుద్ధసత్వగుణప్రధానమైన బ్రహ్మస్వరూపములో గానీ ప్రవేశించు. నీ ఇష్టం." అని పలికాడు బ్రహ్మ.

రాముడు తన తమ్ములతో సహా సర్వవ్యాపకము అయిన వైష్ణవ తేజంలో సశరీరంగా ప్రవేశించాడు.

రామావతారం పరిసమాప్తి అయింది. ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం శాంతి: ఓం శాంతి: ఓం శాంతి:.

విష్ణుతేజంలో లీనమైపోయిన రాముని దేవతలు, సిద్ధులు, సాధ్యులు, మరుద్గణములు, ఇంద్రుడు, అగ్ని, ఋషులు, గంధర్వులు, అప్సరసలు, గరుడుడు, నాగులు,యక్షులు, దైత్యులు, దానవులు మొదలగు వారు భక్తితో పూజించారు. రాముడు వైష్ణవ తేజంలో ప్రవేశించడంతో స్వర్గం పరిపుష్ఠమయింది.

వైష్ణవ తేజంలో ప్రవేశించిన రాముడు బ్రహ్మతో ఇలా అన్నాడు. "నా తోపాటు అయోధ్యావాసులు, వానరులు, రాక్షసులు ఇంకా చాలామంది వచ్చారు. నామీద భక్తితో వారు నన్ను అనుసరించారు. నా కోసం తమ శరీరాలను వదిలిపెట్టారు. వారందరికీ ఉత్తమ లోకములు ప్రసాదించు." అని పలికాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు వారికోసం సంతానకము అనే లోకాన్ని సృష్టించాడు. వారిని ఆ లోకానికి పంపాడు. "ఓ విష్ణూ! నిన్ను అనుసరించి నీ కోసం దేహాలు వదిలిన ప్రాణులన్నీ సంతానకము అనే పుణ్య లోకాన్ని పొందుతారు." అని అన్నాడు.

బ్రహ్మవాక్కు ప్రకారము రాముని అనుసరించిన వారందరూ సంతానకమనే లోకంలోకి ప్రవేశించారు. సుగ్రీవుడు సూర్యలోకంలో ప్రవేశించాడు. దేవతా అంశలతో పుట్టిన వానరులు తమ తమ పితృ అంశలలో ప్రవేశించారు.

బ్రహ్మదేవుడు ఈ విధంగా పలుకుతూ ఉంటే రామునితో వచ్చిన అయోధ్యావాసులు సరయూనదిలో ప్రవేశించారు. తమ తమ మానుష శరీరాలను వదిలి పెట్టి దేవతలు తెచ్చిన విమానాలలో ఎక్కి సంతాన లోకమునకు వెళ్లిపోయారు. కేవలం మానవులే కాదు రాముని అనుసరించిన పశువులు, మృగములు పక్షులు కూడా సరయూనదిలో దూకి, ప్రాణత్యాగము చేసి ఉత్తమ లోకములకు వెళ్లిపోయాయి. సరయూనదీ జలాలను తాకిన వెంటనే వాటికి ముక్తిలభించింది. రాముని వెంట వచ్చిన ప్రాణులన్నింటికీ స్వర్గలోక ప్రాప్తి కలిగించి, బ్రహ్మదేవుడు దేవతలతో సహా బ్రహ్మలోకమునకు వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము నూటపదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉత్తర కాండము

నూటపదకొండవ సర్గ.

శ్రీమద్రామాయణ మహాత్మ్యము.

ఉత్తరాకాండ సహితమైన ఈ రామాయణ మహా కావ్యము బ్రహ్మపూజితము. రామాయణము అనే పేరుతో ఈ మహాకావ్యము వాల్మీకి మహర్షిచేత రచింపబడినది. ఈ అనంత విశ్వంలో అణువుఅణువునా వ్యాపించి ఉన్న శ్రీమహావిష్ణువు రామావతారము చాలించి తన పూర్వరూపమైన విష్ణుతేజమును పొందాడు. స్వర్గంలో ప్రతిష్ఠితుడయ్యాడు.

ఇది శ్రీమహావిష్ణువు రామావతార చరిత్ర. దీనిని స్వర్గలోకములో దేవతలు, మునులు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు నిత్యం పారాయణ చేస్తుంటారు.

ఈ రామాయణ కావ్యము చదివినా, వినినా, గానం చేసినా, వారికి ఆయుష్షు వృద్ధిఅవుతుంది. నిత్య సౌభాగ్యంతో తులతూగుతారు. పుత్రసంతానం కలుగుతుంది. ధనము లేని వారికి ధనము వృద్ధి చెందుతుంది.

ఈ రామాయణ కావ్యంలో కనీసం ఒక్క శ్లోకం చదివినా, వారు చేసిన పాపాలన్నీ పటాపంచలవుతాయి. అంతేకాదు, ప్రతిదినము పాపం చేసేవాడు కూడా, రోజూ ఈ రామాయణంలో ఒక్క శ్లోకం చదివితే ఆ రోజు చేసిన పాపాలు పోతాయి.

ఈ రామాయణ కావ్యము వేదముతో సమానమైనది. శ్రాద్ధసమయములలో రామాయణము పఠించతగినది.

ఈ రామాయణము బ్రాహ్మణులచేత చదివించుకొనవలెను. చదివిన వారికి గోవులు, బంగారము, ధనము దానంగా ఇవ్వాలి. ఈ రామాయణము చదివిన వాడు సంతోషిస్తే దేవతలు కూడా సంతోషిస్తారు. ఆయుష్షను పెంచే ఈ రామాయణమును చదివే వాడు పుత్ర పౌత్ర సమేతంగా ఈలోకంలో పూజింపబడతాడు. మరణించిన తరువాత ఉత్తమ లోకములను పొందుతాడు.

ఉదయం సమయంలో గానీ, మధ్యాహ్న సమయంలో గానీ, సాయం సమయంలో గానీ రామాయణము పఠించు వాడు ఎన్నటికీ చెడిపోడు.

ఈ రామాయణములో కనీసం ఒక్క సర్గ చదివినా వినినా వేయి అశ్వమేధయాగములు చేసిన పుణ్యం లభిస్తుంది.

రామాయణము వింటే గంగానదీలోస్నానం చేసిన పుణ్యము, కాశీ, గయా, ప్రయాగ మొదలగు క్షేత్రములు దర్శించినపుణ్యము లభిస్తుంది.

రామాయణము చదివినా, విన్నా, వానికి గ్రహణ కాలములో కురుక్షేత్రములో బంగారము దానం చేసిన పుణ్యం లభిస్తుంది.

ఈ రామాయణాన్ని శ్రద్ధతో చదివినా, విన్నా, మరణానంతరము వాడు విష్ణుసాయుజ్యము పొందుతాడు. అతని భార్యా పుత్రులు సంతానము తోనూ, సంపదలతోనూ వృద్ధి పొందుతారు.

ఈ రామాయణ మహా కావ్యము గాయత్రీ స్వరూపము. ఈ సత్యమును గ్రహించి రామాయణమును పరిశుద్ధమైన అంత:కరణముతో చదవాలి.

రామాయణము ప్రతిదినము పఠించే వాడు దీర్ఘాయుష్షును పొందుతాడు. కాబట్టి ప్రతి మానవుడు ప్రతిరోజూ రాముని స్మరించాలి. రాముని ధ్యానించాలి. రామాయణము చదవాలి. ఇతరులకు వినిపించాలి.

రామాయణమును చదివినవారే కాదు, వారి తండ్రులు, తాతలు, ముత్తాతలు కూడా విష్ణుసాయుజ్యం పొందుతారు. చదివినవారి పుణ్యం వారికీ లభిస్తుంది.

రామాయణ మహా కావ్యము ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే నాలుగు పురుషార్థములను ఇస్తుంది. కాబట్టి రామాయణ నిత్య పారాయణము ప్రతి మానవుని కర్తవ్యము.

రాముని అవతార పరిసమాప్తి అయిన తరువాత చాలా సంవత్సరములు అయోధ్య నిర్మానుష్యంగా ఉంటుంది. తరువాత ఋషభుడు అనే రాజు వచ్చి అయోధ్యను పాలిస్తాడు. క్రమక్రమంగా అయోధ్య మనుష్యులతో, ఇతర ప్రాణులతో క్రిక్కిరిసిపోతుంది. అయోధ్య భారతదేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది.

భవిష్యత్కథతోనూ ఉత్తర కాండతోనూ నిండిన ఈ రామాయణ కావ్యము ప్రచేతసుని పుత్రుడైన వాల్మీకి మహర్షిచేత రచింపబడి, బ్రహ్మచేత ఆమోదింపబడి, దీనిని పఠించిన, విన్న, సర్వజనులకు ఆయుర్వర్ధకము, మంగళకరము అవుతుంది. ఇది బ్రహ్మవాక్కు.

ఈ విషయాన్ని మనమందరమూ ఎలుగెత్తి ముక్తకంఠంతో లోకానికి చాటిచెప్పాలి. ఇది ప్రతి మానవుడి తక్షణ కర్తవ్యము.

శ్రీమద్రామాయణము

ఉత్తర కాండము నూటపదకొండవసర్గ సంపూర్ణము.

శ్రీమద్రామాయణ మహా కావ్యము సర్వం సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

ఉపసంహారము

ఈ రామాయణ కావ్యమును రాయమని నన్ను

శ్రీ పరిటాల గోపీకృష్ణగారు ప్రేరేపించారు.

శ్రీ కె.వి.ఆర్.రావుగారు ప్రోత్సహించారు.

భక్తిపేజెస్‌కు కృష్ణార్జునులు అయిన

శ్రీ విష్ణుప్రసాద్ గారు, శ్రీ కె.వి.ఆర్.రావుగారు సహకరించారు.

సీతాలక్ష్మణభరతశత్రుఘ్న ఆంజనేయసమేత

శ్రీరామచంద్రమూర్తి ఆశీర్వదించాడు.

వీరందరి ఆశీర్వచన బలంతో నేను ఈ రామాయణ రచనను

నిర్విఘ్నంగా నిరాటంకంగా పూర్తిచేయగలిగాను.

వీరందరికీ నా కృతజ్ఞతాభివందనములు.

ఓం శాంతి: ఓం శాంతి: ఓం శాంతి:.